
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

21-3-'51

విషయానుక్రమణిక

21 మార్చి 1951

ముఖచిత్రం:

వ్యాసాలు:

సీరియల్:

కథలు:

నాటిక:

సినిమా:

బొమ్మరిల్లు:

గేయం:

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు


ప్రతి బుధవారము

ప్రకటింపబడును

సంపుటము **43**
సంచిక **27**

Founder : K. NAGESWARA RAO

వికృతి సంవత్సర ఫాల్గున శుద్ధ త్రయోదశి బుధవారము



ప్రమాదం!

కాశ్మీర్ పరిస్థితి ప్రమాదభరితమైనదని నిరూపించడం ఎంత కష్టమో సర్ జఫ్రుల్లాఖాన్ భద్రతామండలిలో వివరించారు.

పాకిస్తానులో

ఎ. సోఫ్రోనోవ్

[ఒక సోవియట్ రచయిత అనుభవాలు]

★

7. కరాచీలో సభలు :

లాహోరులోలాగే కరాచీలో కూడా అనేకమంది మేధావులను కలుసుకొనిమాట్లాడాము. ఈ విధంగా ఏర్పాటుచేయబడిన సమావేశాలలో మొదటివాటిల్లో ఒకటి పత్రికావిలేకరుల సంఘంతో జరిగినది. సింధురాష్ట్ర పత్రికావిలేకరుల సంఘంలో వివిధపక్షాలవారున్నారు. తీవ్రవాదులూ, మితవాగులూ, సోవియట్ యూనియన్‌తో స్నేహం వాంఛిస్తూ, సోవియట్ ప్రజలజీవితంలోనూ, సంస్కృతిలోనూ ఆసక్తి కలవాళ్లూ ఉన్నారు. మేము కొద్దిరోజులకు కరాచీ చేరుతామనగా "సింధ్ అబ్జర్వర్" పత్రికలో పనిచేసే విలేఖరులు సమ్మెజరిపారు. ఆ పత్రికయొక్క సంపాదకవర్గంలో ఒకరు అభ్యుదయ భావాలుగల విలేకరిని బర్తరఫ్ చేసినందుకు ఆక్షేపణగా విలేఖరులు సమ్మె సాగించి తొలగించిన విలేకరిని మళ్ళా తీసుకోవాలనీ, సంపాదక వర్గంలో మనిషిని తొలగించాలనీ కోరారు. నెలరోజులు సమ్మెసాగి పత్రిక నిలచిపోయిన అనంతరం విలేకరులు విజయం సాధించారు. సంపాదకుడు పంపివేయబడ్డాడు. విలేఖరి తిరిగి పనిలోకి తీసుకోబడ్డాడు. పత్రికా ప్రచురణ మరల సాగింది. కాని, సమ్మెసాగించారన్న కక్షతో పోలీసులు సమ్మెకమిటీకి చెందిన అయిదుగురు విలేకరులను ఎరెస్టుచేశారు.

కరాచీ పత్రికా విలేఖరులను మేము కలుసుకొనటానికి తోడ్పడినవారు విలేకరుల యూనియనులోని వామపక్షంవారు.

కరాచీలో ఇటువంటి సమావేశాలు జరపదగిన క్లబ్బులు గాని, ఇతరస్థలాలుగాని లేనందున హోటళ్లలోనూ, టీ దుకాణాలలోనూ జేరవలిసి ఉంటుంది. మామీద అన్నిరకాల ప్రశ్నలూ కురిపించారు. అందులో కొన్ని మాకు నవ్వు తెప్పించాయి. మరి కొన్నిటికి మాదేశంలో పరిస్థితులను గురించి అతిదీర్ఘంగా వివరించవలసి వచ్చింది.

"నాదగ్గర 20 లక్షల రూపాయ లుంటే సోవియట్ యూనియన్‌లో పత్రికనొకదాన్ని కొని నా అభిప్రాయాలను స్వతంత్రంగా ప్రకటించే అవకాశం ఉంటుందా? అని ఒక ప్రసిద్ధ విలేఖరి అడిగాడు.

సోవియట్ యూనియన్‌లో స్వంతపత్రికలు లేవని సమాధానం చెప్పాము.

అతను ఇంకా చాలా ప్రశ్నలువేసి చివరకు విచారంగా, "మాదేశంలో కూడా నూటికి ఒకరో, ఇద్దరో తప్ప తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా ప్రకటించ లేరు అన్నాడు.

అతని ప్రశ్నలన్నిటికీ అదే సమాధానమని మేము చెప్పాము.

ఇదే విధంగా మరొక సమావేశం జరిగినప్పుడు ఒక అభ్యుదయ విలేఖరి ఈ విషయాలు చెప్పాడు: నార, పత్తి, తోళ్లు, పుగాకు మొదలైన ముడిపదార్థాలను బ్రిటను పాకిస్తాను నుంచి తరలించుకు పోతున్నది. బ్రిటను పాకిస్తానునుండి పుగాకు తీసుకుపోయి ఆ పుగాకుకన్న ఎన్నోరెట్లు ఖరీదైన సిగరెట్లను పంపుతుంది. పాకిస్తానునుంచి తోళ్లు ఎత్తుకొనిపోయి లిప్‌స్టిక్ పంపుతుంది. పాకిస్తానుకు వ్యవసాయ యంత్రాలూ, ఫాక్టరీలకు వేత్‌లూ కావాలి కాని బ్రిటను సైకిళ్లు పంపి, వాటికి పెడల్సు ఉన్నాయి కనక వాటిని యంత్రాలకింద జమ కడుతుంది.

పాకిస్తాన్-సోవియట్ సాంస్కృతిక సమాజంవారి కొద్దిపాటి ఆవరణలో సమావేశం జరిగినప్పుడు హృదయాన్ని స్పందించే సంఘటన ఒకటి జరిగింది. నికోలాయ్ తిఖొనోవ్ మాట్లాడుతున్నాడు. నేవాళ్లు కింద చతికిలబడి కూచున్నారు. ఈ సమయంలో ఒక యువకుడు లెనిన్, స్టాలిన్‌ల చిత్రాలు తెచ్చి గది మధ్య పెట్టాడు.

ఒకరోజు ముగ్గురు కుర్రవాళ్లు, 17 19 ఏళ్ల మధ్య వయసుగలవాళ్లు, హోటల్లో మమ్మల్ని చూడవచ్చారు. వారు చిన్నపిల్లల దస్తూరిలో కాగితంమీద కొన్ని ప్రశ్నలు రాసుకువచ్చారు. ఆ ప్రశ్నలు నవ్వు పుట్టించేలాటివి. వాటికి మేము బాగా అలవాటుపడ్డాము. వీరు కరాచీ కాలేజీలలో ఎందులోనో చదివే విద్యార్థులై ఉంటారని మేమూహించినది నిజమే అయింది. వీరు చదువుకునే ముస్లింకాలేజిలో అర్థికశాస్త్రం చెప్పేది పాకిస్తానులోని అమెరికను రాయబారవర్గంతాలూకు మొదటి కార్యదర్శి.

ఉర్దూకాలేజి ఒకదాన్ని సందర్శించాము. ఇక్కడ పాకిస్తాను రాజభాష (ఉర్దూ) చెబుతారు. ఆ కాలేజీ చూస్తే దేశంలోని పేద కాలేజీలలో ఒకటి అయి ఉంటుందనిపించింది. అందులో చదివే వాళ్లు దాదాపు అందరూ ఇతరత్రా నౌకిరి చేసి పొట్ట గడుపుకుంటూ జీతాలు కడుతున్నవారే.

మా సభలకు అంతకంతకూ ఎక్కువమంది హాజరు కాసాగారు. ఈ సభలను గురించి "డాన్" పత్రిక 5, 6 పేజీలలో ఏమూలో చిన్న చిన్నవార్తలు పడుతూ వచ్చినప్పటికి మామీద ప్రజల శ్రద్ధ చాలా హెచ్చుగా ఉండింది.

ఒక్కొక్కసమావేశమే జరుగుతున్న కొద్దీ, ఎక్కడో ఉన్న సోవియట్ దేశం నుంచి వచ్చిన మాపైన ప్రజలకు శ్రద్ధా, విశ్వాసమూ హెచ్చసాగింది.

8. కరాచీకి వీడ్కోలు:

మేము పాకిస్తాను వదలి వెళ్ళబోయే రోజు దగ్గరలోకి వస్తున్నది. సింధువిలేకరుల యూనియన్‌వారు ఈ సమయంలో అతివిజయవంతమైన సభ ఒకటి ఏర్పాటు చేశారు. పత్రికలవారూ, ఉద్యోగస్తులూ, శ్రామికులతోసహా వెయ్యిమందికిపైగా ఈసభకు హాజరైనారు. సోవియట్ సాహిత్యం గురించి నికోలాయ్ తిఖొనోవ్ ప్రసంగించాడు. "స్వేచ్ఛా, నిర్మాణయుతమైన కృషిలోగలఆనందమూ, మానవసౌఖ్యమూ, జీవితంపై అనురాగమూ, కమ్యూనిజము యొక్క ఉత్కృష్టఆదర్శాలూ, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యమూ సోవియట్ సాహిత్యంద్వారా ప్రచారమవుతాయి," అని ఆయన చెప్పినప్పుడు సభలో వెర్రి హర్షధ్వానాలు చెలరేగాయి.

పాకిస్తాను, సోవియటు సంస్కృతీ మండలివారు సోవియట్ ప్రతినిధుల కొరకు వీడ్కోలు సన్మానం ఏర్పాటుచేశారు.

(43-వ పేజీ చూడండి)

కాశ్మీర్: నెహ్రూ హెచ్చరిక ★ [సీతారామ్]

ఈసారి కాశ్మీర్‌పైన దాడిజరిగితే, అది భారతదేశంపైనే జరిగినట్లు భావించగలరని పండిట్ నెహ్రూ మార్చి 13 వ తేదీ మంగళవారం నాడు పత్రికాసమావేశంలో చెప్పారు. అంటే ఈసారి పాకిస్తాన్ సేనలుగాని పఠాన్లుగాని కాశ్మీర్‌లోని భారతసైన్యాల ఆక్రమణలో ఉన్న ప్రాంతంపైన దాడి చేసినట్లయితే, యుద్ధం కాశ్మీర్‌కే పరిమితం కాదన్నమాట. దురాక్రమణ జరిగిన వెంటనే భారతదేశం పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రకటిస్తుంది. కాశ్మీర్ మహారాజాతో ఏకమై భారతప్రభుత్వం కుట్రచేసిందని భద్రతామండలిలో పాకిస్తాన్ విదేశాంగమంత్రి సర్ జఫ్రుల్లాఖాన్ చేసిన ఆరోపణ అబద్ధమని పండిట్ నెహ్రూ అన్నారు. కాశ్మీర్ దేశరక్షణ బాధ్యతను విసర్జించి భారత సైన్యాలను పూర్తిగా ఉపసంహరించడానికి కాని, నియమబద్ధంగా స్థాపించబడిన షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని తొలగించడానికి గాని భారత ప్రభుత్వం సమ్మతించదు. పాకిస్తాన్‌లో చెలరేగుతున్న మతయుద్ధ నినాదాలకు భారతదేశం జంకబోదు. కాశ్మీర్ రాజ్యాంగపరిషన్నిర్మాణం, భద్రతామండలి తలపెట్టే ప్లెబిసైట్‌కి ఆటంకమవదని నెహ్రూ చెప్పారు.

ఎప్పటికైనా కాశ్మీర్ ప్లెబిసైట్ సమస్య భారత పాకిస్తాన్ ప్రభుత్వాల మధ్య సమాధానంవల్ల పరిష్కారం కావలసిందే కాని, ఇతరుల నిర్బంధంవల్ల పరిష్కారం కాదనీ, ప్రస్తుతం పాకిస్తాన్‌లో యుద్ధ నినాదాలవల్లనూ, సర్ జఫ్రుల్లాఖాన్ అసత్య నిందారోపణలవల్లనూ ఇప్పుడు సమాధానం కుదరడం అసంభవమనీ కూడా పండిట్ నెహ్రూ స్పష్టపరిచారు.

భద్రతామండలిలో బ్రిటన్ అమెరికాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారతప్రతినిధి నిరాకరించారు. కొన్ని సవరణలతో అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు పాకిస్తాన్ ప్రతినిధి చెప్పారు. అందువల్ల బ్రిటన్ అమెరికాలు తమ తీర్మానాన్ని సవరణచేసి ప్రవేశపెట్టడానికి కృషిచేస్తున్నాయి. ఎంత సవరణచేసినా, పాకిస్తాన్ కోరిక ప్రకారం పరిష్కర్తని (పరిష్కర్త అనే పేరుతో కాకపోయినా) నియమించడం బ్రిటన్ అమెరికాల ఆంతర్యమైనట్లు ఆ దేశాలనుంచి వస్తున్న సమాచారాన్ని బట్టి స్పష్టమౌతూనేఉంది. అన్యదేశాలసైన్యాల్ని కాశ్మీర్ తీసుకురావడానికి కూడా పాకిస్తాన్ సమ్మతించింది. ఎంత మార్చినా ఆంగ్లో - అమెరికన్ తీర్మానం ఈ రెండు అంశాలలోనూ భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు రెండింటినీ తృప్తిపరచడం అసంభవం. కాబట్టి బ్రిటన్ అమెరికాలు భద్రతామండలిలో తమకుగల బలాధిక్యతను బట్టి భారతదేశం సమ్మతించకపోయినా తమ తీర్మానాన్ని ఆమోదింపచేసినట్లయితే, దానిని భారతప్రభుత్వం మన్నించబోదని పండిట్ నెహ్రూ ప్రకటనవల్ల స్పష్టపడుతోంది.

పాకిస్తాన్ చేస్తున్నది అసత్యప్రచారమని తెలిసికూడా బ్రిటన్ అమెరికాలు భారతదేశానికి న్యాయంచేకూర్చాలనే యత్నంలో లేవు. భద్రతా మండలిలో చర్చలవల్ల కాని, ప్రచారంవల్ల కాని ప్రయోజనం శూన్యం. న్యాయాన్యాయాలతో నిమిత్తం లేకుండా బ్రిటన్ అమెరికాలు కోరినరీతిని ఐక్యరాజ్య సమితిలో కార్యసాధన చేసుకుంటున్నాయి. దీనికి కాశ్మీర్ సమస్య, చీనా ప్రాతినిధ్యసమస్య, కొరియాశాంతి సాధనసమస్యలే తార్కాణాలు. ఎటామిక్ కంట్రోల్ గురించీ, అంతర్జాతీయ సైనిక స్థాపనగురించీ అమెరికన్ల ప్రణాళికలకి రష్యా ఎందు కంగీకరించలేదో దీన్నిబట్టే స్పష్టపడుతుంది. అంతర్జాతీయ సైనిక దళాన్నే స్థాపించి వీటో అధికారం లేకుండా చేసినట్లయితే, అమెరికా దీని నేవిధంగా వినియోగిస్తుందో వేరే చెప్పనక్కరలేదు.

అందువల్లనే ఇకమీదట కాశ్మీర్ సమస్యలో భారత దేశానికి సమ్మతం కాని ఏ పరిష్కారవిధానాన్ని కాని అంగీకరించబోరని పండిట్ నెహ్రూ ముందే స్పష్టపరచవలసిన అవసరం కలిగింది.

మద్రాసు శాసనసభ: మద్రాసు శాసనసభలో బడ్జెట్ చర్చల్ని చూస్తే చిత్రమైన లక్షణాలు గోచరిస్తాయి. ప్రభుత్వ పరిపాలన గురించి తీవ్రంగా విమర్శించేది కాంగ్రెస్ సభ్యులు. ప్రతికూలపక్షాలకు చెందిన ముస్లిం లీగ్ సభ్యులూ, వాణిజ్య పారిశ్రామికసంస్థల ప్రతినిధులూ విమర్శచేస్తుంటే పొగుడుతున్నట్లు, పొగుడుతుంటే విమర్శిస్తున్నట్లు ఉంటాయి. ఈపక్షాల సభ్యులూ, మంత్రివర్గానికి హితులైన కాంగ్రెస్ సభ్యులూ అధికంగా శాసనసభలో ప్రసంగిస్తారు. మిగతా కాంగ్రెస్ సభ్యులు ఎంత జాగ్రత్తగా సవ్యంగా విమర్శచేసినా, సమాధానాలివ్వడంలో మంత్రులంతగా పట్టించుకోరు. రాజాముత్తయ్యచెట్టి, నటేశన్, ఇస్మాయిల్ మొదలైనవారి విమర్శల్లో అక్షరం అక్షరం వెతికి మంత్రులు సమాధానాలిస్తారు. వారిని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు. కోత తీర్మానాలు ప్రవేశపెట్టినా తెన్నేటి విశ్వనాథం ప్రభృతులు ప్రసంగించడానిక్కూడా అవకాశం లభించలేదు. మంత్రులజీతాలు వగైరా డిమాండ్‌పైన ప్రతికూలపక్షంవారి ప్రసంగాల్నిబట్టి నిర్ణయించాలంటే, ఏపార్టీ అభిమతాల్నిబట్టి పరిపాలన, శాసన నిర్మాణం జరుగుతోందో చెప్పడం కష్టం. మన పార్టీలసంగతి తెలియనివారెవరైనా శాసన సభాకార్యక్రమాల్ని గమనించినట్లయితే ఇది కాంగ్రెస్ పార్టీ సంఖ్యాధిక్యతకల శాసనసభ అని అనుకోరు.

పోలీసుశాఖ: పోలీసు శాఖ డిమాండ్‌పైచర్చకి మంత్రి గోపాలరెడ్డిగారు (ముఖ్యమంత్రి చినకుమారస్వామి రాజాగారి తరఫున) సమాధానమిస్తూ, ఇదివరలో బ్రిటిష్ పాలకులకు ప్రజల సంరక్షణ బాధ్యత అంతగా ముఖ్యం కాదు కాబట్టి పోలీసుశాఖనిమిత్తం ఎక్కువ ఖర్చు పెట్టలేదనీ, ఇప్పుడు ప్రభుత్వం ప్రజలదే కాబట్టి ఎక్కువ ఖర్చు పెట్టవలసి వస్తోందనీ చెప్పారు. ప్రజాస్వామ్య పరిపాలన అంటే ఏమిటో దీన్నిబట్టి అర్థం చేసుకోవలసివస్తే, ప్రజల్లో ఎంతమంది ఈ ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటారో చెప్పడం కష్టం. దేశంలో గత సంవత్సరం కంటె ఈ స్వవత్సరం నేరాలు, నేరపరిశోధన, అధికమైనాయని ప్రభుత్వం అచ్చువేసినవేదిక తెలుపుతోంది. గోపాలరెడ్డిగారి నిర్వచనాన్నిబట్టి ఇదికూడా ప్రజాస్వామ్యానికి విశిష్టలక్షణం అయుండాలి. గోపాలరెడ్డిగారింకా ఇలాచెప్పారు. ప్రజల దారిద్ర్యం, అధికధరలు, ఆహారపు కొరత, కార్మికసమస్యలు అశాంతికి కారణాలు. కాబట్టి శాంతిని కాపాడి, దీర్ఘకాలిక ప్రమాణాళికల్ని అమలుబరపాలంటే పోలీసుశాఖ ఖర్చు లెక్కువగాక తప్పదు. కాబట్టి అశాంతికి కారకులైన పేదప్రజల్ని అణగొట్టితే కాని గోపాలరెడ్డిగారి ప్రణాళికలు సాగవన్నమాట. ప్రజల్ని గురించే కాదు. గోపాలరెడ్డిగారు పోలీసుల్ని గురించికూడా ఒకమాట చెప్పారు. పోలీసు బలగాన్ని తగ్గించి వారికి ఇప్పటికంటె ఎక్కువ జీతాలిచ్చినట్లయితే, పోలీసు

((47-వ పేజీ చూడండి)

బాల్కన్ దేశాలలో అశాంతి

★

[సూర్యనారాయణ]

బాల్కన్ దేశాలలో అశాంతి బయలు దేరినట్లు ఈమధ్య వస్తున్న వార్తల్ని బట్టి తెలుస్తోంది. యుగోస్లావియాపైన హంగెరీ, రుమేనియా, బల్గేరియా సైన్యాలు దండెత్తడానికి సిద్ధంగా ఉన్నాయని యుగోస్లావ్ విదేశాంగమంత్రి ప్రకటన చేశాడు. యుగోస్లావియా పైన దాడి జరిగితే ఊరుకునేది లేదని, అమెరికన్ పాలకులు మాటిమాటికీ రష్యాను హెచ్చరిస్తున్నారు. రష్యాపై యుద్ధానికి యుగోస్లావియాను అమెరికా సంసిద్ధపరుస్తున్నదనీ, ఇటలీ యుగోస్లావియాల మధ్య తగవుకు కారణమైన ట్రియస్ట్‌లో ఉభయుల్కీ కాదని బ్రిటన్ అమెరికాలు యుద్ధస్థావరం స్థాపించినాయనీ రష్యా ఆరోపిస్తోంది. ఈ యుద్ధ సన్నాహాల ప్రచారంలోనూ పరస్పర దూషణలోనూ ఒక విషయం మాత్రం చిత్రంగా కనిపిస్తుంది. యుగోస్లావియాకి కొమిన్ఫారమ్ దేశాలవల్ల ముప్పున్నదని యుగోస్లావ్ పాలకులకంటె బ్రిటిష్ అమెరికన్ పాలకులే ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. మార్షల్ టిటో ప్రభుత్వంకంటె బ్రిటిష్ అమెరికన్ ప్రభుత్వాలే ఎక్కువ భయపడుతున్నాయి. సందర్భం ఉన్నా లేకపోయినా మాటిమాటికీ 'యుగోస్లావియా పైన దాడి జరిగితే జాగ్రత్త' అని రష్యాని హెచ్చరిస్తున్నాయి. భారత రాయబారితో ప్రసంగిస్తూ యుగోస్లావియాపైన దాడిజరిగే ప్రమాదం లేదని టిటో అన్నాడు. ఇదంతా చూస్తే బ్రిటన్ అమెరికాలు యుగోస్లావియాలో స్థావరం చిక్కించుకుని ఏదో సన్నాహం చేస్తున్నాయని అనుమానం తట్టక మానదు. 1949-50 ప్రభుత్వాల ఆయవ్యయాన్ని చూసినట్లయితే యుగోస్లావియాలో దేశరక్షణక్రింద మొత్తం ఖర్చులో 32% ఖర్చుపెడుతుంటే, పొరుగునున్న కమ్యూనిస్టుదేశాలు 8% మొదలు 15% వరకే ఖర్చుపెడుతున్నాయి. యుగోస్లావియా చేస్తున్నది ఈ ఖర్చుకాక, ఆ దేశానికి అమెరికా సప్లైచేస్తున్న ఆయుధ సామగ్రి చాలా ఉంది.

బాల్కన్ దేశాలలో అశాంతి గిచ్చి గొట్టాలని బ్రిటన్ అమెరికాలు శతధా ప్రయత్నిస్తున్నాయని బ్రిటిష్ అమెరికన్ పత్రికలవల్లనే తెలుస్తుంది. కమ్యూనిస్టుప్రభుత్వాలు కల దేశాలలో ప్రభుత్వ ప్రతికూలురైన నాయకుల్ని బలపరచడానికిగాను అమెరికాలో రాక్‌ఫెల్లర్ వాణిజ్య సంస్థ ఒక పెద్ద నిధి నేర్పాటు చేసింది. అమెరికా స్వయంగా ఆ దేశాలలో కమ్యూనిస్టువ్యతిరేకోద్యమాల్ని ధనసహాయమిచ్చి బలపరుస్తోంది. కమ్యూనిస్టుదేశాల నించి పారిపోయి వచ్చిన రాజకీయ నాయకులికి బ్రిటన్ అమెరికాలు ఆశ్రయ మివ్వడమే కాకుండా, వారిని తమ ప్రచారం నిమిత్తం ధనమిచ్చి వినియోగపరుస్తున్నాయి. రెండో ప్రపంచయుద్ధకాలంలో లండన్‌లో పోలిష్, జెకోస్లావాక్ ప్రభుత్వాల మాదిరిగానే, అదనుకి "వలస ప్రభుత్వాల్ని" స్థాపించడానికి బాల్కన్ దేశాలనాయకుల్ని లండన్‌లోనూ, వాషింగ్టన్‌లోనూ సిద్ధంగా ఉంచారు. రష్యాలో విప్లవం తేవడానికి అమెరికాలో నిధి ఏర్పరచబడింది. ఫ్రీరష్యా అనే రేడియో ద్వారా ప్రచారం అమెరికానుంచి సాగుతోంది.


అయితే బ్రిటన్ అమెరికాల కృషి ఎంత వరకు ఫలిస్తున్నదీ చెప్పడం కష్టం. ఫలించక పోయినా ఫలిస్తున్నట్లు జరిగే ఆంగ్లో అమెరికన్ ప్రచారంవల్లనూ, బొత్తిగా ఫలించదని జరిగే రష్యన్ ప్రచారంవల్లనూ సత్యం తెలియడం కష్టం.

కాని ఆల్బేనియా జెకోస్లావాకియాలలో ఇప్పుడు జరుగుతున్న కుట్రలు, నాయకుల అరెస్టులు, కొందరి పరారి అశాంతిని సూచిస్తున్నాయి. ఈఅశాంతినిగురించి అమెరికాలో జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా నమ్మలేక పోయినప్పటికీ, దానివల్ల అమెరికన్ల యత్నాలు తెలియగలవు. ఇటీవల "న్యూయార్క్ టైమ్స్"లో జెకోస్లావాకియాలో అశాంతిగురించి ఒక వార్త ప్రకటించబడింది. ఆ వార్త ప్రకారం జెకోస్లావాకియాలో బ్రిటిష్ అమెరికన్ ప్రభుత్వాల వద్ద ధనసహాయం పొంది కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కృషిచేస్తున్నవారు 23 వేలమంది ఉన్నారు. వీరి అధీనలోం లక్షా 20 వేలమంది గొరిల్లా లున్నారు. సానుభూతిపరులు మూడు లక్షలమందున్నారు. గొరిల్లాలు పరిశ్రమల్లో ఉత్పత్తినీ, వ్యావసాయికోత్పత్తినీ భగ్నపరచడానికి కృషిచేస్తున్నారనీ, ప్రభుత్వం వీరిని పట్టుకుని శిక్షించడానికి కొన్ని చోట్లకు సైనికుల్ని పంపవలసివస్తున్నదనీ ఈవార్త తెలిపింది. ఈ వార్తవచ్చిన సమయంలోనే జెకోస్లావాక్ విదేశాంగమంత్రి క్లెమెంటిస్ రాజీనామా నిచ్చి అంతర్ధానమైనాడు. తరవాత అతన్ని అరెస్టుచేసినట్లు, అతనితోపాటు మరి కొందరిని అరెస్టుచేసి ఒక కుట్రను బయలుపెట్టినట్లు ఆప్రభుత్వం ప్రకటించింది. ఆపైన భారత దేశంలోని జెక్ రాయబారి పరారై ఇంగ్లండ్‌లో ఆశ్రయం పొందాడు. క్లెమెంటిస్ అరెస్టుకి ముందే చాలా రోజులకిందట ఐక్యరాజ్యసమితిలోని జెక్ ప్రతినిధి ఉద్యోగానికి రాజీనామా నిచ్చి అమెరికాలో ఆశ్రయం పొందాడు. భారతదేశంలో రాయబారి పరారైనప్పుడే మరి నాలుగు దేశాలలో రాయబారులు రాజీనామాలిచ్చారు. వీరందరినీ సమాలోచనల నిమిత్తం స్వదేశం రావాలని ప్రభుత్వం ఆజ్ఞఇచ్చినప్పుడు రాజీనామాల నిచ్చారు. జెకోస్లావాకియాలో దాదాపు మూడువందల మంది అరెస్టయినారు.

యుగోస్లావియానుంచి నిత్యం ఆల్బేనియా, బల్గేరియా, రుమేనియా, హంగేరీ, జెకోస్లావాకియాలకు గూఢచారులు వెళ్లి వస్తున్నారనీ, కమ్యూనిస్టు ప్రభుత్వాలు వీరిని నిరోధించలేకుండా ఉన్నాయనీ అమెరికన్ పత్రికలు తెలియపరుస్తున్నాయి.

యుగోస్లావియాలో మార్షల్ టిటో సహాయంతో బాల్కన్ దేశాలన్నిటిలోనూ ప్రభుత్వ ప్రతికూలోద్యమాలు లేవదియ్యడానికి ఒకవంక సన్నాహాలు చేస్తూ, మరొక వంక యుగోస్లావియాపైన కమ్యూనిస్టు దేశాలు దాడిచెయ్యడానికి సిద్ధపడుతున్నాయని ఆంగ్లో-అమెరికన్ రాజ్యకూటం ప్రచారం ప్రారంభించింది. 1951 వేసవి ఆరంభంలో యుగోస్లావియాపై దాడీ ప్రారంభమౌతుందని నాలుగుమాసాలుగా ప్రచారం జరుగుతోంది. మార్చిలోకూడా ఈ సూచన లేవీ కనపడకపోయినా ఆంగ్లో-అమెరికన్ ప్రచారం ఆగదు. ఇదంతా

(46-వ పేజీ చూడండి)



1

నేనామెను ప్రేమించాను.

ఆమె అందాన్ని చూచికాదు. ఆమె తెలివి తేటలను చూచికాదు. ఆమె ఆర్ద్ర హృదయం చూచికాదు.

ఆమెను చూచాను.

ఆమెతో మాట్లాడాను.

ఆమెకోసం నిరీక్షించాను.

ఆమె స్నేహాన్ని చూఱగొన్నాను.

అనుకోక నే ఆమెను ప్రేమించాను.

ఆమెకన్న రూపవతులూ గుణవతులూ ఉన్నారు. నే నెఱుగుదును. కాని వారిని ప్రేమించలేదు.

అంతకన్న విద్యావతులూ, సునిశిత బుద్ధులూ నా పరిచితులలో ఉన్నారు. కాని వారిని నేను ప్రేమించలేదు.

ఆమెలో ఏ ఒక్క విశిష్టతా కొట్టవచ్చేటు కన్పించదు. ఆమె మాటలు కవిత్వంలా మనసును కలతపెట్టవు. ఆమె చేసిన ఏ కార్యమూ చరిత్రలో కెక్కవలసిన దేమీ కాదు.

ఆమె గొప్ప కావ్యాలు రాయలేదు. గొప్ప చిత్రాలు చిత్రించలేదు. గొప్ప నటీమణి కానే కాదు. కనీసం పాటకూడ పాడలేదు.

ఆమె చాల మంచిమనిషి.

ఆమె చాల గొప్పమనిషి

అంతే...

ఆ మంచితనమేదో, ఆ గొప్పదన మెలాంటిదో నేను నిర్వచించలేనుగూడా. కాని ఆమె మంచిదనీ గొప్పదనీ నాకు బాగా తెలుసు.

ఆమెనో ఆరాధ్య మహాదాశయంలా ప్రేమించాను. ఆమెకోసం ఆవేదన చెందాను. ఆ ఆవేదనలో నా పను లెన్నిటినో కట్టిపెట్టాను. అహోరాత్రులూ అదే ధ్యానంలో నిమగ్నుడ నయ్యాను

ఆమెమాత్రం నన్ను ప్రేమించలేదు. ఏ ఆశనూ రేకెత్తించలేదు. ఏ విధంగానూ నన్ను సంతోషపెట్టాలన్న ఆతురత చూపలేదు. అలా కనిపించేందుకు కూడ ప్రయత్నించలేదు.

కించపడుతూనే 'నిన్నే విధంగానూ సుఖపెట్టలేను' అని చెప్పివేసింది కూడ. ఆ మాట లంటున్నప్పు డెంత బాధపడుతున్నదో, ఎంత బగువుతో ఆ మాటలు బయలుపడుతున్నవో అతి స్పష్టంగా చూచాను. ఆ మాటల్లో కవిత్వం లేదు. దాపరికం లేదు. అంతగా నా హృదయాన్ని కదిపివేసిన మాట మరొకటి నేను వినలేదు.

ఆమె ఏదో అస్పష్ట వ్యథతో బాధపడుతున్నదని ఏరోజో ఇలా చెప్పితీరుతుందని అనుమానిస్తూనే వచ్చాను.

అట్లని ఆమెను ప్రేమించకుండా ఉండలేక పోయ్యాను.

భగ్నప్రేమికుడనని బాకాలూదడం కోసం కాదు. ఆ మధురబాధలో ఉన్న ఆనందాన్ననుభవించాలనీ కాదు. ఏదో మారకపోతుందా అన్న ఆశతోనూ కాదు మరి!

ఇంకో విధంగా ప్రవర్తించడం సాధ్యం కాలేదు. కాబట్టే ఆమెను ప్రేమించాను.

అంత ఉదాత్తత, సంస్కారం, సౌమనస్యం ఉన్నత కుటుంబాలకు చెందిన నవనాగరిక నవలాలోకంలో నే నెన్నడూ చూడలేదు.

అంత సహజప్రవర్తన నే నెఱుగను. నటనకూ నాగరిక వనితకూ ఏది దేనికి పర్యాయపదమో సామాన్యంగా చెప్పలేము.

ఆమె సహజ స్వతంత్రప్రవర్తనను నే నెన్నడూ అపార్థం చేసుకోలేనుకూడ నా మన్మథ సౌదర్యం చూచో, నా బుద్ధి నైశిత్యం చూచో, నా వాక్చాతుర్యం చూచో ముగ్ధురాలై నాపై పడుతుందను కొనేంత పసితనం కాదు నాది.

ఏమాత్రం సరాగంకాని, సకామంకాని కాని, సహజ స్నేహంతో మాత్రమే ఆమె నన్ను చూస్తున్నదని, అంతకు తగిన శక్తి ఆమెకున్నదని నాకు తెలుసును. అంతగుండె బలమున్న మనిషికాబట్టె అంతగా నెనరుమాపాను. కళ్లలోకి చూస్తూ, తెప్పలు వాల్చివేయకుండా ఎలాంటి విషయంపైనైనా చర్చించగల మనిషి ఆమె.

ఈచనువును అవకాశంగా తీసుకొని, ఆమెను అనుభవించాలన్న తలంపు నాకే కోశానా లేదు. అలా నన్ను, ఆమెను కూడ తేలిక పరుచుకునే నైచ్యానికి నేనెన్నడూ పాల్పడలేను.

కాని ఆమెను ప్రేమించాను.

ఆమెవద్ద ఈ అంశం దాచలేకనూ పోయ్యాను.

అంతమాత్రంతో ఉక్కిరి బిక్కిరై పోయి ఆమెముఖం తప్పించనూ లేదు. కొంప లంటుకున్నట్టు గుండెలు బాదుకోనూ లేదు.

అతి సహజంగా, అతి విచారంగా క్షమించమన్నట్టు చూచింది.

ఆమె తిరస్కారంతో నాకామెపై కోపమూ రాలేదు, విసుగూ కలగలేదు. ఆమె నన్ను తేలికగానూ చూడలేదు, తప్పించుకొని పారిపోనూ లేదు.

మాలో ఒకరిపై నొకరికున్న గౌరవాదరాలు ఆవగింజ వాసికూడ తగ్గలేదు.

కాని ఏదో ఒక కంచుగోడ, మాయిరువురి హృదయాల నడుమా ఆకాశమెత్తున

లేచి నిల్చున్నదని, అప్పుడే ఇద్దరమూ గ్రహించాము. ఇది మమ్మల్ని వేరుపరచలేదు. ప్రేమికులనుగా మాత్రమే అది వేరుచేయగలిగినది. ఇదికూడ తాత్కాలికమో శాశ్వతమో చెప్పలేను. ఏనాడో ఆకంచుగోడ ఉల్లిపొరలా తేలిపోవచ్చును, చైనాగోడలా నిలిచిపోవచ్చును.

ఎప్పటి మాటో ఎందుకు? ఇప్పటికి మట్టుకు నాలో భరించలేని ఒక యాతన భగ్నమని మండుకొన్నది. ఆమంటల నార్పగల మనిషి ఆమె ఒక్కతే. నాకాశక్తి ఇక లేదు.

ఈగుండె బరువును మోయలేకే మీముందు నా సమగ్రకథనం వినిపించాలని కూచున్నాను. రచనా పాటవమో, రసనా వైదగ్ధ్యమో వెలువరించే ప్రయత్నమిందులో ఇసుమంతయినా లేదు. నా హృదయకుహరంలోని చీకటిమూలల్లో తల విరియబోసుకొని నాట్యం చేస్తున్న విషాద పిశాచిని మీకు చూపించడం కోసమే ఈ శ్రమ.

అందుతోపాటు నా ఆత్మ విమర్శనం కూడ కొంత జరిగి తీరుతుంది కదా! తద్వారానా ఆ వేదనలోని అంతరాంతరాలలో ఏవిధమైన కాలుష్యమున్నా కనిపించవచ్చు. అప్పుడు దానిని క్షాళితం చేసుకోగలుగుతానేమో ననికూడ ఆశ.

2

ఆకస్మికంగా మేము కలుసుకున్నాము. ఒకచోటనే మేము పదేపదే కలుసుకోవలసి వచ్చేది.

ఆమెను ప్రత్యేకించి చూడకుండానే కొన్ని నెలలు గడిపాను. ఆమె అస్తిత్వాన్నే నేను గుర్తించలేదు. ఆడవాళ్లను గుర్తించే అలవాటు తప్పిపోయి అప్పటికే చాల కాలమయింది. అందులోనూ ధనిక కుటుంబాలకు చెందిన స్త్రీలంటే నాకసలు బహుమతి లేదు.

స్త్రీలంటే కేవలం యంత్రాలని కాని, అశుచులని కాని, వంచకులని కాని, ఛాందసంగా భావించే వాడిని కాను. కాని ఈ ఉన్నత వర్గీయుల మనుకునే స్త్రీల ప్రవర్తనలో ఉన్న కృత్రిమత చూచి చూచి విసిగి ఒక విధమైన ఉపేక్షా, ఔదాసీన్యమూ నాలో పేరుకొన్నవి.

కార్మికులలోనూ, పేదరైతులలోను స్త్రీ మగవానికి సహచారిణి. వారంటే నాకెంతో గౌరవ ప్రతిపత్తులున్నవి. వారు బొమ్మలు కారు, మనుషులు.

అలాగే దేశంకోసం, ప్రజలకోసం, ఒక ఉన్నతాశయంకోసం పనిచేసిన - చేస్తున్న మహిళలపై నాకు బహుమానాదరాలున్నవి. కాని ఈ పనులేవో విలాసంగా గాక జీవిత పరమాశయంగా ఉండాలన్నదే నా ఆశ.

మరి జన్మతఃమాత్రమే ఉన్నత కుటుంబాలకు చెంది, సీతాకోక చిలుకల్లా సింగారించుకోడమే, విలాసాలతో, వినోదాలతో కాలక్షేపం చెయ్యడమే, తమ చాతురితో మగపురుగుల మనసులకు గిలిగింతలు పెట్టడమే జీవితావధిగా భావించుకునే ఆడవాళ్లంటే నాకు అసహ్యం.

ఈ జాతిలో చదువుకుంటారు - డబ్బున్నది కాబట్టి. లేదా చదివింపబడతారు. పనీపాటా లేదు కాబట్టి మరికొన్ని నాటకాలో, నవలలోకూడ చదువుతారు. బొమ్మల పత్రికలు చూస్తారు.

అభిరుచి ఉన్నా లేకపోయినా నాటకాలకూ, నాట్యాలకూ, పాట కచ్చేరీలకు, వెడతారు. విధిగా కొంత బలవంతపు సంగీతం కూడ నేర్చుకోవచ్చుకూడ. కులాసాగా పదిమంది మిత్రులతో కాలం గడిపేందుకు సినీమాలకు పోతారు.

వీటన్నిటిమూలంగా పదిమంది డైరక్టర్లూ, గాయకులూ, పదిమంది నటులూ,- కొద్దిమందికి పదిమంది రచయితలూ, కవులూ కనీసం పేరుతోనైనా పరిచితులయి ఉంటారు. ఆస్కారు వైల్డు అన్నట్టు కళలపై కాదు కళాకారులపైనే వీరి కళాభిమానం.

సహజంగా ధనానికున్న పలుకుబడి కొద్దీ కొంత నాగరికతాచ్ఛాయ వీరిపై పడితీరుతుంది. విందులలో వినోదాలలో పదిమందితో పిచ్చాపాటీ మాట్లాడాలి కాబట్టి కొన్ని మర్యాదలూ, అలవాట్లూ పట్టుపడుతాయి. తియ్యగా నవ్వడం, శ్రావ్యంగా మాట్లాడ్డం, కమ్మగా పలుకరించడం, ఆదరం ఉట్టిపడుతున్నట్టు కళ్లు విప్పడం నేర్చుకుంటారు. కొందరికి బుద్ధిపూర్వకంగాను, కొందరికి పరిస్థితుల ప్రాబల్యంవల్లనూ ఇవి అలవడుతవి. కాని వీని లోతుల్లో ఏదో కృత్రిమత, శుష్కత్వం తొంగిచూస్తూనే ఉంటుంది.

వీరి సంస్కారం గొంతు దిగి వెళ్లదు. వీరి తల త్వరత్వరగా పని చెయ్యదు. వీరి గుండె పటపటా కొట్టుకోదు. తల పగుల గొట్టుకొనే సమస్యలు వీరి కుండవు. గుండె చీల్చే ఆ వేదనలు వీరి జోలికి పోవు. లేదా వీరు వాని జోలికి పోరు.

ఏ తోడి వనిత ఏటుపోటు మాటలకో, ఏ సాటిఅమ్మాయి విలాసవిచ్ఛిత్తిని చూచో, ఏ విందులోని మిత్రుల ఉపేక్షాభావాన్ని చూచో మనసు చెడి విషాదాక్రాంతులు కావచ్చు. అసలు గుండెలు పుల్లిపోజేసే నిజమైన జీవిత సమస్యలు వీరు గుర్తించరు. సుఖాపేక్ష తీరితే ఎలాంటి భావభ్రమణాన్నైనా వీరు సరిపెట్టుకోగలరు.

ప్రేమ భంగాలలాంటివి, ప్రియవియుక్తులలాంటివి, ఈ జాతిలోనే కనిపించవని నేననను. అవి ప్రేమ భంగాలుగా కాక చెడిన బేరాలుగామాత్రమే వీరు చూస్తారంటాను. వీరి అభిమానం దెబ్బతింటుంది కాని, వీరి గుండెలో కుంపటి రగులుకోదు. రగిలినా త్వరగా చల్లబడి ఊరుకుంటుంది.

ఉదయమే కాలకృత్యాలు నిర్వర్తించుకొని, ఉపహారానంతరం మెత్తని పరుపున పడుకొని గబాలున వెక్కివెక్కి ఒక వియుక్తాంగన విలపించవచ్చును. కాని అప్పుడు కూడ ఎవరు చూచిపోతారో అన్న ఆందోళన, చీర మడతలు చెడుతాయేమో నన్న కలవరపాటు వారిలో మేలుకొనే ఉంటుంది. కన్నీళ్లతో వారి వేదన కారిపోతుంది. వెంటనే వచ్చిన మరొక మిత్రునితోనో, మిత్రురాలితోనో అతి సహజంగా వీరు సరసాలాడగలరు. వారివెంట ఏ విలాస ప్రదర్శనకో వెళ్లగలరు. ఆనందించగలరు కూడ.

తమపై ప్రేమతో ఏ యువకుడో పడి చావడం చూచి వీరు గర్విస్తారు. కాని ఎవరికోసమూ తాము చచ్చేందుకు ఒప్పుకోరు.

రెండు చేతులా జీవితంలోని చేవగల ఆనందాన్ని అనుభవించలేరు. ముష్టి చేదునూ మూర్కొనలేరు. లోతుల్లోకి చూస్తే వీరికి కళ్లు తిరుగుతాయి. ఉన్నత పథాలలోకి ఎగిరితే వీరికి ఊపిరాడదు.

జీవిత చక్రాన్ని వీరు నడపరు. జీవితం నడుస్తుంటే వీరు దానిపై కదలక మెదలక కళ్లు మిటకరిస్తూ కూచొని తాము నడుస్తున్నా మనుకుంటారు.

ఇలాంటి వర్గానికే చెందిన ఈమెనుకూడ నే నిదేభావంతోనే చూచి ఉంటాను. ఉపేక్షతో కనులు మరల్చుకొని ఉంటాను. కాబట్టే ఒక్కసారి పలుకరించిన పాపాన పోలేదు. నన్ను పలకరించవలసిన అగత్యం ఆమె కసలే లేదు.

ఆమె నన్నొక అమాయకుడుగనో, అనాగరికుడుగనో, ఛాందసుడుగనో భావించి ఉంటుందేమో నాకు తెలీదు.

అప్పటికి అంతే.

ఇలా కొన్ని నెలలు గడిచాయి.

ఆమె కనబడుతునే ఉన్నది. ఇతరమిత్రులతోపాటు మాట్లాడుతునే ఉన్నది. అడపా

దశపా ఆమె నిర్మల మందహాసాన్నో, కలస్వనాన్నో వింటూనే ఉన్నాను. కాని, ముఖాముఖి సంభాషణకాని, కనీసం చూచుకోవడం కాని లేకుండా కాలంగడిచింది. ఏమైనప్పటికి ఆమె అంత తేలికైనమనిషి కాదనిమాత్రం నాలో లోపల ఏదో ఒక భావచ్ఛాయ నాకు తెలీకనే పొదుకొన్నదెమో చెప్పలేను.

3

"ఎంత గొప్ప ఉపన్యాసం"

"ఆయనన్న ప్రతిఒక్క మాటా నిజం."

అప్పుడప్పుడే వినివచ్చిన ఒక వేదాంతోపన్యాసాన్నిగూర్చి చర్చిస్తున్నారు - ఆమే, ఆమె మిత్రులూ.

"జీవితంలో మనం చేయగలదేమీ లేదు. నిర్వికారులమై, నిర్మమత్వంతో సాక్షిభూతులుగా ఉంటమే మన కర్తవ్యం" అన్నారొకరు.

"అలా అయితే మనం చేయవలసినదేమిటి? ప్రపంచం నాశనమైపోతున్నా చూస్తూ కూచునేందుకు మనం వేదాంతులం కానక్కరలేదు. భయంతోనూ, సుఖాపేక్షతోనూ మనం చేస్తున్న పనే అది." అన్నదామె.

ఈ గుంపులో ఆమాత్రం మాటలన్నవారెవరా అని తలయెత్తి చూచాను. అప్పుడే ఆమె ముఖం స్పష్టంగా మొట్టమొదటిసారి చూచాను. చాల ప్రసన్నంగా, నిష్కల్మషంగా కనిపించింది.

చక్కని ముక్కూ, సోగకళ్ళూ, నవ్వులొలికే పెదవులూ తీర్చి దిద్దినట్టున్న గొంతుకా, విశాలమైన నుదురూ.

"మీ అభిప్రాయమేమిటి?" అన్నట్టు నా కళ్ళలోకి చూచింది - తొలిసారిగా.

నాకిలాంటి చర్చలలో పాల్గొనే అలవాటు లేదు. సుఖజీవనుల శుష్క చర్చలెందుకూపనికిరావని ఎన్నడో తెలుసుకున్నాను. అయినప్పటికి ఆమెతో ఏకీభవిస్తున్నట్టు తల పంకించాను. పొడిమాటలతో - ఉపేక్షా ఔదాసీన్యాలు, ప్రపంచం తమవరకు బాగున్నదనుకొన్నవారిలో మాత్రమే కనిపిస్తాయని, నిజంగా లోకం పట్టాలు తప్పి నడుస్తున్నదని గ్రహించిన ప్రతి మనిషీ దానిని దిద్దే బాధ్యత తనకు కూడ కొంత కలదని గ్రహిస్తాడని చెప్పాను. నిరపేక్ష నిర్మమత్వం పరబాధాసహనానికి కాక, తన సుఖలాలసతను దెబ్బగొట్టేందుకుమాత్రమే ఉపయోగించాలని అన్నాను - మిగతవారి వేపు తిరిగి. అదీ మా మొట్టమొదటి సంభాషణ.

ఆ క్షణంలోనే మా యిద్దరిలోనూ ఒకరిపై నొకరికి ఒక విధమైన బహుమానం, ఆదరం ఏర్పడినవి. అవి నేటిదాక చెక్కు చెదరలేదు.

తత్త్వశాస్త్రం జీవితంలో అవసరమైన భాగం కాదు; నానా కశ్మలాలతో బతుకుతూన్నవారు, ఒక పూట విన్నంతమాత్రంతో పాప ప్రక్షాళనం చేయగల సాధనం అని భావించే అంధవిశ్వాసాన్నెక్కడున్నా ఎదుర్కొవడం మంచిదన్న భావం నాకేర్పడింది. కాబట్టి ఆ చర్చ ఆ రోజుతో ఆగిపోక మరికొన్నిరోజులు సాగనివ్వవలసివచ్చింది.

ఇక తర్వాత జీవితమంటే ఏమిటి? ప్రపంచంలో ఈ దుఃఖ దారిద్ర్యాలకు వివిధ తాత్త్వికులు చూపే తరణోపాయాలేమిటి? అనే అంశంపై ఆమెతో చర్చించసాగాను.

ఆమె అతి సుఖభూయిష్ఠమైన జీవనం తప్ప కష్టజీవుల బతుకుచేదు లేశమాత్రం యెరుగదు. పేదతనాన్నిగూర్చో, బతుకు బరువునుగూర్చో ఆమె కేదైనా తెలిసి ఉంటే అది ఒక్క పుస్తకాల ద్వారా మాత్రమే.

పుస్తకాలద్వారా మనం క్షుణ్ణంగా జీవితాన్ని తెలుసుకోలేము. ఎంత గొప్ప కవి వ్రాసిన జీవిత సమస్యనైనా మనం వింటున్నప్పుడో, చదువుతున్నప్పుడో బాగా బాష్పపాతం జరగవచ్చు. దాని కాని పదును మనకా సమస్యతో ఉన్న యథార్థ సంబంధాన్నిబట్టి యెక్కువగా ఆధారపడి ఉంటుంది. అన్ని సమస్యలూ అందరినీ కదపలేవు.

అట్లని పైవర్గాలవారు దరిద్రాన్ని, బాధామయ గాథలను బొత్తిగా అర్థం చేసుకోరని కాని, వానికి గురియయినవారిపై సానుభూతి చూపరని కాని నేననడంలేదు. కాని వారి జ్ఞానం కాని, అనుభూతి కాని గుండెలలో రక్తంలో ఒక భాగమైపోదు. ఒక సినిమాలో నాయకుడో నాయకురాలో మహాపదలో నున్నప్పుడు సామాజికులలో కొందరి కళ్లు తడికావచ్చు. కాని అతడి మందమలయానిలస్పర్శకే ఎండిపోతుంది. వారు తామందులో భాగరులు కామని, ఇంకొక గాధ అని వారు స్పష్టంగా గుర్తిస్తారు. కాబటి ఆ బాధా దర్శనంలో వారికొక విధమైన ఆనందం కలుగుతుంది. కాని కసి కలగదు.

నేటి దగ్ధజీవితాన్ని బాగుపరిచేందుకు పేదలపై బాధిత ప్రజాకోటిపై సానుభూతి సద్భావాలు చాలవు. ఈ పాడుబతుకునకు కారణభూతులైన వారిపై పరిస్థితులపై తీవ్ర విద్వేషం, పచ్చికసి రోమరోమానికీ వ్యాపించాలి. దుర్భర పరిస్థితులపై తీవ్రమైన అసహ్యం నరనరాల్లోకి ప్రాకిపోవాలి. పై వర్గంపై అసూయ కాదు, ద్వేషం కలగాలి. తామేఆవర్గంలోఒక భాగంగా ఉన్నప్పుడు, తామందుకు సిగ్గుపడిపోవాలి. ఆ కశ్మలం నుండి మానసికంగా విడిపోయేందుకు తీవ్ర కృషి చేయాలి. ఇది ఏ నూటి కొకరికో తప్ప అలవికాని తలకు మించినపని.

ఆమె సద్భావమో దయార్ద్రహృదయమో కూడ 'అయ్యో పాపం!' అన్నమాట కంటే కించిత్తుకూడ పైకి పోవునది కాదు. కాబట్టి ఈ శుష్క వేదాంత చర్చలు, మన ప్రతిభావైశిత్యాన్ని ప్రదర్శించడం కోసం తప్ప గమ్మిడీకి పనికిరానప్పుడు వాని జోలికి వెళ్లడం వట్టిదండుగ అనిపించేది.

ఆమాట నొకసారి స్పష్టంగా చెప్పివేశాను. ఆమె చాల బాధపడ్డది. అసలు సమస్యలేవో తెలియనప్పుడు, వానిని విడమరచుటకు ప్రయత్నిస్తామా లేదా అన్న భావంపై తాను చెప్పగలిగినదేమీ లేదన్నది. తన కింతవరకు తెలిసిన భావప్రపంచం చాల సంకుచితమైనదని, అజ్ఞానంలోఉన్న శుష్కానందం తప్ప తనకు మఱొకటి తెలియదని ఆమె నొచ్చుకున్నది. అంతమాత్రంతో తనకు జిజ్ఞాసే లేదనుకోవడం సరికాదని, ఎంతో ఆతురతతో నూతన దృక్పథాలను నూతనభావాలను గ్రహించుకోవాలన్న ఆసక్తిని కనబరచినది.

లెనిన్ ఒకసారి అన్నాడు-*'There is no thorm orneter for sincirity'* అని, అంతేకాక ఒకొకప్పుడు ప్రాథమిక దశలోని కేవల పరిజ్ఞానేచ్ఛ కూడ, తర్వాత కార్యప్రవణతాసాధనంగా మారడం కూడ నే నెరుగుదును.

ప్రజా సేవనాప్రపంచంలోని కనేక దారు లున్నవి. ఒకొక మారొకొక మార్గం గుండా లోనికి ప్రవేశిస్తారు.

ఏదో ఒక సంఘటనలోని దౌష్ట్యాన్ని చూసి ఓర్చుకోలేక రంగంలోకి దుమికి, తర్వాత అలాగే నిలబడిన వీరులెందరో ఉన్నారు.

జ్ఞానేచ్ఛతో పుస్తకాలుచదివి, పాడు బతుకుపైరోసి ప్రజాసేవనలోనికి దూరినవారున్నారు.

పరిస్థితుల ప్రతీకారపరత్వంతో బతుకు బద్ధలై, విరక్తితో లోకసేవకు పూనుకునేవారున్నారు.

ఇక డాబు, డంబం, నటనలకోసం వచ్చేవారూ కొల్లలుగా ఉండనే ఉన్నారు.

ఇలాంటప్పుడు ఒక మెత్తనిగుండె

(44-వ పేజీ చూడండి)

కర్ణధారి

శ్రీ గొర్లమూడి రామచంద్రరావు

వింధా! గోవింద..ఏడుకొండల వాడా, వెంకటరమణా గోవిందా. గోవింద...)

తల్లి : అబ్బాయ్, రేపు పొద్దున ఆకాశ గంగ తీర్థానికి వెడదామా?

కొడుకు : సరే నమ్మా.

తల్లి : పాపనాశనం, అలివేలు మంగాపురం అన్నీ రేపే చూసుకుని ఎల్లుండి కాళహస్తి వెళ్లాలి.

కొడుకు : అట్లాగే.

తల్లి : మరి ఇక్కడ చూడవలసిన వాటన్నిటినీ చూశామూ.

కొడుకు : మామూలుగా అంతా చూసే వాటన్నిటినీ చూశాము. కాని ఇంకా ఒకటి రెండు ఉన్నయ్.



తల్లి : అయితే పద. వాటిని కూడా చూద్దాం.

(ఒక యాత్రికుల గుంపు – గో...వింద. ఏడుకొండలవాడా వెంకటరమణా...... గోవిందా? గోవింద.

రెండవ గుంపు – ఆపద మొక్కులవాడా, అడుగడుగు దణ్ణాలవాడా.

మూడవ గుంపు – వడ్డీకాసులవాడా. నిలువుదోపుళ్ల వాడా. గో...వింద.)

కొడుకు : ఇదుగో, ఈ విగ్రహాలు చూడమ్మా.

తల్లి : వీటిని పొద్దునే చూశాను. అప్పుడే అడుగుదామనుకున్నాను కాని అడావుడిలో మరిచిపోయినాను. ఏ దేవతలురా, వీళ్లు?

కొడుకు : దేవతలు కాదుకానీ, అంతకన్నా ఎక్కువ వాళ్లేనమ్మా.

తల్లి : అదేం విడ్డూరంరా?

కొడుకు : విడ్డూరమేమీ లేదు. ఇదిగో ఈయన విజయనగర చక్రవర్తి తిరుమల రాయలు. ఈమె ఈయన రాణి వెంగళాంబికా దేవి.


తల్లి : తిరుమల రాయలా! అంటే తెనాలి రామలింగడి కథల్లో వచ్చే రాయలవారేనా?

కొడుకు : కాదమ్మా. రామలింగడి రాజు కృష్ణదేవరాయలు. ఈయన ఆయనకు అల్లుడే.

తల్లి : సరే ఏదో రా జన్నమాట. దేవుడికన్నా ఎక్కువ అన్నావేమిటి?

కొడుకు : అయితే ఈ మాటకు జవాబు చెప్పు. ఈ గుళ్లూ, గోపురాలూ, తీర్థాలూ, తిరునాళ్లూ, ఆచారాలూ, అలవాట్లూ, అన్నీ ఎక్కడివమ్మా?

తల్లి : వెనకటి పెద్దవాళ్లు ఏర్పాటు చేశార్రా.



కొడుకు : నీకు భద్రాద్రి రామదాసు కీర్తనలు వొచ్చుకదూ?

తల్లి : ఆ, రామదాసు కీర్తనలూ, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలూ, త్యాగరాజు కీర్తనలూ, అన్నీ వచ్చు.

కొడుకు : నీకు గాంధీగారు తెలుసు కదూ?

తల్లి : ఆయన తెలియకేంరా. మహాత్ముడు. మనకి స్వరాజ్యాన్ని తెప్పించిన వాడే ఆయన్నే ఎరగనూ?

కొడుకు : ఇప్పుడీ స్వరాజ్యం లేకుండా పోయి నీ సాంప్రదాయాలు, భాష అన్నీ నశిస్తయ్యనుకో.

తల్లి : ఛ. ఛ. అదేం మాటరా? అది జరిగితే మనకీ ఆ కోతుల మూకకీ తేడా ఏముంది?

కొడుకు : అదేనమ్మా నేను చెప్పేది, నువ్వు నీ జాతి సాంప్రదాయాలనూ, భాషను వొదులుకోలేవు. స్వరాజ్యం కావాలంటావు. వాటికి కొంతకాలం కిందట ముప్పు కలగ్గా, ఈ మహానుభావుడు రక్షించాడు.

తల్లి : ఆఁహాఁ. అయితే ఆయన ఏం చేశాడంటావ్?

కొడుకు : 600 ఏళ్ళకిందట బహుమనీ సుల్తానుల దాడికి ఇవన్నీ నాశనమయే పరిస్థితి వచ్చింది. అప్పుడు హరిహరరాయలు, బుక్కరాయలు అనే అన్నదమ్ములు – మన తెలుగువాళ్లు – హంపీ విరూపాక్షం దగ్గర, అంటే కిష్కింధ దగ్గరగా, విజయనగరం అనే పెద్ద నగరాన్ని కట్టి, గొప్ప రాజ్యాన్ని స్థాపించి, దేశాన్ని రక్షించారు. వాళ్ల తరువాత 200 ఏళ్లకు కృష్ణరాయలు ఆ రాజ్యాన్ని పాలించాడు. ఆయన తరువాత ఆయన పెద్ద

ళ్ళుడూ, ఈ తిరుమలరాయలకు అన్నగారూ అయిన రామరాయలు రాజ్యం చేశాడు. సింహాచలం మొదలుకొని రావణాసురుడి లంకవరకూ వ్యాపించిన ఈ రాజ్యాన్ని చూసి, బిజాపూర్, అహమద్ నగర్ గోల్కొండ, బీదర్, అనే రాజ్యాల సుల్తానులకు కళ్లు కుట్టినయ్. వాళ్లంతా కలసి 1565 సం. లో విజయనగరంమీద దండెత్తారు. జనవరి 25వ తారీఖున కృష్ణానది ఒడ్డున్న రాక్షసి, తంగడి అనే గ్రామాల దగ్గర యుద్ధం మొదలయింది.

(జనం: ఓం, హరహరా, మహాదేవా, విరూపాక్షేశ్వరా, పంపావతీ, శంభో... శంకర, (గుడిగంటల మోత-)

1వ గొంతు: ఏమయ్యోయ్, గోపయ్యా. విన్నావా సంగతి?

2వ: ఏమిటయ్యోయ్?

1వ: సుల్తాన్లు మొత్తానికి క్రిష్ణను దాటారట.

2వ: ఆఁ. ఎక్కడ?

1వ: రాక్షసి, తంగడి గ్రామాల దగ్గర.

2వ: అగ్రెగ్రే. అయితే యేంలే. వాళ్లు క్రిష్ణదాటటం ఎంతసేపూ. తోకముడవటం ఎంతసేపూ.

1వ: ఏమో అట్లా అనటానికి వీలులేదు. నలుగురు సుల్తాన్లు కచ్చపట్టి ఏకంగా వచ్చారు కదా.

2వ: నలుగురుకాదు, మరి నలుగుర్ని రానీయవయ్యా. మనవాళ్లు సమాధానం చెప్తారు... ఇదుగో, నందయ్య వొస్తున్నాడు వొగుర్చుకుంటూ, ఏమిటో విశేషం.

3వ: ఏమయ్యోయ్, ఇంకా ఇక్కడే కూర్చున్నారు.

2వ: ఏం సంగతి?

3వ: యుద్ధంలో మనవాళ్లు దెబ్బ తిన్నారట.

1 2వ: ఆఁ. ఆఁ.

3వ: రామరాయలువారు, వెంకటపతి రాయలవారు వీర స్వర్గం చెందారట.

2వ: అయ్యయ్యో? తిరుమలరాయల వారో?

3వ: ఆయన ఒళ్లంతా గాయాలు తగిలి, ఒక కన్నుపోయి శత్రువులకి చిక్కిపోయినారట. సేనలంతా చెల్లాచెదరయినవట. ఇప్పుడు సుల్తాన్లు మన నగరం మీదికే వచ్చి పడుతున్నారటయ్యా.

2వ: అదేమిటయ్యా, అట్లా చెపుతావ్. వెంకటపతి రాయలవారు ఆదిల్ శాహినీ తిరుమలరాయలవారు, కుతుబ్ శాహినీ తరిమి కొడుతున్నట్లు ఇందాకవచ్చిన వేగఱ్లు చెప్పారే?

3వ: అది పొద్దుటి మాటయ్యా బాబూ. మధ్యాహ్నం అయేటప్పటికి సూర్యుడితో పాటుగా, కథ ఎదురు తిరిగిందట. ఎవరి జాగ్రత్తమీద వాళ్లు ఉండటం మంచిది.

2వ: ఇప్పుడు జాగ్రత్తకేం వొచ్చింది. మన దుర్గాన్ని ఫట్టుకునేవాళ్లెవరు?

3వ: అదికాదులే. మరీ, సాళువ నరసింగ రాయలవారు రాజ్యం చేసింది మొదలు ఈనాటివరకూ సుల్తానులకు గెలుపే లేదుగా. ఇప్పుడు ఏ కొత్త సందు చిక్కినా వెనకటి కచ్చంతా తీర్చుకుంటారు.

2వ: ఎన్నెళ్లు ముట్టడి వేసినా, ఈ కోటవాళ్లకి స్వాధీన మవుతుందటయ్యా, పిచ్చివాడా.

1వ: విద్యారణ్య స్వాములవారు నగరానికి శంఖుస్థాపన చేసినప్పుడు, ఇది 200 ఏళ్లకు మించి నిలవదని చెప్పారట.

2వ: అవన్నీ కట్టుకథలు. అసలు వారట్లా చెప్ప లేదట.

3వ: ఏదయినా కానివ్వండి. అదుగో నగరపాలకుడు చెన్నమనాయనింగారు గుడిమండపం మీద కూర్చుని భట్టుమూర్తి గారితో మాట్లాడుతున్నారు. వారిని కనుక్కుందాం రండి.

(జనం కోలాహలం)

2వ: నమస్కారం చెన్నమనాయని గారికి. మహాప్రభూ, యుద్ధవార్తలేమిటి?

చెన్నమ: వేగరుల కోసం ఎదురు చూస్తున్నాము.

4వ: ప్రభూ. ఇందాక సర్వమంగళం దళవాయిగారి రౌతువచ్చి అంతా దెబ్బ తిన్నట్లు చెప్పాడు.

చెన్న: ఏడీ ఆ రౌతు?

4వ: దళవాయిగారి కుటుంబాన్నీ, ధనాన్నీ, తరలించుకుని వెళ్లిపోయినాడు ప్రభూ.

3వ: ఔను ప్రభూ. మేమూ అల్లాగే విన్నాం. భట్టుమూర్తిగారూ, మీరేమయినా విన్నారా?

భట్టు: తొందరపడి గాలివార్తలను నమ్మకండి.

(గుర్రపు డెక్కల మోత.)

చెన్నమ: ఏయ్ సవారీ. ఇటురా. ఎక్కడనించి రావటం?

రౌతు: యుద్ధంనించే ప్రభూ. తమకో సమేం. తిరుమల రాయ మహాప్రభువులు ఈ లేఖను పంపించారు.

(ఒక్కక్షణం నిశ్శబ్దం)

చెన్నమ: ఇదుగో సవారీ. నీవు తక్షణమే హజారరామస్వామి మండపం దగ్గరకు పోయి, పెద్దనాయకుడితో నాలుగు వేల గుర్రాలను తీసుకుని అనెగొంది రక్షణకై నిలుచున్న పాటున వెళ్లమని నా ఆగాజ్ఞ చెప్పు.

రౌతు: చిత్తం ప్రభూ.

(గుర్రపు డెక్కల మోత)

మరొకపౌరు: ప్రభూ. ప్రభూ. ఈమాట నిజమేనా?

చెన్న: ఏమిటయ్యా అది?.

పైవ్యక్తి: సర్వమంగళం దళవాయిగారి రౌతు చెప్పినది!

చెన్న: అవన్నీ గాలివార్తలు నమ్మవద్దు... ఏయ్ ఎవరక్కడ? మీరు పోయిగవని నాయకులందరితోనూ కోట వాకిళ్లు మూయమని చెప్పండి... ఇదుగో మావటీ... ఏనుగను ఇటు తీసుకునిరా... ఆఁ. ఎక్కండి భట్టుమూర్తిగారూ, ఉత్తరపు సింహద్వారానికి వెడదాం, నగరంలో పిరికి మందు పడుతున్నట్లున్నది.

(స్వల్ప కాలం విరామం)

భట్టు: ఎట్లాగయినా మన ప్రజలు సుఖాలకు అలవాటుపడి, ఊరికేనే తొణికి పోతున్నారు.

చెన్నమ: అట్లా అనబోకండి భట్టుమూర్తిగారూ? సవ్యమయిన నాయకత్వం ఉంటే అవసరమయినప్పుడల్లా వాళ్లు తమ చేవను చూపిస్తూనే ఉన్నారు.

భట్టు: అసలు వార్త ఏమిటి నాయుడు గారూ?

చెన్నమ: కొంచం గడ్డుగానే ఉన్నదట.

భట్టు: గడ్డుగా ఉండనిదే యుద్ధం ఏమిటి? నలుగురు సుల్తాను కలిసి వచ్చినప్పుడు ఆ మాత్రం యుద్ధం జరగదూ?

చెన్నమ : అవును మరి.

భట్టు: ఇప్పటి పరిస్థితి ఎట్లాఉన్నదా... అదుగో ఏదో సైన్యం వస్తున్నది. మనసేనలే అవి. వరాహ పతాకం ఎగురుతున్నది... ఆఁ. ఆఁ. తిరుమల రాయలవారే!

(గుర్రపుడెక్కలమోత, సేనల కలకలం)

చె. భ. జయము జయము మహాప్రభువులకు.

చెన్నమ : మహాప్రభూ, ఇదేమి రాక, లాంఛనాలు లేకుండా.

భట్టు, అయ్యో, కంటికి ఆ కట్టేమిటి ప్రభూ.

తిరుమల: భట్టుమూర్తిగారూ, ఇదొక అగ్నిపరీక్ష.

భట్టు : అదేమిటి స్వామీ ?

తిరుమల : సుల్తాను లందరికీ సింహస్వప్నమై, కృష్ణరాయంవారిని కూడా మరిపించిన రామరాయలవారు వీరస్వర్గం పొందారు.

భట్టు : అనన్యపరాక్రమ రామభద్రులే యుద్ధమరణం పొందారా ?

చెన్న : అదెట్లా సంభవించింది ప్రభూ ?

తిరు! సేనలను పురికొల్పటానికి పల్లకిలో ఎక్కి మొనలోకి వెళ్లారు. ఇంతలో శత్రువుల ఏనుగ ఒకటి బెదరి, పల్లకీవాళ్లను తొక్కి వేసింది. వారు పల్లకీలో నుంచి గుర్రంమీదికి దూకబోతుండగా, శత్రువులు చుట్టుముట్టారు. మేము వచ్చి ఆదుకోబోయే టప్పటికి చేయి దాటిపోయింది.

భట్టు : వెంకటపతి రాయలవారో ?

తిరు : ఏమయినదీ తెలియదు. అన్నగారు పడిపోయినప్పుడు దిక్కులా చెదరయిన సేనలను నిలవరించ ప్రయత్నించాను కాని విఫలుడి నయినాను.

చెన్న: అదేమిటి ప్రభూ. యావద్భారత దేశంలోనూ పేరుకెక్కిన మేటి జోదులు మీరే విఫలు లయినారా ?

తిరు : దుర్మార్గుడు. ఐనుల్ ముల్క...

చెన్న : ఆఁ. ద్రోహం చేశాడా?

తిరు : అవును.

చెన్న : అయ్యయ్యో. ప్రభూ. వాడిని చేరదీయవద్దని మనం మొదటినుంచీ మొత్తుకుంటూనే ఉన్నాము. కాని రామరాయల వారు వినలేదుగదా. అసలు వాడి ఒంట్లో ప్రవహించేదే ద్రోహుల రక్తం. వాడి తండ్రి గోల్కొండ నవాబులకు ద్రోహం చేసి మరణశిక్షకు గురిఅయినాడు. అయితే, వాడేం చేశాడు?

తిరు: వాడూ, యూసఫ్ బేగ్, ఇద్దరూ కలిసి తమకింద ఉన్న సేనలతో, అకస్మాత్తుగా ఎదిరి పక్షంలో కలిసిపోయినారు. అన్నగారు సైన్యం మొంగలోకి వెళ్లటానికి అదే కారణం. ఆశ్రమ తమకు వద్దని మేము ప్రార్థించినా, వినలేదు. ద్రోహుల సేనలు ఎదురు తిరిగినప్పుడే మనసేనల కట్టుబాటు చెడిపోయింది. అన్నగారి మరణంతో, దానిని సర్దుబాటు చేయటం మా శక్తిని దాటిపోయింది.

భట్టు : కాని అంతటితో ఏమయింది? రాక్షస - తంగడి యుద్ధంతోనే మనజాతి నశిస్తుందా ?

తిరు : రత్నంవంటి మాట పలికారు భట్టుమూర్తిగారూ, నేనూ ఆ ఆశతోనే యుద్ధంలో వెన్ను చూపించాను.

భట్టు : అది వెన్ను చూపటం ఎందుకవుతుంది ప్రభూ? పరిస్థితి ప్రతికూలించినప్పుడు వెనక్కు తగ్గటానికీ, గుండె చెదిరి పారిపోవటానికీ భేదం లేదూ? అర్జునుడంతవాడు కాలం ఎదురు తిరిగినప్పుడు వెనక్కి తగ్గాడు.

చెన్న: అవును ప్రభూ. మీరు చేసిన పనే అత్యుత్తమం. మీరే దుస్సాహసం చేసి ఉంటే మా కింక నాయకు లెవ్వరు? మేము ఓరుగల్లునుంచి వచ్చినవాళ్లం. ఓరుగల్లులో ప్రతాపరుద్రులవారు పట్టుపడినంత మాత్రాన మనవాళ్లు ఊరుకున్నారా? రాచకొండ, కొండవీడు, ఓరుగల్లు - అన్నిటినీ మళ్లీ స్వాధీనం చేసుకోలేదా ?

భట్టు : ఆ ఓరుగల్లునుంచి ఆనెగొందికి రాలేదా? విజయనగరాన్ని స్థాపించలేదా? సరయిన నాయకులు ఉంటే మన ప్రజలు సాధించలేని దేమున్నది ప్రభు?

(జనం గలభా చేస్తున్న శబ్దం)

చెన్న : ఏమిటా కల్లోలం?

ఒకపౌరు : మహాప్రభూ. యుద్ధవార్తలు విని జనం గగ్గోలు పడిపోతున్నారు.

చెన్న : మనకోట అభేద్యం అని ఎరగరటయ్యా?

పౌరు : ఆ సంగతులు మాకేం తెలుస్తవి మహాప్రభూ. గొప్ప గొప్ప అమరనాయకులు, మండలాధీశ్వరులే నగరంవిడిచి పారిపోతున్నారు, నగరాన్ని కాయవలసిన పెద్ద నాయకుడే కొంత సేనను తీసుకుని పారిపోయినాడు.

చెన్న : పెద్దనాయకుడు పారిపోయినాడని ఎవరు మీకు చెప్పింది? ఆయన నా ఆజ్ఞమీద ఆనెగొంది రక్షణకు వెళ్లారు.

పౌరు : నగరమంతా అదే గోలగా ఉంది ప్రభూ, మహాప్రభువు రామరాయలవారు సోదరు లందరితోనూ కలిసి వీరస్వర్గం పొందిన తరువాత మా కింక దిక్కేది?

చెన్న : ఏమయ్యా? ఎదురుగా ఉన్న తిరుమలరాయ మహాప్రభువులనే గుర్తించలేదా?

పౌరు : (సంతోషంతో) ఆఁ, ఆఁ, తిరుమలరాయలవారే? మా కింక నిర్భయమే!

తిరు : మీకు మా మీద ఉన్న విశ్వాసానికి ఎంతో సంతోషం. విశ్వాసం ఉన్న మీ బోటివాళ్లు నలుగురున్నా చాలు- భయపడినవాళ్లు ఉంటే, నగరం విడిచివెళ్లవచ్చునని తెలియజేయండి. విశ్వాసం కలవాళ్లని, వెంటనే వెళ్లి, పోగుచేయండి.

చెన్న : మరి నగర రక్షణో?

తిరు : భోగాల్లోపడి గుండెలు జారినవాళ్లు దేనికి నాయుడుగారూ? ధైర్యం చచ్చి హృదయాలు ఆగిన కట్టెలు మనకు అవసరం లేదు. ధైర్యసాహసాలు, విశ్వాసం ఉన్న నలుగురితోనైనా దుర్గాన్ని రక్షించవచ్చు, కాని గుండెలే లేనివాళ్లకు దుర్గాలెందుకు, సేన లెందుకు?

భట్టు : ఉన్న మాట చెప్పారు ప్రభూ మానవుడి దుర్గం అతడి హృదయంలోనే ఉంటుంది. బయటి సాధనాలు కేవలం నిమిత్తమాత్రమే, అందుకనే క్రియాసిద్ధిస్సత్వే భవతి మహతాం నోపకరణే— అన్నారు పెద్దలు.

చెన్న : ప్రభూ, మీకు ఆనెగొంది దగ్గర పెద్ద నాయకుడు ఎదురు కాలేదా?

తిరు : లేదే.

చెన్న : హుఁ. పిరికి ముందుపట్టి పారిపోయినాడన్న మాట. ఇప్పటికయినా మించిపోలేదు. మనం నగరాన్ని కాపాడగలం.

తిరు : అయితే నేను ఆనెగొంది కాపుకి వెడతాను నాయుడుగారూ.

చెన్న : మీ సేవకులు ఇంతమంది ఉండగా, దుస్సాహస మెందుకు ప్రభూ?

(గుఱ్ఱపు డెక్కల మోత)

కొత్త: ప్రభూ, ప్రభూ.

తిరు : ఏమి సమాచారం విరుపణ్ణగారూ?

విరుప: బంకాపురం నాయకుడు వేలప్ప, ఆదోని, ధార్వాడ, చంద్రగుత్తి మొదలయిన దుర్గాల నాయకులు అప్పుడే ఎదురు తిరిగి, సుల్తానులతో మంతనా లాడు తున్నారని తిమ్మయ్య మంత్రిగారు వర్తమానం పంపించారు. మధురనాయకుల సైన్యం యుద్ధ

సమయానికి అందకపోగా, తరవాతయినా వచ్చి అందుకోకుండా, వెనక్కి తిరుగు తున్నదట.

తిరు : ఏమిటది ఉరుములేని పిడుగు?

విరుప : యుద్ధంలో మిగిలిన నాయకు లంతా, సేనలతో తమ స్వామిసాన్నిధ్యానికి వచ్చి నిలబడటానికి బదులుగా, ఎవరిదేశంవారు వెళ్లి సామ్రాజ్యంమీద ఎదురుతిరిగే ఆలోచనతో బయలు దేరుతున్నారని కూడా వారు విజ్ఞాపన చేసుకుంటున్నారు. ప్రభువుల వారు త్వరపడాలని వారు హెచ్చరిస్తున్నారు.

భట్టు : నాయకుల వెనకపోటు మహా దారుణంగా ఉన్నదే, హిందూ సామ్రాజ్య నౌక సుడిగుండాల్లో చిక్కుకుంటున్నది.

చెన్న : కాని భయంలేదు భట్టుమూర్తిగారూ, సాక్షాత్తు తిరుమలరాయలవారు కర్ణధారిగా నిలిచినతరవాత సామ్రాజ్య నౌక భద్రమేనని విశ్వసించండి.

తిరు : భయంలేదు భట్టుమూర్తిగారూ, దేశం అంతా గొడ్డుపోయిన దనుకోను, కొందరు నాయకులు స్వార్థపరులై దేశద్రోహం చేసినంతమాత్రాన, విలాసాల్లో మునిగితేలే అమరనాయకులు పారిపోయినంత మాత్రాన, ఆశ వదులుకుంటూనా? బొందిలో ప్రాణాలున్నంత వరకూ మన దీక్షను వదలిపెడతామా?

భట్టు : అవును మరి.

తిరు : అయితే నగరంలోనే నిలబడి పోరాడే అదృష్టం మాత్రం తప్పిపోయింది ఇక్కడే మనం నిలబడితే, ముందునుంచి సుల్తానులూ, వెనకనుంచి విద్రోహులూ, తీవ్రప్రమాదం కలిగిస్తారు.

చెన్న : అంతేకాదు, ఎక్కడికి నాయకులక్కడ ఎదురుతిరిగి దేశాన్ని చీల్చివేయగలరు.

తిరు : చెన్నమ నాయుడుగారూ, మనం ఇంక రాజధానిని పెనుగొండ దుర్గానికి మార్చక తప్పదు. అక్కడే కాలు నిలువ దొక్కుకుని, అందర్నీ కూడగట్టి ఎదురుదాడి సాగిద్దాము.

చెన్న : సేనీ లోపల సుల్తానులను అటకాయించి ఉంచుతాను ప్రభూ.

తిరు : విరుపణ్ణగారూ. మీరు తక్షణం తిమ్మయ్యగారిని, కలుసుకొని రాజభక్తిపరులైన నాయకులందరినీ పెనుగొండ తీసుకుని రమ్మని చెప్పండి. భట్టుమూర్తిగారూ.

భట్టు : ప్రభూ. నేను అసలు భట్టును, దౌత్యనైపుణ్యం, వీరులను పురికొల్పటం మాతురక్తంలో పుట్టినవిద్యలు, మీకు నేనూ ఉపయోగించ కలిగితే ధన్యుణ్ణి.

తిరు : మీరు ఉదయగిరి రాజ్యానికి వెళ్లి అక్కడిప్రజలు, నాయకులు ఎదురుతిరగకుండా, కూడకట్టడానికి ప్రయత్నించండి.

భట్టు : హిందూ సామ్రాజ్య భారధారేయ. విపత్పారావార కల్లోల డోలిత సామ్రాజ్య నౌకా కర్ణధారీ విజయీభవ.

అనయ నిషూదన శశ్వదసాదన
య ప్రతిపాదన దివ్య ఝురీ
వన మదనోదన కీర్తి వినోదన
వైరి వనాదన మత్తకరీ
ఘనఘననాదన టజ్జవాదన
గాఢ నినాద నతేంద్రగిరీ
విన మదసూదన మల్క వినోదన
వీర బరీదనరాద హరీ.

తిల్లి : ఆ తరవాత ఏం జరిగింది నాయనా?

కొడుకు : బయటినుంచి వచ్చిన శత్రుబాధకు తోడుగా, సామ్రాజ్యంఅంతటా విప్లవాలు బయలుదేరటంవల్ల, తిరుమల రాయలు విజయనగరాన్ని విడిచి పెనుగొండ చేరుకున్నాడు. అక్కడ రాజధానిని ఏర్పాటు చేసుకుని సామ్రాజ్యఐక్యతను నిలబెట్టటానికి కృషిచేస్తున్నాడు. విజయనగరాన్ని వశపరచుకొన్న సుల్తానులు దెబ్బమీద దెబ్బ కొట్టాలని, ఇంకా ముందుకు సాగి పెనుగొండమీద దాడి ప్రారంభించారు.

(భేరీల మోతలు, ఫిరంగుల మోతలు, సైనికుల, గుర్రాల అరుపులు.)

చెన్న : ఓ విజయనగర మహావీరులారా. మీరంతా మీ పౌరుషం చూపేసమయం వచ్చింది. ఈ పెనుకొండదుర్గాన్ని వదిలి ఒక్క అడుగయినా వెనక్కు వేయరాదని శ్రీ తిరుమలరాయ మహాప్రభువుల ఆజ్ఞ.

(సైనికుల కోలాహలం)

తిరు : మహావీరులారా, విశ్వాసహీనులయిన అమరనాయకులవల్ల మనం నగరాన్ని విడిచివచ్చాము. శత్రువులు ఊపిరి తిప్పుకోనివ్వకుండా పోరాడుతున్నారు. మన స్వాతంత్ర్యం ఉంటేదీ లేనిదీ మీ భుజబలం మీద ఆధారపడి ఉన్నది. అచ్యుతరాయల వారి అనంతరం, సలకం తిమ్మయ్య ద్రోహం చేసి స్వాతంత్ర్యాన్ని మంట కలపాలని ప్రయత్నించినప్పుడు, సామ్రాజ్యాన్ని రక్షించిన వీరులు మాత్రం రక్షించలేరా?

(సైనికుల కోలాహలం, జయజయ ధ్వనులు. పోరాటం తీవ్రమయిన శబ్దం)

తిరు : చెన్నమనాయుడుగారూ, ఉదయగిరి రాజ్యంనుంచి భట్టుమూర్తిగారు ఇంకా తిరిగిరాలేదా ?

చెన్న : నేనూ వారికోసమే ఎదురు చూస్తున్నాను ప్రభూ.

(యుద్ధధ్వనులు మరీ ఆర్భాటంగా వినబడతవి.)

చెన్న : ప్రభూ, నే నొకసారి బురుజుల మీదికి వెళ్లివస్తాను. భట్టుమూర్తిగారు రాగానే తమ సన్నిధికి రమ్మని ఆజ్ఞాపించాను.

తిరు : సరే వెళ్లిరండి... లోకరీతి చాలా చిత్రంగా ఉన్నది. వెనక సలకం తిమ్మయ్య ద్రోహంచేసి ఆదిల్ శాహ్ కి పట్టంకట్ట ప్రయత్నించినప్పుడు సామ్రాజ్యానికి గడ్డు రోజులు వచ్చినవి. కాని అన్నగారు, మేము కలిసి ప్రజల సహాయంతో దానిని గడపకలిగాము. ఇప్పుడు మళ్లీ అంతకన్నా తీవ్ర పరీక్ష ఆసన్నమయినది. దీనిల్లో నేను నెగ్గగలనా?... సామ్రాజ్యనౌక ఈ కష్టాలను తరించగలదా?

భట్టు : జయజయ తిరుమలరాయ మహాప్రభూ.

తిరు : ఓహో, భట్టుమూర్తిగారా? రండి తమకోసమే ఎదురు చూస్తున్నాను.

భట్టు : ఉదయగిరిరాజ్యప్రజలు, నాయకులు అంతా తమ విధేయులే ప్రభూ. సలకం తిమ్మయ్యతమను ఆదిల్షాహికిదాసులుగా చేయప్రయత్నించినప్పుడు ఎవరు కాపాడారో, వారు మరచిపోలేదు ప్రభూ.

తిరు : వినుకొండ, కొండవీడు సీమల నాయకులు?

భట్టు: వారు కృష్ణను దాటి గోల్కొండ రాజ్యాన్ని చీకాకు పరుస్తున్నారు. తమ దక్షిణాది యాత్ర సఫలమైనది కదా?

తిరు : మేము స్వయంగా దక్షిణాది రాజధానులన్నిటినీ సందర్శించాము. నాయకులంతా విధేయులై సేనలను పంపి, తాము కూడా కదలివస్తున్నారు. ఎందుకయినా మంచిదని తమ్ముడు వెంకటపతిని చంద్రగిరిలో నిలిపి ఉంచాను.

భట్టు : ఇక విద్యానగరప్రవేశమే మిగిలి ఉన్నదన్నమాట.

తిరు : భట్టుమూర్తిగారు – నగరంసమీపంలో యుద్ధంజరగరాదు. శత్రువు లిప్పటికే కొంత నగరాన్ని పాడుచేశారు. యుద్ధం జరిగితే పూర్తిగా ధ్వంసం అవుతుంది.

(26–వ పేజీ చూడండి)

కథానిక:

ఉదర పోషణార్థం

శ్రీమతి అరుంధతి

బోంయ్యి బోంయ్యి మని శబ్దం చేస్తూ వాకిట్లో మోటారు హారన్ వినపడింది. వెనకింటి వసారాలో కూరగాయలు తరుగుతూన్న మాణిక్యమ్మ కోడలు నుద్దేశించి "చూడమ్మా రుక్మిణీ వాకిట్లో మోటారాగినట్లుంది. డాక్టరు గారింటికో మనయింటికో ఎవరో వచ్చి వుంటారు." అని అంది. పిల్లలకు తలలు దువ్వుతున్న కోడలు రుక్మిణమ్మ అత్తగారి మాట విని బయటకు వెళ్లి చూచి మోటారులో వచ్చినవారిని ఆహ్వానించి డ్రాయింగు రూములో కూర్చోబెట్టి అత్తగారిదగ్గరకు వచ్చి "వీణాదేవి, రామానుజరావుగారు వచ్చారు. డ్రాయింగురూములో కూర్చో పెట్టాను. మీరు ఏంజేస్తున్నారని వాళ్లు అడుగుతూన్నారు" అని రుక్మిణి చెప్పింది.

"ఓ హో వాళ్లా! సరే! నేను వెళ్లుతూన్నాను. కాని, వాళ్లకు ఏమైనా చేస్తావు కదూ!" అని తరుగుతూన్న కూరలు పక్కకు పెట్టి కత్తిపీట గోడకు చేరేసి పైటకొంగు సర్దుకుంటూ మాణిక్యమ్మ డ్రాయింగురూములోకి వెళ్లింది. మాణిక్యమ్మను చూడగానే వారిద్దరూ లేచి ఆమెకు 'నమస్తే' చెప్పారు.

"ఏమమ్మా, బీనా, ఈమధ్య ఎక్కడా రావడమే లేదు. నేను వద్దామంటే నాకూ తీరుబాటు అవడంలేదు. ఇంట్లో ఓపలేని పిల్ల, మావదిన బొత్తిగా నీరసంగా వుంటోంది. దాన్ని వదలిపెట్టి రాలేక రావడంలేదు. అల్లుడుగారు కూడా రావడం మానేసినారు." అని మాణిక్యమ్మ వారిని పలకరించింది.

"నేను ఈమధ్య వూరిలో లేను, పిన్నీ. మరి మా అల్లుడుగారి సంగతి నీకు తెలిసిన దేకదా!"

బీనా మాణిక్యమ్మకు కూతురువరస అవుతుంది. ఆమె చాలరోజులవరకు పెండ్లి చేసుకోలేదు. దేశసేవ చేయాలనీ, పెళ్లి చేసుకుంటే పిల్లల జంజాటంలో పడి ఏపని చేయుటకు వీలుకాదనీ, పెళ్ళిచేసుకోమని ఎవరెంత చెప్పినా వినలేదు. 'కల్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగ దంటారు.' అప్రకారం కల్యాణకాలం కలసి వచ్చుటచే పెద్దవాళ్లు చెప్పినమాట విని తన ముప్ఫయ్యో ఏట రామానుజరావను బిజినెస్‌మాన్‌ని పెళ్లాడింది.

కొంతసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడిన తరువాత రామానుజరావు, "నేను ఇప్పుడే ఒక గంటలో వస్తాను. నీవు అత్తగారితో మాట్లాడుతూ వుండు," అని భార్యకు చెప్పి లేవపోయాడు. ఇంతలో రుక్మిణి టీ, బిస్కట్లు, అరటిపళ్లు ట్రేలో పెట్టి తీసుకువచ్చింది.

"టీ తీసుకుని మరీ వెళ్లండి," అని మాణిక్యమ్మ రామానుజరావుతో అంది.

"ఇప్పుడే ముగ్గురి ఇళ్లల్లో కాఫీ, టీ తీసుకుని వచ్చాము. మా చెల్లెలు ఎందు కింత శ్రమ తీసుకున్నారు?" అని రామానుజరావు అన్నాడు.

"అయ్యో ఎంత మాటన్నారు? మాకు శ్రమ ఏమిటి? మా దేశాచారం ఇది. ఇంటికి ఎవరు వచ్చినా ఏమున్నా ఇవ్వనిదే పంపడం మా పద్ధతి కాదు. మీరు పుచ్చుకు తీరవలసినదే. అదీగాక మా పనివాడు ఎవరన్నా ఇంటికి వచ్చారనేసరికి కెటిలులో నీళ్లు పెట్టి 'టీ'కి అన్నీ సిద్ధంచేస్తాడు. అందునించి మా కేమీ శ్రమ లేదు. చల్లారిపోతూంది టీ పుచ్చుకోండి," అని మాణిక్యమ్మ అంది.

"మా పిన్ని అంటే ఏమి టనుకున్నారు? ఆమె చెప్పిన మాటకు తిరుగు లేదు. చల్లారిపోతూంది తొరగా కానియ్యండి. మనం ఎక్కడైనా తప్పించుకోగలం కాని మా పిన్నిమాట తీసేయలేము."అని బీనా అంది.

"సరే నీవూ ఆమె పక్షంగానే మాట్లాడుతున్నావా? ఎంతయినా ఆడవాళ్లకు పుట్టింటి మమకారం హెచ్చు," అని రామానుజరావు వేడివేడి టీ మాత్రం తీసుకుని రుక్మిణి కట్టితెచ్చిన పాన్ బీనా ఇవ్వగా పుచ్చుకుని 'ఇక నేను వెళ్లివస్తాను' అని చెప్పి వెళ్లిపోబోగా "కొంచెం తొరగామాత్రం రండేం"అని బీనా పెనిమిటిని హెచ్చరించింది.

"ఆహా, నేను తొందరగా వస్తానులే. నీవుమాత్రం ఎక్కడికీ చక్కర్ కొట్టకు నేను వచ్చి వెతుక్కోలేను." అనేసి మోటారులో వెళ్లిపోయాడు.

రామానుజరావు మొదట్లో ఏవేవో ఉద్యోగాలు వెలగబెట్టేడో కాని బీనా పెళ్లినాటికి కొంత పెట్టుబడిమీద బిజినెస్ ఆరంభించాడు. మనిషి నలుపైనా మంచి లక్షణంగా వుంటాడు. మనిషిలో మంచి 'పెర్సనాలిటీ' వుంది. ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాడు. ఎప్పుడు చూచినా ఎక్కువ విలువగల సూట్లను వేసుకుంటూ టేక్సీ కార్లల్లో తిరుగుతూంటాడు. వుండేటందుకు రెండు నూర్లు కిరాయికి ఒక పెద్ద ఇల్లు తీసుకున్నాడు. దానిని దేవేంద్ర భవనంలాగ అలంకరించాడు. వాకిట్లో ఆఫీసు చప్రాసీ దుస్తులతో ఒక దర్వాను, ఇంట్లో భార్యకు కావలసిన ఉపచారాలు చెయ్యడానికి ఒక ఆయాను పెట్టేడు. వ్యవహారం అంతా చాలా డాబు దర్పంగా వుంది. చూచే వాళ్లకు ఏ లక్షాధికారో అన్నట్లుంది సంగతి. ఎంత రాబడి వుందో దేవునికే తెలియాలి, లోగుట్టు పెరుమాళ్లు కెరుక అన్నట్లు.

కొంచెంసేపటికి రామానుజరావు వచ్చేడు. అతన్ని చూచి బీనా లేచి "అబ్బ చాలా తొరగా వచ్చేరే! మీ కోసరం చూచి చూచి మా పిన్ని బలవంతం చేస్తే నేను ఇప్పుడే భోజనం చేసేను. గడప దాటితే ఇంటిధ్యాస వుండదు కాబోలు. ఏమి స్నేహితులో, ఏమి పనో లంకంత ఇల్లు పిన్నీ. అందులో ఇల్లు తొరగా చేరుకుందాము, పెళ్లాం ఒకతె ఇంట్లో వుంది, భయపడుతుందేమో! అన్న మాట లేదు. రాత్రి పదకొండు గంటలదాకా బిక్కు బిక్కు మంటూ మేలుకుని కూచోవాలి," అని అంది.

"అందుకనేగా రాణీగారికి ఒక ఆయాను, దర్వాన్ను ఏర్పాటుచేసింది? ఇంట్లో హమేశా నీ కెదురుగా కూర్చుంటే చేసే బిజినెస్ ఎట్లా సాగుతుంది?"

"బిజినెస్ అంటే జ్ఞాపకం వచ్చింది. మా వదినెకు ఒక డ్రెస్సింగ్ టేబిలు కావాలట. ఈమారు ఆక్షనులో కొనిపెట్టుతారా?"



"మాడాలి. మనం ఇంక ఇంటికి వెళ్లదామా ? రెండుఘంటలు కావస్తూంది. చద్దికూడు తిన్నమ్మ మొగుడాకలి ఎరుగదుట అలాగుంది నీపని"

"మీరు కూడా భోజనం చేసే వెళ్ళాలి," అంది మాణిక్యమ్మ.

"దానికేమి ? ఇంకోకసారి వస్తాము. రెండుఘంటలకు ఒకర్ని మాఇంటికి రమ్మని చెప్పాను. అతను వచ్చివుంటాడు. అందునించి వెళ్లుతాము."

రుక్మిణి తెచ్చి ఇచ్చిన పండ్లు తాంబూలం తీసుకుని వీణాదేవి రామానుజరావుగార్లు మోటారెక్కి చక్కాపోయారు.

"మా వీనా బంగారపు పువ్వులు పూజ చేసింది. అలక్ష్యంగా పెళ్లిచేసుకున్నా నిధినిక్షేపంలాంటి మొగుడు దొరికాడు. పండువంటి కాపురం. ఇక కడుపు ఫలించాలి." అని సంతోషిస్తూ మాణిక్యమ్మ లోపలికి వెళ్లిపోయింది.

అప్పుడే స్కూలునుంచి వచ్చిన మనుమరాల్ని ముద్దులాడుకుంటూ మాణిక్యమ్మ వీధివసారాలో కూర్చుంది. ప్రక్కని చాపమీద ఇన్ని పూలు పోసుకుని రుక్మిణి పువ్వులు కట్టుతోంది. ఇద్దరు పిల్లలూ డ్రెస్సయి అక్క వస్తే పార్కుకి వెళ్లాలని ఎదురు చూస్తూన్నారు.

"విజయా, తొందరగా వెళ్లి కాళ్లు చేతులు ముఖం కడుక్కుని రావమ్మా, చూడు, చెల్లెలు తమ్ముడుకూడా బట్టలు వేసుకుని నీకోసరం ఎదురు చూస్తూన్నారు," అని రుక్మిణి కూతుర్ని తొందర చేసింది.

"పోతున్నానమ్మా. ఏం తొందర చేస్తావు? నాన్నమ్మ, నాకేమన్నా పెట్టవూ ?"

"అలాగే, ముందు కాళ్లుచేతులు కడుక్కునిరా," అని మాణిక్యమ్మ లేచి వెళ్లి మనుమరాలికి ఫలహారం పెట్టి తీసుకొచ్చింది.

తల్లి జడవేసి, పువ్వులు పెట్టి, బట్టలు వేసి, పిల్లలు ముగ్గుర్ని షికారు పంపించి, 'అమ్మయ్య' అని నిట్టూర్చింది.

మాణిక్యమ్మ కొడుకు వేణుగోపాలరావు P. W. D. ఇంజనీయరు. నెలకు ఇరవై రోజులు సర్కిటులోనే వుంటాడు. ఇంట్లో పెద్ద తలకాయ తల్లి వుండడంచేత నిశ్చింతగా ఇంటిపూచీ లేకుండా తన ఆఫీసు పని, సర్కిట్లు చూచుకుంటూంటాడు. మాణిక్యమ్మ కోడలు చాలా అన్యోన్యంగా తల్లీ, పిల్లలులాగ వుంటారు. మాణిక్యమ్మ కోడలిని అడగనిదే ఏపనీచెయ్యదు. రుక్మిణీ కూడా అత్తగారు చెప్పినదానికి అడ్డు చెప్పదు. అందునించి వాళ్ల సంసారం అతిగుట్టుగా ఆదర్శప్రాయంగా కడచిపోతూంది. మాకోడలులాంటి గుణవంతురాలు లేదని అత్తగారు. మాఅత్తగారులాంటి పుణ్యమురాలు లేదని కోడలు ఒకరి పరోక్షంలో ఒకరు చెప్పుకుంటూంటారు.

'ప్రొద్దుపోయింది' అని లోపలికి వెళ్ళిపోతూన్న అత్తా కోడళ్ళకు సిమెంటురంగు మోటారు రావడం కనిపించింది. "డాక్టరు గారింటికి కాబోలు. బాబు వూరిలో లేనప్పుడు ఆ టైములో మనయింటికి ఎవరు వస్తారు ?" అనుకుంటూ మాణిక్యమ్మ ఒక అడుగు లోపలికి పెట్టింది.

"మనయింటికే ఎవరో వస్తూన్నారు. మన రామానుజరావు అన్నయ్యగారులా వున్నాడు. ఆఁ, అదిగో ఆయనే కుడిచేతిలో సిగరెట్టు ఎడంచేతిలో హేటూను.

క్రొత్తసూటుతో రామానుజరావు తయారు.

"ఓ హో, అల్లుడుగారా ? రండి, రండి, ఇప్పుడే మీ మాట మా రుక్మిణి అంటూంది. తన టేబిలుమాట మీకు జ్ఞాపకం వుందో లేదో అని అనుకుంటూంది."

"ఓ అలాగా? నేను టేబిలువిషయం మర్చిపోలేదు. చూస్తూ నేవున్నాను. ఇప్పుడే నేను ఫర్నిచరుకార్ఖానాకు వెళ్లి వస్తూన్నాను. అద్దంతోసహా వున్న రోజువుడ్డు డ్రెస్సింగ్ టేబిలు అమ్మకానికి తయారుగా వుంది. రెండు పెద్ద డ్రాయర్లు, రెండు చిన్న డ్రాయర్లు, మంచి డిజైనులో వుంది. కావాలంటే తీసుకువస్తాను."

"ంత ఖరీదులోవుందేమిటి? మరీఎక్కువ ఖరీదైతే వద్దు," అని మాణిక్యమ్మఅంది.

"అబ్బె, ఎంతో లేదండి. డెబ్భయి అయిదు రూపాయిలే. టేబిలు అయితే చాలా బాగుంది. 'డెడ్ చీఫ్'. మళ్లీ కావాలంటే ఈ ఖరీదులో దొరకదు. ఎవరో ఆఫీసరుకు కావాలంటే చేశారుట. అతనికి 'ట్రాన్సఫరై' వెళ్లిపోయాడు. అందునించి ఎంత వస్తే అంతే చాలు అని అమ్మేస్తూన్నారు. మీకు అక్కరలేకపోతే నేనే తీసుకుంటాను."

"అత్తయ్యా, మనమే తీసుకుందాము. ఎన్నాళ్ళబట్టే మీ కుమారుడిగారితో చెప్తుతున్నా చెవినేసుకోలేదు. అన్నయ్య ఇట్టే అలాగే ఇవ్వవచ్చును. — అన్నట్టు మీ అమ్మాయి రేపు ఉదయం మిమ్మల్నందర్నీ అచ్చటకు భోజనానికి రమ్మంది. మొన్న మీరంతా వచ్చినప్పుడు విజయలక్ష్మి రాలేదుగా. అందుకోరకు మీరంతా తప్పక రావాలి."

"అబ్బె ఎందుకండీ చిన్నపిల్ల ఒక్కతే బీనా ఇంతిమందికి చెయ్యాలి."

"మరేం ఫరవాలేదు. నేను పది గంటలకు మోటారు తీసుకువస్తాను. అప్పటికి మీరు తయారుగా వుండండి. సాయంకాలం దాకా వుండి టేబిలు తీసుకుని వెళ్ళిపోవచ్చు. తప్పక రావాలి," అని చెప్పి రామానుజరావు రుక్మిణి ఇచ్చిన రూపాయలు జేబులో పెట్టుకుని వుడాయించాడు.

మరునాడు మాణిక్యమ్మవాళ్లు మోటారు కొరకు చూచి చూచి ఒంటి గంటదాకా కబురు కాకరకాయ లేకపోవుటచే ఇంత చారు అన్నం చేసుకుని రెండు గంటలకు కనుకొచ్చారు. ఫర్నిచరు విషయం అన్నయ్యకు బాగా తెలుసు."

"సరే అయితే. కాని మనదగ్గర డెబ్భయి రూపాయలే వున్నాయి. చేపట్టుకు ఇరవై అట్టే పెట్టి ఏభయి మీ అన్నయ్య కియ్యి" అని చెప్పి రామానుజరావుతో, "రెండు మూడు రోజులలో మా గోపాలు వస్తానని కబురు పంపేడు. మా వాడు రాగానే తతిమ్మ ఇరవై అయిదు మీకు పంపుతాలే మా రుక్మిణి సరదాపడుతోంది కాబట్టి మీరు ఆ ఇరవై అయిదు వేశి టేబిలు తెచ్చి పెట్టండి" అని మాణిక్యమ్మ అంది.

"అయ్యో, దాని కేమీ తొందర లేదు భోజనంచేశారు. విందల్లా మందైంది.

ఆ రోజు మొదలు రామానుజరావు పత్తా లేదు. డ్రెస్సింగ్ టేబిలూ లేదు. ఇచ్చిన పైకమూ వాపసు లేదు.

వేణుగోపాలరావు సర్క్యూటు నుంచి వచ్చాక అత్తాకోడళ్లు తాము చేసిన పని అతనికి చెప్పేరు. 'బాగానే వుంది ఈ టోపీ వ్యాపారం' అని అతను విసుక్కున్నాడు. తరువాత ఎన్నిసార్లు గోపాలరావు కబుర్లు పంపినా అదిగో, ఇదిగో, రేపు, ఎల్లుండి అని పంపిన మనుష్యుల్ని రామానుజరావు తిప్పేవాడు. టేబిలుకోరకు ఇచ్చిన ఏభయి కాక అద్దెసైకిళ్లకు మరి పది రూపాయలైంది. ఆఖరుకు ప్రాణం విసిగి గోపాలరావు వూరుకున్నాడు. నాటికీ నేటికీ ఆ దంపతులు మళ్లా గోపాలరావింటికి రాలేదు. రామానుజరావు ఈవిధమైన టోపీలు చాలామందికి వేశినట్లు తరువాత తెలిసింది. ★


"ఏమోయ్, మొద్దులాగ ఆరోగ్యంగా ఉన్నావే, ఏదైనా పని చేసుకోక ముప్పేమిటి ?"

"తమరు సినిమాతారలాగ ఉన్నారు, కాని సంసారం చేస్తున్నారు. మీలాగే నాకూ పెద్ద ఆశలు లేవు."

* * * *

"నేను కవిత్వం రాస్తానని మీనాన్నకు తెలుసా ?"

"మీరు తాగుతారనీ, జూదమాడతారనీ చెప్పటుకే ఇప్పటికి చెప్పాను. అన్నీ ఒక్కసారిగా చెప్పటం భావ్యంగా ఉంటుందా ?"



దివాను జగన్నాథరాజుగారు తన యెదుట నున్న కాగితాలను చూసుకుంటూనే, ఎదుట కొంచెం దూరంలో చేతులుకట్టుకుని నించునివున్న దరఖాస్తుదారుని మనవిని వింటూవున్నారు.

'మహాప్రభువులు కరుణించాలి! చాలా బీద బ్రాహ్మణ్ణిని. పెద్ద కుటుంబం. ఏ ఆధారమూ లేదండి, ప్రభువుల అనుగ్రహం తప్ప! ఏదన్నా వుద్యోగం యిప్పించి, యీ కుటుంబాన్ని పోషించాలని ప్రార్థన.'

అని ఎదుట నించునివున్న సోమనాథం వినయ విధేయతలతో మనవి చేశాడు.

దివాను సోమనాథంవైపు దృష్టిమరల్చి 'ఏమయినా ఖాళీలుంటే నువ్వింత బతిమాలనక్కర్లేదయ్యా! మా సంస్థానం పనీ జరగవలసిందేగా! అయితే నేమీ? ఇప్పుడే మిన్ని ఖాళీలు లేవు' అని అన్నాడు.

సోమనాథం చేతులు నులుపుకుంటూ 'చితం, చిత్తం! ప్రభువులుం తలుచుకుంటే ఏ ఖాళీఅన్నా వస్తుంది. ఈ బీద కుటుంబం వొక్కటి పోషించడం ప్రభువులకి ఒక లెక్కలోది కాదు' అన్నాడు.

దివాను నిదానించి చూస్తూ 'నీ గోడు నువ్వు చెప్పడం సబబుగానే వుంది. కాని నేను తలుచుకుంటే యే ఖాళీ అయినా వస్తుందనడం సరిగాలేదు. నీకు ఖాళీ కావాలంటే ఎవర్నయినా బర్తరఫు చెయ్యాలన్నమాట! నీలాంటి బీదవాడి కుటుంబం పొట్టమీద కొట్టాలన్నమాటకదూ! విజయనగరం సంస్థానంలో అలాంటిపని యెన్నటికిన్నీ జరగదు.' అన్నాడు.

సోమనాథం గడగడలాడిపోయాడు.

'చిత్తం, చిత్తం! మరొకరిని బర్తరఫు చేసి, ఆ పని నాకిప్పించాలని నేను కోరలేదు ప్రభూ! సర్వేజనా స్సుఖినోభవంతు! ధర్మసంస్థానం అయిన ప్రభువుల సంస్థానంలో అలాంటిపని యెన్నటికిన్నీ జరగదని తెలుసును ప్రభూ! తమరు తలిస్తే ఏదో ఒక పని కల్పింపగలరనీ, ధర్మసంస్థానం - ఒక బీద కుటుంబం మలమల మాడిపోతూ వుంటే చూస్తూ ఊరుకోదనీ ధైర్యంతో అలా అన్నాను ప్రభూ!'

జగన్నాథరాజుగారు కొంచెం ఆలోచనలో పడ్డారు.

'ప్రస్తుతం యేమీ ఖాయంగావుంటే నౌకరీలు లేవు. అయినా, ఆలోచిస్తాం! నువ్వు ఏమి చేయగలవో చెప్పు.'

'చిత్తం, చిత్తం. నేను కొంతకాలం వక కోమటి గుమాస్తాగా పనిచేశాను. చిఠా ఆవర్జాలు బాగా వ్రాయగలను. ఎలాంటి లెక్కలయినా సులభంగా చేస్తాను. తికమకల్లో వున్న లెక్కలను శీఘ్రంగా చిక్కు విడదీయగలను. ఆ కోమటి, తన కుమారుడికి తరిఫీదు ఇమ్మని చెప్పి, వాడు అన్నీ బాగా గ్రహించాక నాకు ఉన్నపాటున ఉద్వాసన చెప్పాడండి!'

'ఏవయినా ఇళ్లు కట్టించే అనుభవం వుందా? ఏ పనివాళ్లకి ఎంత యిస్తే గిట్టుబడి అవుతుందో - పనిలోటూ, లాసుగూ లేకుండా జరుగుతుందో తెలుసా?'

'చిత్తం, చిత్తం. బాగా తెలుసునండి. మా సెట్టిగారు కట్టించిన భవంతిపని నా చేతిమీదుగానే జరిగిందండి! అహా, పైసలతోకూడా లెక్కలు సమంగా అప్పగించేవాడిని. ఆయన చాలా సంతోషించి వక పట్టుశాలీ పంచెలచాపు బహుమానంగా యిచ్చారండి. పని పసందుగా వుందంటూ కితాబు యిచ్చారండి.'

"సరే! యిప్పుడు సంస్థానంవారు భీముని పట్నంలో సముద్రపువొడ్డుని ఒక పెద్ద బంగళా కట్టించదలచుకుని వున్నారు. ఆ పని చేయించే పూచీ పడితే నీకు అప్పగిస్తాను. కావలసిన వస్తువులూ, కలపా మొదలయినవి తగిన ఖరీదుకి సులభంగా సప్లయి అయేటట్లు మేం తాఖీదులు యిస్తాం. ఆరు నెలలు దాటకుండా బంగళా పసందుగా

తయారు కావాలి."

"చిత్తం, చిత్తం. తప్పకుండా తమ ఆజ్ఞ నెరవేరుస్తానండి. ప్రభువులు మెచ్చుకునేటట్లు చేయిస్తాను."

"నువ్వు ఆరునెలలపాటు ఆ పనిని చూడవలసిఉంటుంది. అహోరాత్రాలు దాని మీదనే కన్ను ఉంచాలి. ఏభయివేలు దాటకుండా అయేటట్లు చూడాలి. ఇది నీకు నచ్చినట్లయితే రేపట్నుంచే పని ప్రారంభించవచ్చు"

"చిత్తం, చిత్తం. ప్రభువుల ఆజ్ఞకి వ్యతిరేకంగా చెప్పడానికి ఎవరికి సాధ్యమండి: ఏలినవారికి ఎలా తోస్తే అలా ఆజ్ఞాపించవచ్చు."

"సరే! సాయంకాలం కనపడు; అక్కడి రాణేదారుకి తాఖీదు వ్రాయించి ఉంచుతాము. నువ్వు అడిగినప్పుడల్లా అవసరమైనంత సొమ్ము అతను నీకు ఇస్తూవుంటాడు. అక్కడి నౌకర్లు కూడా నీకు సహాయంగా ఉండేటట్టు ఏర్పాటు చేయిస్తాము."

2

భీమునిపట్నంలో విజయనగరం మహారాజావారి బంగళాపని సోమనాథం యాజమాన్యంకింద చాలా చురుకుగా జరుగుతున్నాది.

సోమన్న — అంటే — సోమనాథం తన కుటుంబంతోకూడా భీమునిపట్నం వచ్చి ఒక చిన్న యిల్లు అద్దెకు నిర్ణయించుకుని కాపురం పెట్టాడు.

రామారమి రెండునెలలు గడచాయి.

సోమన్న చాలా శ్రద్ధగా పని చేయిస్తున్నాడు.

దివానుగారి ఆజ్ఞప్రకారం అతను పనికి కుదురుకున్నాడు; కాని ఈ పనివల్ల తన కేటువంటి లాభమో అతనికి తెలియదు. ఇంత జీతం యిస్తామని దివానుగారూ సెలవివ్వలేదు; ఇంత ఇయ్యాలంటూ సోమన్నా అడగలేదు.

రెండునెలలు కావచ్చినా ఒకనెల జీతమయినా అందక చాలా ఇబ్బంది పడుతున్నాది ఆ బీదకుటుంబం! బంగళా పని నిమిత్తం సోమన్న చేతిలో వేలకొద్దీ డబ్బు ఆడుతూవుండేది. కాని అందులోంచి ఒక దమ్మిడీకూడా అతను ముట్టడు. అలా తీసికోవడం ద్రోహం చేసినట్లని అతని భావన.

రెండునెలల జీతమూ ఒక్కసారిగా వస్తుందనీ, ఆ విషయమై దివానుగారికి యాదాస్తు పంపడం మర్యాద కాదనీ సోమన్న అనుకున్నాడు. కుటుంబ అవసరాలకోసం చిల్లరఅప్పులు చెయ్యవలసి వచ్చింది.

రోజులపైని రోజులూ, వారాలమీద వారాలూ, నెలలమీద నెలలూ గడిచిపోతున్నాయి. బంగళా పని చాలా చురుకుగానే



జరిగిపోతున్నాది. కాని సోమన్నకుమాత్రం జీతంలో వకదమ్మిడీ కూడా అందలేదు.

అతను మనస్సులో చాలా కష్టపడ్డాడు. అయినా ఎవ్వరితోటీ యీసంగతి చెప్పడం లేదు. బంగళా పూర్తిఅయ్యాక మొత్తమ్మీద సొమ్మంతా ఒక్కసారిగా ఇవ్వవచ్చని అనుకున్నాడు.

నిత్యఖర్చులకోసం అతను తన దర్భముడి ఉంగరాన్నే కాకుండా, భార్యమెడలోని మంగళసూత్రాలదగ్గరనుంచి అమ్మవలసివచ్చింది. ఆ యిల్లాలు పసుపుకొమ్ము మెడలో కట్టుకోవలసి వచ్చింది.

3

బంగళా పసందుగా తయారయింది.

ఈ సంగతి సోమన్న దివాన్‌జీ సాహేబు వారికి తెలియజేశాడు.

అయిదు నెలలకే అంతపెద్ద బంగళాపూర్తి కావడం దివానుగారికి చాలా సంతోషం కలిగించింది.

ఆ మర్నాడే ఆయన బంగళాను చూడడంకోసం భీమునిపట్నం వచ్చారు.

సోమనాథం దివానుగారిని బంగళా నాలుగు మూలలకీ తీసుకునివెళ్లి, తాను ఏవిధంగా ఏపని చేయించినదీ వివరించి చెప్పాడు.

దివానుగారు మనస్సులో చాలా సంతోషించినా, బయటికి ఏమిన్నీ ఉబకడం లేదు.

అమాంబాపతులు ఎంత అయిందీ ఆయన సోమన్నను అడగనూలేదు; సోమన్న తనంతట చెప్పడానికన్నా ఆయన అవకాశమూ యీయలేదు.

రెండు మూడు రోజుల్లో లెక్కలతో పాటు విజయనగరం రావలసిందంటూ ఆయన తాఖీదుమాత్రం యిచ్చాడు.

తన జీతంసంగతి యేమిన్నీ ఎత్తుకోనన్నా లేదు.

అది సోమన్నకి చాలా కష్టం అనిపించింది.

విజయనగరం వెళ్లినమీదట తన సంగతంతా మనవిచేద్దామని మనస్సులో నిశ్చయించుకున్నాడు.

దివానుగారు వెళ్లిపోయారు.

ఆయనముభావం సోమనాథానికే కాకుండా, అతనిమీద అభిమానం వున్న మరికొంతమందికి కూడా కష్టమని / అనిపించింది.

అప్పటికప్పుడే ఆ వూరిలో కొన్ని వదంతులు పుట్టి నాలుగుమూలలకీ అల్లుకున్నాయి.

సోమనాథం తగిన మర్యాదలు జరపడం లేదనీ, అందుకనే దివానుగారు ముభావంగా వున్నారనీ కొందరనుకున్నారు.

బంగళాపని ఆయనకు సుతరామూ నచ్చలేదనీ, అందుకోసమే తగిన సంజాయిషీ యివ్వడానికి విజయనగరం రావాలంటూ తాఖీదు చేశారనీ మరోపక్షంవారి అభిప్రాయం.

సోమనాథం చాలా డబ్బు కాజేశాడని దివానుగారి అనుమానమనీ, అందుకోసమే లెక్కలతో హాజరుకావాలని అన్నారనీ మరికొందరి ఊహాగానం.

ఇవన్నీ సోమనాథం చెవి సోకినాయి. అతని ధైర్యం కొంత సడలింది. మనస్సు పరిపరివిధాల పోయింది. ఏమి నిశ్చయించుకోడానికి సాధ్యం కాలేదు. ఇంతకూ తనకు రావలసిన జీతము రాదేమో అనే పెద్ద అనుమానం అతనిమనస్సులో ప్రవేశించింది.

తానూ, తన కుటుంబమూ మలమల మాడుతూ, ఎంతో విశ్వాసంతో పనిచేస్తే వచ్చిన ప్రతిఫలం యిదా? అంటూ మనస్సులో సోమనాథం క్రుంగిపోయాడు.

4

సోమనాథం జంకుతూ, జంకుతూ దివాంజీవారి కచేరీసావిట్లో ప్రవేశించాడు.

అక్కడ దివానుగారొక్కరే ఏవో కాగితాలు చూసుకుంటున్నారు.

సోమనాథాన్ని చూసి, అతను వణుకుతూ వున్న చేతులతో చేసిన నమస్కారాన్ని అందుకుని, కూచోమని సంజ్ఞచేశారాయన.

కాని సోమనాథం కూర్చోకుండా నిలిచియే ఉండి, దివానుగారి నోటినుంచి ఏవా

క్యాలు వెలుబడతారో వినడానికి సిద్ధంగా వున్నాడు.

దివానుగారు సోమనాథంవేపు నిదానించి చూశారు. ఇన్నాళ్లనుంచీ అతను పడుతూవుండిన శ్రమ అతనిలో మూర్తీభవించి వుంది; చాలా చిక్కిపోయాడు కూడాను.

అతని ముఖంమీద నిరాశ తాండవిస్తున్నాది.

దివాను జగన్నాథరాజుగారు సంగతంతా గ్రహించారు. ఇదివరకు కూడా ఇతరులవల్ల - సోమనాథం స్థితిగతులన్నీ విని వున్నారు.

'సోమనాథం! ఆ లెక్కలకాగితాలు యిలా ఇచ్చి నువ్వు ఆ బెంచీమీద కూచుని, కాస్త విశ్రాంతి తీసుకో.'

'చిత్తం, చిత్తం' అంటూ సోమన్న కాగితాలు అందించి, జంకుతూ బెంచీమీద కూలబడ్డాడు.

ఆ లెక్కలు చూసి దివానుగారాశ్చర్యపడ్డారు! ఏభయివేల పైచిలుకు ఖర్చు కాగలదనుకున్న బంగళా పాతికవేలతోటే తయారయినట్లు లెక్కలు స్పష్టంగా కనబడుతున్నాయి.

'సోమనాథం! బంగళా ఎంతలో కావాలని మొదట చెప్పివున్నామో జ్ఞాపకం వుందా?'

'చిత్తం, చిత్తం. యాభైవేలన్నట్టుగుర్తు.'

'అయితే యీ లెక్కలేమిటి? పిచ్చిబ్రాహ్మడా?'

అంటూ ఆయన ఆ కాగితాలన్నిటినీ పర్రుమని చింపివేశారు!

సోమనాథానికేమీ అర్థం కాలేదు.

'నువ్వు బంగళాను చాలా బాగా కట్టించినందుకు చాలా సంతోషిస్తున్నాం. యాభైవేలు ఖర్చుపెట్టినా, అలా ఎవ్వరూ కట్టించలేరు.'

'చిత్తం, చిత్తం. అది ఏలినవారి కటాక్షం.'

'నువ్వు కాడ స్తపు బ్రాహ్మడవగుటచేత యిలా పిచ్చి పిచ్చిగా లెక్కలువేశావు. మరొకరైతే యీ యాభైవేలకీ కిట్టించి వుందురు.

సోమనాథం ఏమీ మాటలాడలేదు.

'నువ్వు ఒక దమ్మిడీ అయినా తీసుకోకుండా నానా కష్టాలూ పడి కాలం గడిపావు. మేము జీతం యేదైనా యేర్పాటు చేసివుంటామని భ్రాంతిపడివుంటావు. ఇలాంటివాటికి జీతం ఏర్పాటు పద్ధతిలో లేదు.'

సోమనాథం నిలువునా నీరయిపోయినాడు. దివాను ఏమి అంటున్నదీ అతనికి అర్థం కాలేదు.

'అయినా, నువ్వు నిరుత్సాహపడవద్దు. ఇలా పనిచేయించినందుకు నీకుతగిన ప్రతిఫలమే ముడుతుంది. యీ యాభైవేల పనిని పాతికవేలలో ముగించి, సంస్థానంవారికి లాభం చూపించినందుకు నీకు అయిదువేలు కట్నంగా యిస్తున్నాము.'

సోమనాథం ఆనందం పట్టలేకపోయాడు.

'నిజమే? నిజమే?' అని అతనినోటినుంచి అప్రయత్నంగా రెండుమాటలు వెలువడ్డాయి.

'నిజమే! ఇందులో అబద్ధం యేమీ లేదు. నువ్వు కంట్రాక్టరు వనుకో! నీకు యీ బంగళా కట్టించడానికి ముప్ఫయివేలకి గుత్తకిచ్చినా మనుకో. నువ్వెంత ఖర్చుపెట్టినదీ మాకవసరంలేదు. మా కోరిన పని పసందుగా ఉండడమే మాకు కావాలి. నువ్వు పాతికవేలే ఖర్చుచేస్తే-ఆ మిగిలిన అయిదు వేలూ నీకు లాభం అన్నమాట!'

సోమనాథం ఏమో చెప్పబోయాడు.


'నువ్వు మరి మాటాడకు. నీవంటి చాదస్తుడిని నే నెక్కడా చూడలేదు. రేపుపొద్దున్న ముప్ఫయివేలకి లెక్కలు కిట్టించి రాసుకుని తీసుకురా. ముప్ఫయివేలకి నీకు కంట్రాక్టుకు యిచ్చినట్టు వ్రాసి ఉన్న యీ ఎగ్రిమెంటుమీద నువ్వు సంతకం చేస్తూ—నువ్వు పని ప్రారంభించిన తేదీ వెయ్యి. రేపుపొద్దున్న వచ్చి, ఆ కాగితాలు యిచ్చి అయిదువేలూ తీసుకొనివెళ్లు.

సోమనాథం కృతజ్ఞతతో చిత్తం చిత్తం. ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదండి ప్రభూ!' అని మనవి చేశాడు.

'ఇంతేకాదు. నీకు రేపటినుంచీ యింజనీరింగుడిపార్టుమెంటులో నెలకు నలభై రూపాయీలమీద వుద్యోగం యివ్వడానికి యేర్పాటు చేయబడింది.'

సోమనాథం ఆనందంతో ఆకాశం అందుకున్నాడు.

★




"జీవనప్రమాణాన్ని నిర్ణయించటానికి సునిసూత్రం ఏమన్నా ఉందా?"

"లేకేం? నీ ఆదాయాన్ని రెండెట్లు గుణించు."

* * * *

ట్రాముకారులో కూర్చోటానికి చోటులేక నిలబడివున్న ఒక ఒకయువతి తన స్నేహితురాలితో అన్నది: "ఆ అందమైన అబ్బాయి లేచి సీటు ఇస్తే బావుండును."

ఇది విని అయిదుగురు లేచినిలబడ్డారు.



భారతదేశంలో హిమాలయ పర్వత ప్రాంత సాంద్రారణ్యంలో యీ నెల ఒకటి రెండు తారీఖుల్లో జరిగిన అఖిల భారత జంతుమహాసభకి, మానవప్రతినిధిగా వెళ్ళే అవకాశం లభించింది. సరిగ్గా మహాసభ ప్రారంభమయ్యే సమయానికే చేరుకున్నా. మహాసభ ఆహ్వానవర్గం అధ్యక్షులు మిస్టర్ శునకరాజ్ గారు నన్ను సగౌరవంగా ఆహ్వానించారు. క్షేమం అడిగారు. తమ ఆహ్వానాన్ని మన్నించి శ్రమ అనక ఇంత దూరం వచ్చినందుకు మహాసభతరఫున కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. శునకరాజ్ గారు తెప్పించిన ఫలహారం సేవించి వేడి తేనీరు త్రాగాను. మార్గాయాసం కొంత ఉపశమించింది. అయిదు నిముషాలు గడచిన అనంతరం, శునకరాజ్ గారివెంట బయులుదేరాను. సభ అప్పుడే వివిధరాష్ట్ర, ప్రాంత, జంతు ప్రతినిధివర్గంతో, వివిధ రకాలజంతువుల్తో క్రిక్కిరిసిపోయింది. పెద్దపులులూ, మేకలూ, తోడేళ్లూ, గొర్రెలూ, కుక్కలూ, పిల్లులూ, ఎలుగుబంట్లూ, చిరుతపులులూ, సింహాలూ, ఏనుగులూ, కప్పలూ, పాములూ, ముంగిసలూ, ఎలుకలూ, ఒకటేమిటి! పరస్పరం బద్ధవైరం గల, అన్నిరకాల జంతువులూ, ఒకదాని ఒళ్లో మరొకటి అతి స్నేహ పూర్వకంగా, సౌహార్ద్రభావంతో కూర్చున్నాయి. జంతువుల్లోవచ్చిన ఈ పరిణామానికీ, పరివర్తనకీ, నాలోనేనే అత్యాశ్చర్యం పొందాను. ఒకడి పొడంటే ఒకడికి గిట్టని, ఈ మానవుల కంటె ఈ జంతువులే నయం అనిపించింది. శునకరాజ్ గారు తిన్నగా వెళ్లి ఖాళీగా ఉన్న ఒక కుర్చీ చూపించారు. నేను చిరునవ్వుతో, కూర్చున్నాను. వివిధప్రాంత జంతుప్రతినిధివర్గం కాబోలు, ఆయాజంతు సమూహాలకు ఎదురుగా ఉచితాసనాల్లో ఉపవిష్టులయ్యారు. సభామధ్యమున, ఉన్న పెద్ద వేదికపై, ఉన్న మూడు పెద్దకుర్చీల్లో మహాసభాధ్యక్షుడూ, కార్యదర్శి, ఉపన్యాసకుడూ, వరుసగా కూర్చున్నారు. అయిదునిముషాలు అంతా నిశ్శబ్దంగా వుండి. ఆనిశ్శబ్దంలో, జంతువుల గుసగుసలు అస్పష్టంగా వినపడుతున్నాయి. ఇంతలో గణగణమని పెద్ద గంట శబ్దం దశదిశలా, మార్మోగ్రింది. అనంతరం శ్రీయుత గార్దభ శాస్త్రి గారి, జనగణమనగీతంతో మహాసభ కార్యక్రమం ఆరంభమయింది.

అంతట సభాధ్యక్షుణ్ణి మహాసభకు పరిచయంచేస్తూ మహాసభ కార్యదర్శి శ్రీయుత వ్యాఘ్రేశ్వరరావుగారిలా అన్నారు.

మహాజనులారా! వివిధప్రాంతీయజంతు ప్రతినిధులారా! మహోన్నతమైన ఆశయాలతో జంతుజాతి సర్వతోముఖాభివృద్ధి కోసం, జంతుకల్యాణమే ఆదర్శంగా విశ్వజంతుకోటి సర్వతోభివృద్ధికోసం కృషిచేసి, యీ మహాసభయొక్క ఆశయాన్ని సఫలంచేసి, మా ఆహ్వానాన్ని మన్నించి, విశ్వజంతు కల్యాణకారకమైన యీ మహాసభను జయప్రదంగా జరుపుటకు, తామందరూ యిచ్చుటకు, విచ్చేయుట నిజంగా అదృష్టం. పతనావస్థలో, బానిసత్వంలో, మానవజాతి ఇనుపపాదాలక్రింద, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలులేక, తుణమొక గండంలా,

కంటినిండా నిద్రలేక, యీ భూలోకంలోనే నరకబాధలు అనుభవించే చిరకాల ప్రాప్తమైన యీ బానిసజీవితానికి ఇంతటితో స్వస్తి చెప్పి, విశ్వజంతుజాతి యావత్తూ, ఒకటై, నడుంకట్టి, మానవులనిరంకుశత్వాన్ని ప్రతిఘటించి, ఆఖరువిజయం వరకూ, వీరోచితంగా ప్రతిఘటించి, పోరాటం కావించవలసిన తరుణం ఆసన్నమైంది. కావున అఖిలభారత జంతు మహాసభను, విశ్వజంతుమహాసభకు అనుబంధసంస్థగా భారతదేశంలో యేర్పరచి, రానున్న విశ్వమానవకోటితో, యుద్ధానికి, భారతదేశంతరపున అఖిలభారతజంతు మహాసభకూడా, విశ్వజంతు మహాసభతో కలసి పోరాడగలదు. ఈ పోరాటంలో మీ రంతా మీ సర్వస్వాన్నీ ధారపోసి జంతుజాతి, మనుగడకోసం, జంతుజాతిఅభ్యుదయంకోసం, మీ, మీ ప్రాణాల నయినా సరే ధారపోస్తారన్న విశ్వాసం మాకుంది. మన మహాసభయొక్క లక్ష్యాలూ, కార్యక్రమం, మన మహాసభాధ్యక్షుడు శ్రీ మృగరాజ్ సింహాద్రిరావు గారు, మనవిచేస్తారు. మన మహాసభకోర్కెపై యీ సభకు అధ్యక్షుడుగా ఉండటానికి ప్రేమతో సమ్మతించిన, శ్రీ మృగరాజ్ సింహాద్రిరావు గారికి, మహాసభతరపున నా కృతజ్ఞతాభివందనా లర్పిస్తూ ఇంతటితో ముగిస్తున్నాను. అని కార్యదర్శి వ్యాఘ్రేశ్వరరావు గారు బల్లయెక్కి గొంతుకగా కూర్చుని తోక ముడిచి నాలికజాపి ఒగర్చసాగారు. జంతువులన్నీ ఒక్కసారి కృతజ్ఞతాసూచకంగా ఆకాశాన్ని మిన్నుముట్టే హర్షధ్వానాలుచేశాయి. గాడిదలన్నీ ఓండ్రపెట్టాయి. గుర్రాలు సకిలించాయి. పెద్దపుల్లూ, సింహాలూ, సివంగులూ, గర్జించాయి. ఏనుగులు ఘీంకారాలు చేశాయి. పాములు బుసకొట్టాయి. మృగరాజ్ శ్రీ సింహాద్రిరావు గారు ఆసనంమీంచి లేచి నిలబడిగొంతుక సవరించుకుని చిన్న దగ్గు దగ్గారు. వాతావరణం అంతా మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది.

మహాసభాధ్యక్షులు మృగరాజ్ గారు తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. సభాసదులారా! వివిధప్రాంతీయ జంతు ప్రతినిధి సోదరుల్లారా! ఈ మహాసభకు నన్నే అధ్యక్షుడిగా ఎన్నుకుని నాయందు మీ కుంటే ఆదరాభిమానాల్నీ, అపారగౌరవ మర్యాదల్నీ ప్రకటించినందుకు నేను మీకు ఏవిధంగా నా కృతజ్ఞత తెలియజెయ్యాలో గ్రాహ్యం కావడంలేదు. ఈనాడు మనం యావన్మందీ ఇక్కడ ఎందుకు సమావేశమయాం? మన జంతుజాతి కష్టనిష్ఠురాలూ, మంచిచెడ్డలూ, సింహావలోకనం చేసుకుని, ప్రస్తుతం మనం ప్రగ్గి కృశించిపోయే యీ బానిసజీవితంనుండి విముక్తుల మవడంకోసం, ఇంతకాలంనుంచీ మానవజాతి ఇష్టా ఇష్టాలమీద, దయాధర్మాలమీద ఆధారపడి, నిరంకుశులైన మానవుల క్రింద అణిగి మణిగి సకల కష్టాలూ అనుభవిస్తూ, కడుపునిండా తిండీ, కంటినిండా కునుకూ ఎప్పుడే మానవుడిచేతుల్లో ఏంబాధలు పడవలసి వస్తుందో అన్న భయంతో క్షణక్షణం గండంతో అతిహేయమైనబానిస జీవితం గడిపాం. కాని ఇక ఆ రోజులు పోయాయి. విశ్వజంతుకోటి మేల్కొంది. యథార్థం గుర్తించింది. మానవులవల్ల తమకు జరిగే ఈ అన్యాయాన్ని సహించలేక తమ అసమ్మతిని ప్రకటించింది. మానవుల నిరంకుశత్వాన్ని తీవ్రంగా, యావచ్ఛక్తి తోనూ ప్రతిఘటించడానికి నడుం కట్టింది. మానవులవల్ల యుగయుగాలుగా మనకు జరిగే అన్యాయం, మానవులు చిరకాలం నుండి, మనమీద, ఎంతగా నిరంకుశత్వంగా, దౌర్జన్యంగా, ప్రవర్తిస్తున్నదీ ఒక్కసారి సింహావలోకనం చేసుకోండి. అంతా ఒకటే అయిన మన జంతుజాతిని క్రూరమృగాలనీ సాధుమృగాలనీ విడదీసి, మనలో మనకు లేనిపోని విభేదాలు కల్పించి, విరోధాలు కల్పించి, మన అజ్ఞానాన్ని ఆధారంచేసుకొని, మన్ని విభజించి పాలించే యుక్తి నేర్చుకొన్నారు. ఈ మానవ రాజకీయవేత్తల యుక్తులకు మనం మోసపోయి, మనలో మనం వైరాలు పెంచుకొని, తలొకపేరూ పెట్టుకుని తలకొక దిక్కుగా విడిపోయాం. కనుకనే ఇంతకాలంనుంచీ మనమీద మానవులీ అధికారాలు చలాయించగలిగారు. తమకు పాలిచ్చి పోషించేవి గనక, ఆవూ, గేదే, మేకా, గొర్రే సోదరుల్ని, చేరదీసి ఇంత గడ్డిపడేస్తూ ఏదో పోషించేస్తున్నాం, అని, వాటికి సాధుమృగాలని పేరుపెట్టి వాటికొక ప్రత్యేకతా, గౌరవం కల్గించారు లోకం మెప్పుకోసం. పాలిచ్చినన్నాళ్లూ చక్కగా అనుభవించి ఒట్టిపోగానే కటికివాడికి, అమ్మేసే ఈమానవుల ప్రేమ ఎంత నికృష్టమైనదో, ఎంత సంకుచితమైనదో ఆలోచించండి.

తమని మొయ్యడానికీ, తమ సామాన్లు మొయ్యడానికీ పనికొస్తారు గనక, గుర్రం, గాడిదా, కంచరగాడిదా మొదలైన సోదరుల్ని చేరదీసి, ఇన్ని దాణాగింజలు పడేసి, వెట్టిచాకిరీ చేయించుకుంటూ ఉత్తమాశ్వాలు, గార్దభాలూ, అని పేర్లుపెట్టి

ఉపయోగించుకుంటున్నారు. వాటికీ, శరీరంలో శక్తి సన్నగిల్లగానే తోళ్లసాయిబులకి మన సోదరుల్ని అమ్మేస్తున్నారు. మానవుల ప్రేమ ఎంత సంకుచితమైనదో చూడండి.

తమ ఇళ్లల్లో దొంగలబాధనుండి తప్పించుకోటానికిగానూ, ఇన్ని గంజినీళ్లతో మన శునకసోదరుల్ని వశంచేసికొని, అతివిశ్వాసమైన సేవకుడు అని పేరుపెట్టి, అందంగా, ఆరోగ్యంగా, బలంగా ఉన్నన్నాళ్లూ, ఇంటి కాపలా కాయించుకుని శరీరంలో శక్తి సన్నగిల్లగానే ఇన్ని గంజినీళ్లయినా పొయ్యలేక, మునిసిపాల్టీ కుక్కల VAN లోకి నెట్టి విషపుగాలి ఒదిలి బ్రతికుండగానే మన శునకసోదరుల్ని చంపుతున్నారు. చూడండి! మానవుల స్వభావం.

ఇళ్లల్లో ఎలుకలబాధనుండి రక్షించబడానికి మన మార్జాల సోదరుల్ని చేరదీసి పిల్లిని చంపితే మహాపాపం అని, పిల్లుల్ని ఉపయోగించుకుంటున్నారు. అలాగే ఏనుగుల్ని, అనేకములైనవారికి అవసరమయ్యే ఇతరజంతువుల్ని కూడా ఉపయోగించుకుంటున్నారు. ఇంక వారికి ఏవిధంగానూ, అవసరంలేని పులుల్ని మారాచజాతి సింహాల్ని, చిరుతపులుల్ని, ఎలుగుబంట్లనీ, తోడేళ్లనీ, సివంగుల్ని, తక్కిన అన్ని అరణ్య జంతుజాతినీ, క్రూరమృగాలని చెప్పి, వారికి మనం ఏ అపకారం చెయ్యకపోయినా వేటాడి వధిస్తున్నారు. మానవజాతికి ఏమీ అపకారం చెయ్యకపోయినా, వాళ్లు విసర్జించిన, మల మూత్రాలు శుభ్రంచేసి, పెంటకుప్పలూ, పాకీదొడ్లూ బాగుచేసి, తనమార్గాన తాను మానవజాతికి నిస్వార్థ సేవ చేసే మనసూకరసోదరులను, చూస్తేనే చాలు. మానవ రాక్షసులు, పంది! పంది! ఛ! ఛ అని అసహ్యించుకుంటూ తరుముతున్నారు. మన సూకరసోదరులయెడ కనీసం సానుభూతి అయినా లేక, పైగా అసహ్యించుకునే సభ్యతలేని మానవజాతిని ఏం చేస్తే పాపం ఉంది?

"తిరగబడాలి" విశ్వజంతుజాతి ఏకం కావాలి! విప్లవం వర్ధిల్లాలి!" కేకలు మిన్నుముట్టినాయ్.

కాస్సేపు ఆగి మళ్లీ మృగరాజ్ గారు ప్రారంభించారు. ఇంక కొంచెం బలపరాక్రమాలు కలిగి, పౌరుషం ఉన్న మా మృగరాజజ్ఞాతిని, ఎప్పటికయినా మావల్ల తమ నిరంకుశత్వానికి ప్రమాదం రాగలదని భయపడి, మాకు క్రూరమృగాలని పేర్లు పెట్టి "దుష్టసంహారం" అన్న పేరుతో, మా సింహాల్ని, పులుల్ని సివంగుల్ని, చిరుతల్ని, ఎలుగుగొడ్లనీ, వాళ్లజోలికి పోము వేటాడి చంపుతున్నారు. కాబట్టి, విశ్వజంతుజాతి ఈ మోసం గ్రహించి, ఇప్పటికయినా తమ కర్తవ్యం గుర్తించాలి. మానవుల నిరంకుశత్వానికి స్వస్తిచెప్పాలి. విశ్వజంతుజాతి అంతా ఒకటే, మానవులు పెట్టిన చీలికలూ పన్నిన పన్నాగాలూ, తప్ప మనలో మనకు ఎప్పుడూ నిజంగా విరోధాలు లేవు. కాబట్టి మనం ఇంతటితో నయినా పరస్పర విభేదాలకు స్వస్తి చెప్పి ఐకమత్యంతో, మెలగవలసిన సమయం ఆసన్నమైంది. మనలో మనకు ఐకమత్యం లేకనే ఇంత కాలంగా మనం మానవుల దౌర్జన్యానికీ, నిరంకుశత్వానికీ గురి కావలసి వచ్చింది. మనలోనే ఐకమత్యం ఉంటే మానవులు మనకేసి తేరిపారజూడలేరు. కాబట్టి జంతుజాతి యావత్తూ, ఎక్కడున్నా సరే, వర్గవిభేదాలు, విడిచిపెట్టి అన్నివిధాలా ఆందోళన చెయ్యాలి. ముందుగా శాసనోల్లంఘనం, పిమ్మట సత్యాగ్రహం, అప్పుడుకూడా ఫలితం కనబడకపోయిన, సాయుధవిప్లవం లేవతియ్యాలి. ఆవులు, గేదెలు, కుక్కలు, మేకలు, గొర్రెలు మొదలైనవన్ని వంటనే పాలివ్వడం మానాలి. ఎద్లుభూమిదున్నటం, గుర్రాలు బండ్లులాగటం, గార్దభసోదరులు బరువులు మొయ్యడం మాని సత్యాగ్రహం

(28-వ పేజీ చూడుడు)

సినిమా:

★ జనరంజకమైన సంగీతం ★

శ్రీ కాశీభట్ల

సినిమాలలో సంగీతం చాలా అవసరమైనది.' కథావస్తువ, నటీనటుల అభినయము అందబాగుగా లేకపోయినప్పటికీ మంచి సంగీతమున్న చిత్రాలు విజయవంతమవుతుండటాన్ని మనం చూస్తూనే ఉన్నాము. ఇందుకు ఉదాహరణగా అనేక హిందీ చిత్రాలను పేర్కొనవచ్చును. రతన్ మొదలైనవి. కథావస్తువ, పాత్రల అభినయము, దర్శకత్వము ఉత్తమంగా ఉన్నప్పటికీ మంచి సంగీతంలోపించిన చిత్రాలు అనేకం పూర్తిగా దెబ్బతినటం కూడ మనం చూస్తూనే ఉన్నాము ముక్తిమున్నగునవి. ఈ రకపు చిత్రాలు బాగాచదువుకొన్న ఏకొద్దిమందికో దప్పమామూలు సినిమా ప్రేక్షకులకు బాగారుచించవు. మానవ హృదయాలనే కాకుండా రాళ్లను సైతము కదిలించి కరగించగలశక్తి సంగీతమునకున్నది.. కాబట్టి ఏ సినిమా అయినా విజయవంతం అగుటకు మంచి సంగీతం ఉండటం అవసరమన్నది స్పష్టం

అయితే ఇక్కడొక ప్రశ్న రావచ్చు. కథాసంవిధానం, దానిని చలనచిత్రంగా తీసే పద్ధతి, పాత్రల అభినయము అధోగతిగా ఉండి మంచి సంగీతము ఉండినచో ఆచిత్రం వియవంతం కాగలదాఅనే ప్రశ్న రావచ్చు, నేను చెప్పేది అంతా శ్రవణానందకమైన సంగీతం చిత్ర విజయానికి చాలాబాగా తోడ్పడ గలదనిమాత్రమే. అయితే దేశంలో సుప్రసిద్ధులైన గాయకులెందరో ఉన్నారు. వారిని తీసుకొని వచ్చి ఒక్కొక్కరిని ఒక అరగంటసేపు పాడించి దానినే చిత్రంగా తీసి ప్రదర్శించితే ఆ చిత్రం విజయవంతం కాగలదా అని పశ్నించవచ్చు. ఇది సంపూర్ణంగా దెబ్బతింటుంది. ఎందుచేత నంటే చలనచిత్రమునకు అవసరమైన అంగములన్నీ ఇందులో లేవు. అంతేగాక ఇది 'పాప్యులర్' సంగీతం కాదు.

పాప్యులర్ సంగీతం అంటే ఏమిటి? మామూలు సినిమా ప్రేక్షకుడు సులభంగా అనుకరించగలిగిన సంగీతం. శాస్త్రయుక్తంగా స్వరముతోసహా చిత్రం నిండా ఎన్నోపాటలు గుప్పించవచ్చు. అది చక్కని సంగీతమే కావచ్చు. కాని సులభంగా అనుకరించగలిగింది మాత్రం కాదు. అందుచేత ఇటువంటి సంగీతంతో నిండి యున్న చిత్రాన్ని ప్రేక్షకుడు ఆదరించలేడు. ప్రతిమానవుడు 'ననననా' అంటూ ఏదో ఒక విధంగా ఎవరూ మెచ్చుకొన్నా మెచ్చుకోకపోయినా ఒంటరిగానైనా పాడుకొని సంతోషిస్తాడు. అటువంటి ప్రేక్షకుడు సినిమా చూడటంతోనే అందులోని పాటలను అనుకరించి పాడుకొన ప్రయత్నిస్తాడు. అవి తనకి అందుబాటులో లేకపోయినప్పుడు చాల విచారపడి చిత్రంబాగుండలేదనే అభిప్రాయానికి వస్తాడు. మామూలు ప్రేక్షకునకు యీ అభిప్రాయం ఎప్పుడైతే



విజయా వారి "పాతాళభైరవి" చిత్రంలో 'రాజకుమారి' పాత్రధరించిన మాలతి.


కలిగిందో అప్పుడే చిత్రం దెబ్బతిన్నదన్న మాట. కాబట్టి మామూలు ప్రేక్షకునికి కనీసం ఒక పాటైనా సులభంగా అనుకరించుటకు వీలున్నప్పుడే ఆ చిత్రం విజయవంతం కాగలదు.

ఇందుకు ఉదాహరణ లెన్ని అయినా చూపించవచ్చును. సంపూర్ణంగా విజయవంతములైన చిత్రములన్నిటిలోనూ 'యీ పాప్యులర్' సంగీతం ఉండటం గమనించదగ్గ విషయం. 'మాలపిల్ల' చిత్రంలో 'నల్లవాడే గొల్ల పిల్లవాడే' అన్న పాట ప్రజలను విశేషంగా ఆకర్షించింది. సులభంగా అనుకరించుటకు వీలైనది. ఆ చిత్రం సంపూర్ణ విజయం పొందింది. అది ప్రదర్శింపబడిన తర్వాత కొన్ని సంవత్సరాలకు కూడ ప్రజలు ఆ పాటను మరిచిపోలేదు. చదువుసంధ్య లేని గొడ్డుకాడి బుడ్డోళ్లను కూడా అది ఆకర్షించింది. ఆ రోజుల్లో ప్రతినోటా యీపాటే పలికింది., అందుచేతనే ఆచిత్రం అంత ఘనవిజయంపొందగలిగింది. ఇదే విధంగా గృహలక్ష్మిలో 'వందే వందే భారతమాత,' 'లెండు భారతవీరులారా' 'సాధవదరిశెన మీరా రారా' మున్నగు పాటలు ప్రజలనాకర్షించినవి. వీటిని మామూలు ప్రేక్షకుడు సులభంగా అనుకరించాడు. చిత్రం విజయవంతమైనది, ఇతర భాషా చిత్రాలలో కూడ యీ విషయం గమనించతగినది. 'బంధన్' చిత్రంలోని 'చల్ చల్ రే నౌజవాన్' పాట ఇప్పటికీ మనం వింటూనే ఉన్నాము. ఆ చిత్రం బొంబాయిలో దాదాపు సంవత్సరంపైగా ఆడుటకు యీ పాట కూడ కొంతవరకు కారణమని అంటాను చిత్రంలోని ఇతరఅంగాలు కూడ కొంతవరకు సహాయపడినవనుకోండి. కాని అన్నిటికంటె ముఖ్యం యీ పాప్యులర్ సంగీతం. ఇటీవల వెలువడిన తెలుగు "జీవితం" చిత్రం తీసుకుంటే, యిది హిందీచిత్రం 'కున్వారా బాప్'కు అనుకరణ. అయినప్పటికీ ఆచిత్రం కంటే జీవితంచిత్రం ఎంతో ధనమార్జించింది కారణం ఇందులో '[illegible]' పాట ఉండటమే. ఇదేవిధంగా ఇటీవల వెలువడిన హిందీ చిత్రం 'ఎక్ థీలడ్కీ' ఎంతో ధనమార్జించి, సంపూర్ణంగా విజయవంతమగుటకు అందులో "లారాలప్పా" పాట ఉండడమే కారణం. దీనిని ఎవ్వరూ కాదనలేరు.

వాహినీ వారి స్వర్గసీమ విజయంపొందుటకు కారణం అందులోఉన్న 'ఓహో పావురమా' అన్న పాట. ఈవిధంగా సంపూర్ణవిజయవంతములైన చిత్రాలలో కనీసం ఒకటైనా ప్రేక్షకుడు సులభంగాఅనుకరించగలిగిన పాట ఉంటున్నదని తేలింది.

చిత్రంలోని యితర అంగాలన్నీ, వాటి స్థాయిలో ఉంటూ 'పాప్యులర్' సంగీతంతో కూడిన పాట ఒకటైనా ఉంటే ఆచిత్రం తప్పకుండా విజయవంతం అయి తీరుతుందనుట స్పష్టం.

ఇటీవల వెలువడిన తెలుగు చిత్రాలు ఏవో ఒకటి రెండు మినహాగా మిగిలినవన్నీ దెబ్బ తింటున్నవి. ప్రొడ్యూసర్లు 'పాప్యులర్' సంగీతాన్ని విస్మరించటంవల్లనే పరిస్థితి యీవిధంగా తయారైనదని నిస్సందేహంగా చెప్పవచ్చును. కథ మంచిదే



వినోదావారి "స్త్రీ సాహసం"లో నాగేశ్వరరావు, శివరావు.

ఉంటుంది. పాత్రధారులు కూడ తమకు చేతనైనంతవరకు చక్కగానే నటిస్తారు. దర్శకత్వము కూడ బాగానే ఉంటుంది. సంగీత దర్శకుడు బుర్ర బద్దలుకొట్టుకొని పాటలకు మంచి మట్లనే కూర్చుతాడు. కాని చిత్రం దెబ్బతింటుంది. వినసొంపైన సంగీతం అనుకరణకు సులభం కాకపోవచ్చు. ప్రసిద్ధ హిందుస్తానీ గాయనీమణి రోషనారాబేగం పాట వినసొంపుగానే ఉంటుంది. ఆ పాట వింటున్నంతసేపూ మన శరీరాలను మరిచిపోతాము. అయితే అనుకరణ సాధ్యమా? కాదు. చిత్రం విజయవంతం అవటానికి ఇటువంటి సంగీతం మాత్రమే ఉండటం చాలదు. పైనచెప్పినట్లుగా కనీసం ఒక్కపాటైనా అనుకరణసాధ్యమై తేలికగా పట్టుబడేది ఉండాలి. అప్పుడే ప్రేక్షకుడు చిత్రం గొప్పగా ఉన్నదంటాడు. చిత్రం సంపూర్ణమైన విజయం పొందుతుంది.

మన ప్రొడ్యూసర్లలో చాలమంది యీ విషయాన్ని గ్రహించక సాంఘిక చిత్రాలు తీస్తే దెబ్బతింటాయనీ, ఏవో నాలుగు డాన్సులు, కొంచెం పురకం హాస్యము ఉన్న చిత్రాలే విజయవంతాలవగలవని వాటికే ఎగబ్రాకి చవక రకం చిత్రాలుతీసి ఆర్థికంగా సంపూర్ణంగా దెబ్బతిని చలన చిత్రరంగంనుండి విరమించుకొనటం జరుగుతున్నది. కొంతమంది ప్రొడ్యూసర్లు, చిత్రాలు విజయవంతం కావటానికి అశ్లీలపదాలు అవసరమని వాటనిగూడ చిత్రాలలో జొప్పించ ప్రయత్నిస్తుండుట శోచనీయం.

అయితే "పాప్యులర్" సంగీతమంటే చవకబారు సంగీతమేనా అనే ప్రశ్న రావచ్చు. 'నల్లవాడే గొల్లపిల్లవాడే' అన్న పాటలోని సంగీతం చవకరకంది కాదు. పాటలోని మాటలు నారికేళపాకం తరగతికి చెందిన సమాసాలతో నిండిలేవు. అంతేకాక దానికి కూర్చిన మట్టు సులభగ్రాహ్యము, అనుకరణసాధ్యము. అంతే. ఇప్పుడువస్తున్న తెలుగుచిత్రాలలో కొన్ని పాటలలోని మాటలు అసలే వినపడవు. దీనికితోడు ఇంగ్లీషు మట్టుల అనుకరణ కూడాను! ఈ పాటలు వింటుంటే ఏవో గల్లంతు వింటున్నట్టుగా ఉంటుందిగాని పాడుతున్నట్లు అనిపించదు. మరి ఇటువంటి చిత్రాలు విజయవంతం ఎట్లా అవుతవి? ప్రొడ్యూసర్లు ప్రేక్షకులకు ఆనందాన్ని తృప్తిని కలిగించే విషయాన్ని విస్మరించి చిత్రందెబ్బతిన్న తర్వాత ప్రేక్షకులకు సినిమాలుచూపటం చేత కాదని వారినెత్తిన అభాండం వేయటంవల్ల కలిగే ప్రయోజనమేమిటి?

కథ మరీ పటుత్వము లేనిది గాకుండా ఉండి, నటులు తమ శక్తివంచన లేకుండా



జ్ఞానాంబికా వారి "మంత్రదండం" లో

★ శ్రీమతి కృష్ణకుమారి ★

అనయించిన చిత్రాలలో, నేను చెప్పినట్లు "పాప్యులర్" సంగీతంతో కూడిన పాటలు కనీసం ఒక్కటైనా ఉంటే ఆ చిత్రాలు దెబ్బతినవని ఘంటాపథంగా చెప్పవచ్చును, చలనచిత్ర పరిశ్రమలో విశేష అనుభవజ్ఞులైన హెచ్. ఎం. రెడ్డి గారు చిత్రనిర్మాణంనుండి దాదాపు పది సంవత్సరాలకిందట విరమించుకొన్నప్పటికీ, తిరిగి తాము 'నిర్దోషి' సాంఘికచిత్రమును తీయటానికి సంకల్పించినప్పుడు, ప్రేక్షకుల అభిరుచులను గ్రహించినవారు గాబట్టి, పాప్యులర్ సంగీతం యొక్క ఆవశ్యకతను గుర్తించినవారుగాబట్టి, తమ చిత్రంలో మధు చేత 'లోకమయ్యాలోకము మాయదారి లోకము' అనే పాట పాడించారు. ఇప్పుడు ప్రతి తెలుగువాడినోటా యీ పాటే వినిపిస్తున్నది. ఈ చిత్రం ప్రజలనాకర్షించి ఘనవిజయం పొందుతున్నదని వేరె చెప్ప నవసరం లేదనుకొంటాను.

ఇకనైనా మన ప్రొడ్యూసర్లు మంచి చిత్రాలనుతీసి, వాటిలో పాప్యులర్ సంగీతానికి తగిన స్థానమిచ్చి, తాము విజయవంతులై ప్రేక్షకులకు సంతృప్తి కలిగిస్తారని ఆశిద్దాము.

★

ఉగాది విడుదలలు

సారథీవారి "అగ్ని పరీక్ష" ఎడిటింగు పూర్తికావస్తున్నది. ఈ చిత్రం ఉగాదికి విడుదల అవుతుంది.

రాజరాజేశ్వరీవారి "సౌదామిని" కూడా తమిళ్ ఉగాదికి (ఏప్రిలు 14 కు) విడుదల అవుతుందని తెలుస్తున్నది.

అశ్వనీవారి "మాయలమారి" షూటింగు ఇంకా కొద్దిగా మిగిలిఉన్నది. ఇది ఉగాదికి అందుకోలేకపోతే ఏప్రిలుమాసంలోగా తప్పక బయటికి వస్తుంది.

విజయలక్ష్మీవారి "పేరంటాలు" కూడా ఉగాదినాటికి విడుదల అవుతుందని తెలుస్తున్నది.

★

కర్ణధారి

(12-వ పేజీ తరువాయి)

భట్టు: వారి సేనలను యువతలకు లాగవలెనన్న మాట.

తిరు: అవును. తిమ్మరుసుగారు కళింగ యుద్ధంలో చేసినట్లుగా మిత్రభేదాన్ని ప్రయోగించటమే అత్యుత్తమం. చంద్రగిరి నుంచి మా తమ్ముడు వేంకటపతిగారూ, నేనూ పంపినట్లుగా, కొన్ని లేఖలనూ, బహుమానాలనూ, సుల్తానులకు పంపుదాము. సుల్తానులు ఇప్పుడు ఏకం అయినారే కాని పరస్పరం ఒకరి నొకరు మింగివేయాలనే వారి ఆలోచన. అందువల్ల ఎవరికి వారు మనతో కుట్ర జరుపుతున్నట్లు వ్రాయిద్దాము. ఇవి పరస్పర శత్రువులకి చిక్కేట్లు చేసి, నైపుణ్యంతో అంతఃకలహాలను రెచ్చగొట్టవలసిఉన్నది. భట్టుమూర్తిగారూ. ఈ కర్తవ్య భారాన్ని తిమ్మయ్యమంత్రిగారూ, మీరూ నిర్వహించాలి.

భట్టు: చిత్తం మహాప్రభూ.

(సైనికుల కోలాహలం)

భట్టు: వీరులారా. ముందుకు దూకండి. ఈ నిజాంశాహి శక్తి మనం ఎరగనిది కాదు.

తగవరికదా నిజాముడుద్దండ జయప,
టిష్ఠి తిరుమలరాయ ధాటికి చలించి,
పరచుసెడల శక్తి మరచియు మధవకెయ్యో,
తత్తరుచిత్త ప్రవేశసంధానయుక్తి,

తిరుమల: ఓ మహావీరులారా, ఈ దెబ్బతో శత్రువులను విరూపాక్ష సామ్రాజ్యం బయటికి కొట్టండి. పదండి. మళ్లీ విద్యానగరపు కోటకొమ్మలమీద పడగ ఎత్తటానికి, పదండి.

(విద్యానగరానికీ, విజయనగరానికీ అని కేకలు. గరుడా, గరుడా, అని యుద్ధగర్జనలు, పోరాట తీవ్రత ఒక్కసారి హెచ్చిపోయి క్రమంగా తగ్గిపోతుంది)

చెన్న: జయజయ తిరుమలరాయ మహాప్రభూ. శత్రుసేనలు పారిపోతున్నవి. వెంటపడి తరమటానికి అనుజ్ఞా?

తిరుమల: మీతోపాటుగా భట్టుమూర్తిగారు బయలుదేరుతారు. వారిదగ్గరనుంచి వర్తమానం వచ్చేవరకూ మీరు విజయనగర పరిసరాల్లో శత్రుసంహారం చేయండి కాని, సరాసరి నగరంమీదికి పోవద్దు భట్టుమూర్తిగారూ.

భట్టు: అవశ్యం మహాప్రభూ.

తిరుమల రాయశేఖరుని
ధీర చమూభటరాజియాజి
భీకర యవనేశ్వరప్రహిత
ఖానబలంబుల జక్కసేయని
ద్దర పెనుగొండ కొండలు మ
దద్విపచర్మ కపాలమాలికా పరికర
భూషితంబులయి
బల్విడిగాంచె గిరీశభావమున్.

* * *

కొడుకు: తిరుమలరాయలు ప్రయోగించిన మిత్రభేదం పనిచేసింది. సుల్తానుల మధ్య అంతఃకలహాలు బయలుదేరినయ్. అంతేకాక, తిరుమలరాయలు సైన్యంతో సమీపంలో ఉన్నట్లు వినటంతో, ఎవరి దేశాలకు వాళ్లు వెళ్లిపోయినారు. తిరుమలరాయలు విజయనగరంలో ప్రవేశించి తిరిగి రాజధానిని స్థాపించాడు. తరవాత కొంతకాలానికి కొలువు తీర్చి ఉండగా...

వంది: పరిచిత కరహాటీ
ప్రాప్త కర్పూర వీటీ
విరుత కటకలాటీ
విప్రసత్స్వర్ణశాటీ
స్థిర విజయశ్రీకే తిమ్మమాగర్భపేటీ
వరమణినిభధాటీ వల్లుధారాటఘోటీ
పరాక్ బహుపరాక్.

రాజాధిరాజ, రాజపరమేశ్వర, వీరప్రతాప, ఎంతెంబరగండాంక, అతుల ధృతి నిశ్శంక, అష్టదిగ్రాజకుల మనోభయంకర, శ్రీ శ్రీ శ్రీ తిరుమల దేవరాయ మహారాయా బహుపరాక్.

తిరుమల: చెన్నమనాయకుగారూ. బంకాపురం వేలప్పరాయని వర్తమానం తెలియవచ్చిందా?

చెన్న: ఏలినవారిమీద తిరుగుబాటుచేసి ఉభయభ్రష్టుడయినాడు ప్రభూ. తన బలానికి తోడుగా ప్రభువుల అండ అవసరమని గుర్తించలేకపోయినాడు. తనతోపాటు నడచిన ధార్వాడ, ఆదవని, చంద్రగుత్తి నాయకులతోపాటుగా బిజాపూర్ సుల్తానుకు లొంగిపోయినాడు.

తిరుమల: మనం ఏమీ చేయలేకపోయినాము కదా.

చెన్న: ఏమి చేయగలం ప్రభూ. తామూ సెలవిచ్చిన హితవు వారికి రుచించలేదు. వారే స్వరక్షణకు, నిలబడినప్పుడు ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

భట్టు: నిజం నాయుడుగారూ. పురుష ప్రయత్నం లేనిదే భగవంతుడయినా ఏమీ చేయలేడు. దేశంలో అంతా నిలిచినట్లు వారుకూడా నిలబడినట్లయితే, ప్రభువుల వారి దీర్ఘ బాహువు వారిని రక్షించి ఉండేది.

తిరుమల: ప్రజలు దీక్షతో నిలబడక పోతే, వారికి సంకల్పమే లేకపోతే, ఏమి చేసినా ప్రయోజనంలేదు. కాని వారు లేచి

నిలబడ్డారో, మనం సాధించలేనిది ఉండదు. వారికి ఆ సంకల్పం కలిగించటానికే మనం శక్తికొలది ప్రయత్నిస్తాం.

చెన్న : అవును ప్రభూ? తరవాత జయాపజయాలు దైవాధీనం.

తిరుమల: నాయుడుగారూ. మరొక విషయం గమనించారా? సుల్తానుల సేనలన్నిటిలోనూ మన వీరులు అనేకమంది ఉన్నారు. సుల్తానులు మన మన చేతులతోనే మన గొంతులు నొక్కివేస్తున్నారు. కాని ఆ వీరులు తమ కర్తవ్యాన్ని గుర్తించిననాడు చూడండి. దేశంలో ఒక్క సుల్తాన్లకూడా నిలవలేడు. ఆనాటివరకయినా, నా వంశీకులు స్వాతంత్ర్య దీక్షను కాపాడగలరని ఆశిస్తున్నాను.

భట్టు: ప్రభువులవారు సంకల్పసిద్ధులు.

తిరు: నన్ను మరొక్క విచారం బాధిస్తున్నది. అష్టకష్టాలూ పడి రాజధానిని తిరిగీ వశపరచుకున్నాము. కాని ప్రజలు వెనకటివలె నివసించటం లేదు.

భట్టు: ప్రభూ, విద్యానగరచరిత్రలో ఒక ఘట్టం గడిచిపోయింది. ఏనాడు నాయకులు నగరాన్ని విడిచివెళ్లారో, ఆనాడే నగరలక్ష్మికూడా విద్యా నగరాన్ని విడిచి వెళ్లిపోయింది. తాము చేపట్టిన విజయలక్ష్మితోబాటు ఆమెకూడా పెనుగొండ నగరాన్ని ఆశ్రయించినట్లు గోచరిస్తుంది.

తిరుమల: ఆ మాట నిజమే. ప్రజలు లేని విజయనగరం నగరం మనకూ అనావశ్యకమే. మనం ఎక్కడ విజయం చేస్తే అక్కడే ఉంటుంది విజయనగరం. విజయనగరం పెనుగొండపట్టణానికి తరలివెళ్తాను.

వం: శ్రీ శ్రీ శ్రీ తిరుమలదేవరాయ మహారాయలవారి సన్నిధికి గోల్కొండ అహమద్ నగర్ సుల్తానుల రాయబారులు విచ్చేశారు.

తిరుమల: వారిని ప్రవేశపెట్టండి.

చెన్న: అయ్యా రండి. కూర్చోండి. భట్టుమూర్తిగారూ ఆ లేఖను పరిశీలించండి.

భట్టు: విజయనగర సామ్రాజ్యాధిపతులు శ్రీ శ్రీ శ్రీ తిరుమలదేవరాయ మహారాయల వారికి గోల్కొండసుల్తాన్ ఇబ్రహీం కుతుబ్ శాహ్ అహమద్ నగర్ సుల్తాన్ మూర్తజా నిజాంశాహ్ వ్రాస్తుకున్న విజ్ఞాపన. మనకు ఇటీవల కలిగిన అపోహలను తాము పాటించక, మా యందు సద్భావం వహించగలరని ప్రార్థిస్తున్నాము. మన అన్ని రాజ్యాలకూ సరిహద్దులలో ఉన్న బిజాపూర్ సుల్తాన్ ఆదిల్ శాహ్ చాలా చిక్కులు కలిగిస్తున్నందువల్ల తగిన చర్య అవసరంగా ఉన్నది. కనుక మీరు దయతో మీ సేనను తీసుకుని మాకు సాయపడవలసినదని మా ప్రార్థన. ఇందు మూలముగా ఆదిల్ శాహ్ ఇటీవల ఆక్రమించుకున్న మీ దుర్గములు మీకు లభించటమే కాక స్నేహితులకు తోడ్పడినవారు కాగలరు.

తిరు: చెన్నమనాయడుగారూ, రాయబారులకు వీడ్కోలు చెప్పి, సమాధానం తరవాత పంపుతామని చెప్పండి.

భట్టు: మహాప్రభూ. ఏలినవారి కృషి సంపూర్ణంగా ఫలించినది. ఏ శత్రువులు ఇంత కష్టానికి కారకులయినారో, వారే మీ సహాయాన్ని అర్థిస్తున్నారు. మహాప్రభూ, ఇంక కావలసినదేమి?

తిరుమల: మా అన్నగారిని మెప్పించి రామరాజభూషణ, బిరుదును సంపాదించిన మహాకవులు మీరు మా పేరుకూడా చిరస్థాయిగా చేయవలెనని కోరుతున్నాను.

భట్టు: జయజయ కర్ణాట లక్ష్మీ పునరుజ్జీవన. విపత్పారావార కల్లోలడోలిత సామ్రాజ్య నౌకాకర్ణధారీ.

త్రైలోక్య వినుత చాళుక్య నారాయణాంక సంకలితాశేషపోషణ ప్రౌఢపుండును కృపాణ కృష్ణ నిర్మథ్యమాన రణార్ణవ సముత్పన్న విజయలక్ష్మీనిక్షిప్త నిరుపమ నిరీక్షణ నర్మకరమకరపతాకాలోకన మాత్రసంపాదిత కంపస్వేద భీరూభవన్నానా వజీర సేనామానభేదనుండును, అఖిల కర్ణాటరాజ్య పునరుజ్జీవనుండును నయినట్టి,

ధీర వివిధారిగిరిపవి, ధారికి
కర్ణాటకాంధ్ర ధరణీపు
నరు, ద్ధారికి తిరుమల దేవను, హారా
యగ్రణికి వితరణామరమణికిన్.

అభ్యుదయపరంపరగా వసుచరిత్రంబను మహాకావ్యంబును చేయంబూనెద.

వందిమాగ: ద్రమిళ లాట కురువరాట
దహళ ఘోట కుంకణీ
రమణ జూటతట కిరీట
రత్నపాటల ప్రభా
కమల ఝూట కలిత కూట
కనకవాట సంభ్రమ
ద్భ్రమిత ఘోట, వెడదకోట
పటుకవాట పాటనా.

కొడుకు: ఆ తిరుమలరాయ చక్రవర్తిదే ఈ విగ్రహమమ్మా.

★

ఆమె: "ప్రకాశ్! నాదే తప్పు. కిందటి వారమంతా నీ మీద కోపగించినందుకు నన్ను క్షమించవూ"

అతడు: "ఫరవాలేదు సుశీ! మనం మాటలు మానేసినప్పటినుంచీ 45రూపాయిలు మిగిల్చాను."

* * * *

లాయరు: "ఏదీ! ఆరోజున ప్రతివాది అన్న మాటలన్నీ మళ్లీ ఒక్కసారి చెప్పు."

సాక్షి: "అవి పెద్దమనుషులు వినదగిన మాటలు కావండీ."

లాయరు: "పోనీ, జడ్జిగారి చెవిలోనైనా చెప్పు."

అఖిలభారత జంతుమహాసభ

(22-వ పేజీ తరువాయి)

చెయ్యాలి. అవసరమైతే ఆహారం మాని ప్రాయోపవేశం చెయ్యాలి. శునకసోదరులు గంజి త్రాగడం మాని, తమ అసమ్మతిని తెలియజెయ్యాలి. మార్జాల సోదరులు, యజమానుల విస్తళ్లదగ్గర చెదిరిపడ్డ మజ్జిగ మెతుకుల కాశించక, ప్రాయోపవేశం ద్వారా తమతమ అసమ్మతిని తెలియజెయ్యాలి. మత్తేభము లన్నీ అంబారీలు మొయ్యడం మానాలి. ఇంక అరణ్యప్రాంతాల్లో నివసించే మా మృగజాతి, క్రూరజాతి మృగాలన్నీ, మాతృభూమిని రక్షించుకునే నిమిత్తం మన అరణ్యప్రాంతాల్లో అడుగుపెట్టిన ప్రతిమానవుణ్ణీ, అరణ్యప్రాంతాల్లో జంతువులను వేటాడే నిమిత్తం వచ్చిన ప్రతిమానవుణ్ణీ జంతుజాతికి, మహాద్రోహిగా పరిగణించి, వచ్చినవాడు తిరిగిపెళ్లకుండా హతమార్చాలి, ఒకటేమిటి మనకి చాతనైన అన్నివిధాలా, మానవజాతిమీద తిరుగుబాటు చెయ్యాలి. ఈ జంతుజాతి, స్వాతంత్ర్య పోరాటంలో, మనకి విజయం తథ్యం. విజయం మనది! మనం బానిసత్వంనుండి బయటపడే అవకాశంబహు సమీపంలోనే ఉంది. కాబట్టి వచ్చిన ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోనవలసిన బాధ్యత మీ మీ భుజస్కంధములపై ఉన్నది. కావున, వివిధ రాష్ట్రీయ, ప్రాంతీయ, జంతుప్రతినిధివర్గం యావన్మందీ మా ఉపన్యాససారాన్ని శ్రద్ధగా ఆలకించి, పార్టీ నియమావళికి కట్టుబడి, వెంటనే ఆయా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో నిర్మాణాత్మక మయిన కార్యక్రమం, ప్రారంభిస్తారని ఆసిస్తున్నాను. మీలో మీరు పూర్వంలాగే, జాతిభేదాలతో వర్గభేదాలతో, పరస్పరవిరోధాలతో, ముఠాలుగా ఏర్పడి మీ సైజం విడిచిపెట్టక పరస్పరం, మనోవైరుధ్యాలతో ఉన్నట్టు మేం కర్ణాకర్ణిగా విన్నాం. ఇదే నిజమైతే ఇంతకన్నా, సిగ్గుచేటూ నగుబాటూ మరొకటి ఉండదు. మనలో మనకి ఎప్పుడయితే అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయో, అప్పుడే మానవులకు మనంలోకువ. అందువల్ల, గతం విస్మరించి, మీరంతా ఐకమత్యంతో వెంటనే కార్యరంగంలోకి దూకుతారని విశ్వశిస్తున్నా, అని మృగరాజ్ శ్రీ సింహాద్రిరావు గారు తమ ఉపన్యాససారాంశాన్ని ముగించి వేదికమీదగొంతుకగా కూర్చుని గంభీరంగా సభ ఒక్కసారి కలయజూశాడు.

జంతువులన్నీ ఒక్కసారి మిన్నుముట్టేలా సకిలించి, అరిచి, ఓండ్రపెట్టి తమ హర్షాన్ని ప్రకటించేయి. పిమ్మట ఆహ్వానసంఘ కార్యదర్శి, శ్రీ శునకరాజ్ గారు వేదికమీదకు ఎక్కి ఇలా మాట్లాడారు.

ఈ మహాసభలో ఇప్పుడు మనం తీర్మానించిన తీర్మానసారాంశం మానవులకి ఈమానవప్రతినిధి, శ్రీ శ్రీ రావ్ గారి ద్వారా ఒక కాపీపంపి మన అసమ్మతిని ప్రథమంగా, తెలియజెయ్యాలి. పరస్పర ప్రతిపక్షానికి చెందినవారైనా, ఏసంబంధమూ లేని నిష్పాక్షిక పత్రికావిలేకరి గనుక, మన ఆహ్వానాన్ని మన్నించి యీ సభకు విచ్చేసినందుకు శ్రీ రావ్ గారికి మీ అందరి తరపునా కృతజ్ఞతాసూచకవందనా లర్పిస్తున్నాను—అన్నారు శునకరాజ్ గారు—నేను చిరునవ్వుతో సభావేదికిపైకెక్కాను. అధ్యక్షుడు మృగరాజ్ గారితోనూ, కార్యదర్శి, వ్యాఘ్రేశ్వరరావు గారితోనూ కరచాలనం చేశాను- వారి సరసనే పిమ్మట కూర్చున్నాను— సభఅంతా మౌనముద్ర వహించారు.

అందరూ ఒక్క అయిదు నిముషాలు కళ్లు మూసుకుని మహాసభలక్ష్యాన్ని దిగ్విజయం చేయమని కోరుతూ, జంతుజాతి దైవమైన శ్రీ హాయగ్రీవుణ్ణి ప్రార్థించాలని సభాధ్యక్షులు కోరుతున్నారు అన్నారు శ్రీ శునకరాజ్ గారు.

అయిదు నిముషాలు సభంతా నిశ్శబ్దం ఆవరించింది. అనంతరం, గార్దభశాస్త్రి గారు తమ కమ్మని కంఠంతో మంగళగీతం, "జంతుజాతి అభ్యుదయ, నవయుగోదయం మంగళంబు జంతుజాతికి, మహిని, మంగళం" అంటూ పాడారు. గార్దభశాస్త్రి గారి మంగళగీతంతో, ఆనాటికి సభాకార్యక్రమం ముగిసింది — పిమ్మట కార్యదర్శి శునకరాజ్, వేదిమీదకు ఎక్కి గట్టిగా సకలిన్ని ఉద్బోధిస్తూ అన్నారు. సోదరులారా! అఖిలభారత ద్వితీయ జంతుమహాసభ జూలైనెలలో తిరిగి, నైమిశారణ్యంలో జరుగుతుంది. ఆ సభలో, యీలోపుగా మనపార్టీచేసిన కృషి సమీక్షించబడుతుంది. కాబట్టి అందరకూ యథారీతిన ముందుగానే ఆహ్వానాలు పంపబడతాయి. అయినాముందుగా హెచ్చరించడం ధర్మంకనుక హెచ్చరించాం. జంతువు లన్నీ అవునన్నట్టుగా హర్షధ్వానాలు చేసి అర్చాయి. అంతటితో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

★

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంటె క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

18

మరునాటి ఉదయం డాంటే మిత్రుని గదికి వెళ్లాడు. ఫెరయా కోలుకుని, ప్రశాంతంగా కూచుని ఉన్నాడు. వెలుగు కెదురుగా ఒక కాగితపు ముక్కని ఎడమచేత్తో పట్టుకుని చూస్తున్నాడు. అతని కుడిచెయ్యి స్వాధీనంలో లేదు. కాగితంముక్క వంకర తిరగడం లేదు. మాట్లాడకుండా ఫెరయా ఆ కాగితాన్ని డాంటేకి అందించాడు.

"దీన్ని జాగ్రత్తగా చూడు" అన్నాడు ఫెరయా చిరునవ్వుతో. "ఆ కాగితపుముక్కే నా కున్న భాగ్యమంతా. ఇవాళ నుంచి ఆ భాగ్యంలో సగం నీకు ఉందుతుంది."

డాంటే ముఖాన చెమట పట్టింది. ఫెరయా ఉన్మత్తుడనే వదంతికి ఆధారమైన ఈ ధన నిక్షేపాన్ని గురించి, ఈ రోజువరకూ మాట్లాడకుండా తప్పించుకుంటూ వచ్చాడు. ఆ విషయాన్ని డాంటే ఎన్నడూ ఎత్తలేదు. ఫెరయాకూడా ఆ ప్రసక్తి తేలేదు.

ఫెరయా మౌనాన్నిబట్టి అతనికి మతి స్థిరం కోలుకుందనుకున్నాడు డాంటే. కాని ఈ మూర్ఛ తరవాత ఇప్పుడీ మాటలు ఫెరయా నోటివెంట రావడంతో, తిరిగి అతనికి మతి స్థిరంపోయి భ్రమలో పడుతున్నాడని డాంటే భయపడ్డాడు.

"ధనమా?" అన్నాడు డాంటే తడబడుతూ.

"అవును" అన్నాడు ఫెరయా. "ఎడ్మండ్! నీ హృదయం విశాలమైనది. నువ్వేమని భావిస్తున్నావో నాకు తెలుసును. కాని నేను పిచ్చివాడిని కాను. ఈ ధన నిక్షేపం నిజంగా ఉంది డాంటే. కాని దాన్ని అనుభవించే అదృష్టం నాకు లేకపోయింది కాబట్టి నువ్వు అనుభవిద్దువు కాని. నా మాట ఎవరూ వినిపించుకోరు. ఎవరూ నమ్మదలుచుకోలేదు. ఎందుకంటే, నాకు మతిలేదనుకున్నారు. కాని నాకు మతిపోలేదని తెలిసిన నువ్వు నా మాట వినాలి తరవాత నీ యిష్టం, నమ్మితే నమ్ము."

"మూర్ఛవల్ల మీ సత్తువంతా పోయింది. ముందు కొంచెం విశ్రాంతి తీసుకోండి. మీరు కోరినట్లయితే కథంతా రేపు వింటాను. కాని ఇవాళ మీ ఒంటిని గురించి శ్రద్ధ తీసుకోండి. అదీకాక ఈ భాగ్యం అంత జరూరైన విషయమా?" డాంటే చిరునవ్వు అణుచుకోలేక పోయాడు.

"జరూరే ఎడ్మండ్" అన్నాడు వృద్ధుడు. "ఏమో ఎవరికి తెలుసును? రేపే, రేపు కాకపోతే ఎల్లుండే నాకు మూడో మూర్ఛ రావచ్చు. అప్పుడంతా ఆఖరైపోదూ? అదిమాత్రం నిజం. ముమ్మాటికీ నిజం. పది కుటుంబాలకి అదృష్టం తెచ్చిపెట్టగల ఈ భాగ్యం, నన్ను పీడిస్తున్న ఈ దుష్టులకు చెందకుండా పోయిందని తరుచు సంతోషిస్తూ ఉంటాను. కాని నా ఈ రహస్యంవల్ల నీ కెంత సౌఖ్యం చేకూరుతుందో తెలుచుకుంటే, ఒక్క క్షణంకూడా జాప్యం చెయ్యలేను. గుప్తంగా భద్రపరచబడిన ఈ ధన నిక్షేపం నీవంటి వారసుని చేతపడకుండా పోతుందని భయపడుతున్నాను." డాంటే ముఖం పెడకుతిప్పి దీర్ఘ నిశ్వాసం విడిచాడు. ఫెరయా అన్నాడు: "నీ అపనమ్మకాన్ని నువ్వు విడిచిపెట్టలేకపోతున్నావు కదూ, ఎడ్మండ్? నా మాటలవల్ల నీ కింకా నమ్మకం కలగలేదుకదూ? నీకు రుజువు లవసరం. అందుకే ఈ కాగితం చదువు. దీన్ని నే నింతవర కెవరికీ చూపించలేదు."

వృద్ధుని భ్రమా పరికల్పనకు దోహద మివ్వరాదనే భావంతో డాంటే "రేపు చూద్దాం లెండి" అన్నాడు.

"సరే రేపటివరకూ మనం దాన్నిగురించి మాట్లాడవద్దు. కాని కాగితాన్నిమాత్రం ఇప్పుడు చదువు."

ఇంక అతనికి కోపం తెప్పించ కూడ దనుకున్నాడు డాంటే. కాగితంముక్క తీసుకుని చూశాడు. సగం కాలిపోయి ఉంది. దానిలో ఇలా ఉంది:

"ఈనిధి, దాదాపు రెండు......

రోమన్ క్రౌన్లు ఉంటుంది. ఆమూల.........

రెండోగుహ.........

అతడే సర్వానికీ వార......

ఏప్రిల్ 25, 149......

డాంటే చదవడం ముగించగానే "ఏం?" అన్నాడు ఫెరయా.

"కాని ఈ వాక్యాలన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. కాగితం చాలావరకు కాలిపోయి నట్టుంది. పూర్తిగా ఏమీ తెలియడంలేదు."

"మొట్టమొదటి సారిగా చదువుతున్నావు కాబట్టి నీకు తెలియడంలేదు. కాని దీర్ఘ రాత్రులు తదేకంగా ఆ వాక్యాల వంకనే చూస్తూ ధ్యానించిన నాకు బోధపడుతుంది. అందులో ప్రతి పదాన్నీ తిరిగి తిరిగి యోచించి వాక్యనిర్మాణాన్ని ఊహించాను. ఆ వాక్యాల భావాలు నాకు అవగతమే."

"అంటే వీటిలోని అంతరార్థాన్ని మీరు కనిపెట్టారా?"

"కనిపెట్టానని నాకు గట్టిగా నమ్మకమే. కాని నీ అంతట నువ్వే నిర్ణయించుకో. ముందుగా ఈ కాగితానికి సంబంధించిన చరిత్ర విను."

"ఆగండి" అన్నాడు డాంటే. "అడుగుల సవ్వడి వినపడుతోంది. ఎవరో వస్తున్నారు. నేను వెళ్ళిపోవాలి." కథా, వృద్ధుని వివరణా వినకుండా తప్పించుకో గలిగినందుకు సంతోషిస్తూ డాంటే సొరంగంగుండా నాగుపాములాగ పాకి వెళ్ళిపోయాడు. ఆకథ వింటే తన మిత్రుని మనోవైకల్యం స్థిరపడి పోతుందని

అనువాదం: సీతారామ్

డాంటే భయపడ్డాడు. ఫెరయా తత్తరపడి రాతిపలకను యథాస్థానంలోకి కాలితో గెంటాడు.

ఫెరయా అనారోగ్య సమాచారాన్ని జైలర్ వల్ల విని, అదెంత ప్రమాదమైనదో స్వయంగా చూసి తెలుసుకోవాలని గవర్నర్ వచ్చాడు.

ఫెరయా కాలూ, చెయ్యీ పడిపోయినట్లు తెలియనివ్వకుండా జాగ్రత్తపడ్డాడు. గవర్నర్‌కి జాలి కలిగి ఇంతకంటె మంచి గదికి మారుస్తాడని ఫెరయా భయపడ్డాడు. దానివల్ల తన మిత్రునినుంచి వేరై పోవలసి వస్తుంది. కాని అలా జరగలేదు. ఈ ఉన్మత్తుడు ఏదో స్వల్ప అనారోగ్యంవల్ల బాధపడు తున్నాడని గవర్నర్ భావించి వెళ్లిపోయాడు.

ఇంతసేపూ డాంటే పడకపై విశ్రమించి యోచిస్తున్నాడు. ఈ నిధినిగురించి ఫెరయా మోసగించబడ్డాడా? లేక ఫెరయాను గురించి అందరూ మోసపోతున్నారా? ఆ రోజంతా డాంటే తన గదిలోనే ఉన్నాడు. ఫెరయా మతి లేనివాడని రూఢికాగల దుర్ముహూర్తాన్ని దూరం చెయ్యడానికి ప్రయత్నిస్తూ కూచున్నాడు. కాని సాయంకాలం వేళ, జైలర్ వచ్చి వెళ్లిపోగానే ఫెరయా సొరంగంద్వారా రావాలని ప్రయత్నంచేశాడు. ఒక కాలూ, ఒక చెయ్యీ స్వాధీనం తప్పిన వృద్ధుడు దాదాపు శరీరాన్ని ఈడ్చుకుంటూ వస్తున్న సవ్వడి విని డాంటే కంపించిపోయాడు. చివరికి అతను వృద్ధుని సహాయానికి వెళ్లక తప్పిందికాదు. నిస్సహాయంగా వృద్ధుడు డాంటే గదిలోకి ప్రవేశించలేడు.

డాంటేని చూసి వృద్ధు డన్నాడు: “ఇదిగో నేనే వచ్చాను చూశావా? ఏమయినా సరే నిన్ను విడిచిపెట్టకుండా వెన్నాడుతున్నాను. ‘నే నిచ్చేదాన్ని అంగీకరించకుండా తప్పించుకోవాలని చూస్తున్నావు. కాని నువ్వు తప్పించుకోలేవు. ఇదిగో విను.”

ఎడ్మండ్ వృద్ధుని తన పడకపైకి చేర్చాడు. అతనిపక్కనే ముక్కాలిపీటమీద కూచున్నాడు.

ఫెరయా మెల్లిగా చెప్పాడు: “స్పాడా వంశస్థులలో తుది రాజకుమారుడు కార్డినల్ స్పాడావద్ద నేను కార్యదర్శిగా పని చేశాను. అది నీకు తెలుసుగా. నేను నా జీవితంలో సౌఖ్యం, ఆనందం అనుభవించానంటే, దానికి కార్డినల్ స్పాడా చలవే కారణం. అతని కుటుంబానికి అపారభాగ్య ముందని పే రున్నప్పటికీ, అత నంత భాగ్యవంతుడు కాడు. అయినా విలాసంగా జీవితం గడుపుతా డని పేరుపడ్డాడు. అతని విశాల రాజభవనం నాకు స్వర్గప్రాయంగా ఉండేది. అతని సోదరుని బిడ్డలిద్దరికీ నేను విద్య బోధించేవాడిని. ఇద్దరూ చనిపోయారు. అతడు ప్రపంచంలో ఒంటరైపోయినప్పుడు, పదేళ్లు నాకు చేసిన ఉపకారానికి ప్రతిఫలంగా నే నతని కోరికల్ని పొల్లుపోకుండా తీర్చేవాడిని. కార్డినల్ ఇంటిలో నాకు తెలియని రహస్యా లనేవి ఉండేవి కావు. కార్డినల్ స్పాడా నిత్యం పూర్వగ్రంథాలను పరిశీలిస్తూ ఉండేవాడు. తన వంశానికి చెందిన పురాతనపత్రాలు దులుపుతూ ఉండేవాడు. ఈ నిరర్థకమైన పరిశ్రమనుంచి అతన్ని నివారించడానికి ఒక రోజున ప్రయత్నించాను. వెతికి వెతికి నిరుత్సాహంతో చింతామనస్కుడై కూచుని ఆలోచించేవాడు. ఇది తగదని నేను చెప్పినప్పుడు, విషాదభావంతో నావంక చూసి, రోమ్ చరిత్రగ్రంథ మొకటి నాచేతి కిచ్చి, ఒక ప్రకరణం చూపించాడు. క్రైస్తవమత సర్వాధికారి (పోప్) ఆరో అలెగ్జాండర్ జీవిత చరిత్రలో ఇరవైయో ప్రకరణంలో ఈ విధంగా వ్రాసి ఉంది. ఆ వాక్యాలను నే నెన్నడూ మరిచిపోలేదు:

‘రోమానా యుద్ధాలు ముగిశాయి. విజయం సాధించిన సీజర్ బార్గియాకు ఇప్పుడు ఇటలీదేశాన్ని ఏకంగా కొనెయ్యడానికి ధనం కావలసివచ్చింది. పరాజయా లెన్ని కలిగినా లొంగని ఫ్రెంచి రాజు పన్నెండో లూయీతో వ్యవహారాలు పరిష్కరించుకోడానికి పోప్‌కికూడా ధనం అవసరమయింది. అందువల్ల నిరుపేద దేశమైన ఇటలీలో దుర్ఘటమైనప్పటికీ ద్రవ్యార్జన కేదో ఒక ఎత్తు వెయ్యడం అవసరమయింది. పోప్‌కి ఒక ఆలోచన తట్టింది. ఇద్దర్ని కార్డినల్స్‌గా నియమిస్తే సరి.’

“ఆ తరవాత కథ టూకీగా చెప్తాను విను. రోమ్‌లోకెల్ల ధనాఢ్యులైన ఇద్దరు ఉత్తమవంశ సంజాతుల్ని కార్డినల్స్‌గా నియమించినందువల్ల పోప్‌కి రెండువిధాల ప్రయోజనం కలిగింది. పదవులివ్వడానికి ఇద్దరివద్దనుంచి ధనం తీసుకోవచ్చును. ఆయిద్దరూ అప్పుడేయే పదవుల్లో ఉన్నారో ఆ పదవుల్ని, కార్యాలయాల్ని అమ్మి బోలెడు ధనం సేకరించారు. ఇదికాక మూడో ప్రయోజనం ఒకటుంది. అది తరవాత చెప్తాను. ముందుగా సీజర్ బార్గియా, పోప్ కలిసి ఇద్దరు ధనాఢ్యుల్ని చూశారు. క్రైస్తవమఠంలో నాలుగు ముఖ్యోద్యోగాలు ఆక్రమించిన జీన్ రాస్పిగ్లియాజీ ఒకడు. రోమన్లలోకెల్ల భాగ్యవంతుడు, ఉత్తమ పురుషుడూ అయిన సీజర్ స్పాడా ఒకడు. పోప్ ఇవ్వచూపిన పదవుల విలువ వా రిద్దరికీ తెలుసును. ఇద్దరూ ఆశాపరులే. ఇద్దరూ కార్డినల్ పదవులకోసం అపారంగా ధనాన్ని ధారపోశారు. ఈయిద్దరి పాత ఉద్యోగాలకోసం ఎనమండుగురు కొత్త వ్యక్తులుకూడా ధనం ధారపోశారు. పోప్‌కీ, సీజర్ బార్గియాకీ మొత్తం ఎనిమిది లక్షల క్రౌన్లు లభించాయి.

“ఆ తరవాత ఏమి జరిగిందంటే: రాస్పిగ్లియాజీ, స్పాడాలకు కార్డినల్ పదవులిచ్చి బుజ్జగించాడు పోప్. లేనిపోని ఋణాల నిమిత్తం ఆస్తుల్ని కట్టబెట్టనిచ్చి, ఇద్దర్ని రోమ్‌లో నివాసం ఏర్పరుచుకో నిచ్చాడు. తరవాత సీజర్ బార్గియాతో కలిసి ఆయిద్దర్ని విందుకు ఆహ్వానించాడు.

“పోప్‌కి చెందిన ఒక చక్కని భవనంలో విందు ఏర్పాటయింది. ఈ భవనాని కున్న కీర్తి ఇద్దరికీ తెలుసును. కాని రాస్పిగ్లియాజీ పదవీ వ్యామోహంలోపడి అంధుడైనాడు. స్పాడా మాత్రం వివేకంతో ప్రవర్తించాడు. అతను ప్రాణంగా చూసుకునే తమ్ముని కొడుకొక డున్నాడు. అతనిపేరు గైడోస్పాడా. సైన్యంలో కెప్టెన్‌గా ఉండేవాడు. పోప్ విందులో ఏం జరుగబోతుందో ముందే భయపడి, స్పాడా విందుకి వెళ్లేముందు తన మరణశాసనాన్ని వ్రాసేశాడు. పోప్ భవనంముందు తనకోసం వేచి ఉండవలసిందని గైడోకు కబురుపంపాడు. కాని అతను కనపడలేదని వార్తాహరుడు చెప్పాడు. స్పాడా రెండుగంటల వేళకి విందుకి బయలుదేరాడు. పోప్ అతనికోసం నిరీక్షిస్తున్నాడు. స్పాడా అక్కడికి వెళ్లగానే అతనికళ్లబడిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడైనాడు. గైడో, సీజర్ బార్గియావద్ద నిలబడి ఉత్సాహంతో ప్రసంగిస్తున్నాడు. బార్గియా ఆ యువకునిపట్ల అతి మక్కువ నటిస్తున్నాడు. స్పాడా ముఖం పాలిపోవడం బార్గియా కనిపెట్టాడు. తా ననుకున్నంతా జరగబోతోందని స్పాడా గ్రహించాడు. అందరూ విందుకు కూచున్నారు. గంటలో స్పాడా, గైడో మరణించారు. కుక్కగొడుగులు తిన్నందువల్ల ఇద్దరూ చనిపోయినట్లు వైద్యుడు నిర్ణయంచేశాడు. స్పాడా పోప్ భవనంవద్దనే మృతి చెందాడు. గైడో ఇంటివరకూ వెళ్లి ద్వారంవద్ద పడిపోయాడు. అతనిభార్య సమీపించే సరికే అతని ప్రాణాలు పోయినాయి.

“వెంటనే మృతుల పత్రాలు వెతకాలనే మిషతో, పోప్, సీజర్ బార్గియాలు వారసత్వహీనులైన వారి సంపదని వశంచేసు

కోడానికి బయలుదేరారు. కాని స్పాడా రాసిపెట్టిన వీలునామా ఒక్కటే వారికి దొరికింది. అందులో తన ధనమూ గ్రంథాలయమూ గైడోకి చెందాలని రాశాడు. ఇంతే. పోప్ సీజర్ కలిసి స్పాడా భవనమంతా గాలించారు. కాని నెయ్యి క్రౌన్లు, కొద్ది నగలు తప్ప ఇంకేమీ దొరకలేదు. గైడో ప్రాణాలు విడుస్తూ భార్యకు ఒక్క మాట చెప్పగలిగాడు—వీలునామా ఉంది జాగ్రత్తపెట్టు, అని. తండ్రికొడుకులు (సీజర్ బొర్గియా, పోప్, కుమారుడే) ఎంత వెతికినా స్పాడా సంపద దొరకలేదు. రెండుభవనాలు, ద్రాక్షతోట మాత్రం గైడో భార్యకు మిగిలాయి.

"కొన్ని మాసాలు గడిచేసరికి పోప్ పొరపాటున విషంమింగి చనిపోయాడు. తరవాత సీజర్ బొర్గియా రోమ్‌నగరం విడిచి వెళ్లిపోయాడు. ఒకరాత్రి సంఘర్షణలో అతను హతుడైనాడు. స్పాడా వంశస్థుల స్థితి అయోమయంగా ఉండిపోయింది. హత్యల గురించిన వదంతులు దేశమంతటా వ్యాపించాయి. తండ్రిని మించిన కొడుకు సీజర్ బొర్గియాయే కార్డినల్స్ ఇద్దరి సంపదనూ కొల్లగొట్టాడని అంతా అనుకో నారంభించారు. రాస్పిగ్లియాజీ అజాగ్రతవల్ల అతని సంపదంతా పోయింది."

ఇక్కడ ఫెరయా అకస్మాత్తుగా ఆగాడు. "ఇప్పటివరకూ కథ, పిచ్చివాడు చెప్పినట్టు లేదుకదా?" అని అడిగాడు.

"లేదు లేదు" అన్నాడు డాంటీ. "రసవత్తరమైన చరిత్ర ఘట్టాన్ని చదువుతున్నట్లుంది. ఆపైన ఏం జరిగిందో చెప్పండి."

"స్పాడా వంశస్థులలో ఆఖరి రాకుమారుడు కౌంట్ స్పాడాని గురించి ఇప్పుడు చెప్తాను. నేను అతనివద్ద 'కార్యదర్శి'గా పనిచేశాను. అతనెప్పుడూ తన పదవికి తగిన ధనం లేదని నిస్పృహ చెందేవాడు. క్రైస్తవకీర్తనల గ్రంథం ఒకటి పారంపర్యా వస్తున్నది. కార్డినల్ స్పాడా వీలునామాలో ఇది అత్యంత ముఖ్యమైనదని చెప్పబడింది. ఆ వంశానికి చెందిన పత్రాలన్నిటినీ నేను పరిశీలించ నారంభించాను. కాని వానిలో ఏమీ కనిపించలేదు. తరవాత బొర్గియా వంశస్థుల ఆస్తిపాస్తుల్ని గురించి, బొర్గియా ఆర్జించిన ధనాన్ని గురించి పరిశోధనచేశాను. స్పాడాభాగ్యం అతనివద్ద చేరిందో లేదో పరిశీలించాను. కాని రాస్పిగ్లియాజీ సంపదొక్కటే అతనికి లభించినట్లు తేలింది. ఇప్పుడు నాకర్థమయింది. కార్డినల్ స్పాడా సంపదబొర్గియా వశం కాలేదు. స్పాడావంశస్థు లనుభవించడం లేదు. ఎక్కడో ఏ పాతరలోనో దాగిఉందని గ్రహించాను.

"కొన్నాళ్లకి కౌంట్‌స్పాడా మృతిచెందాడు. తన వంశపత్రాల్ని, అయిదువేల గ్రంథాల్ని, మతగ్రంథాన్ని, నెయ్యి క్రౌన్ల రొక్కాన్ని నాకిచ్చిపోయాడు. ఏటేటా తన స్మృత్యర్థం ప్రార్థనలు జరిపించాలని నాకు కర్తవ్యం విధించాడు. తన వంశచరిత్రను వ్రాయాలని కోరాడు. అతను కోరినవన్నీ నిర్వర్తించాను.

"డాంటీ. తొందరపడకు. నాకథ ఆఖరు కావచ్చింది. నేను అరెస్టు కాకముందు, 1807 లో, కౌంట్‌స్పాడా చనిపోయిన పదిహేను రోజులికి, సరిగ్గా డిసెంబర్ 25వ, తేదీని, స్పాడావంశపత్రాల్ని మళ్లీ తిరగవేస్తున్నాను. తేదీ ఇంత స్పష్టంగా ఎందుకు జ్ఞాపకముందో నీకు తరవాత చెప్తాను. ఆ పత్రాల్ని అప్పటికి నేను వెయ్యిసార్లయినా చదివి ఉంటాను. భుక్తాయాసంవల్ల మధ్యాహ్నం మూడుగంటల వేళకి నాకు నిద్రపట్టింది. తిరిగి మేలుకు నేసరికి గడియారం ఆరుగంటలు కొట్టుతోంది. గది అంతా చీకటిగా ఉంది. పరిచారకుల్ని దీపం తీసుకురమ్మని కేక వేశాను. ఎవ్వరూ పలకలేదు. నేనే లేచి దీపం వెలిగించాలనుకున్నాను. పక్కనేఉన్న ఒక దీపం చేత తీసుకున్నాను. ద్వారంవద్దనున్న దీపం సహాయంతో దీన్ని వెలిగించడానికి కాగితంముక్క కోసం తడిమాను. ప్రమాదవశంవల్ల అమూల్యమైన ఏ కాగితాన్నైనా కాల్చివేస్తానన్న భయంతో చెయ్యి వెనక్కి లాక్కున్నాను. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. దగ్గర మేజాపైన మతగ్రంథంలో పసుపుపచ్చని కాగితం ఒక టుంది. స్పాడా వంశీకు లా కాగితాన్ని అలాగే ఉంచేశారు. అది పుటల్ని గుర్తుపెట్టుకోడానికి ఉపయోగపడుతోంది. మెల్లిగా వెతికి ఆ కాగితం తీశాను. చింపి ఒక ముక్క తీసుకుని ద్వారం వద్ద కెళ్లి అక్కడ దీపానికి ముట్టించాను. వెంటనే ఇంద్రజాల మహిమవల్ల నన్నట్లు, ఆ పచ్చ కాగితంమీద పసుపుపచ్చని అక్షరాలు కనిపించడం మొదలుపెట్టాయి. హడలిపోయాను. వెంటనే కాగితాన్ని నలిపి మంట ఆర్పేశాను. త్వరత్వరగా దీపం వెలిగించాను. దీపపు వెలుగులో, నలిపిన కాగితాన్ని విప్పి చూశాను. అప్పుడు నా మనోభావాల్ని వర్ణించడం నా తరం కాదు. అతి వేడిమి తగిలినప్పుడుమాత్రమే కనిపించేలాగు, రహస్యమైన ఒక రకం సిరాలో వ్రాసినవి ఆ అక్షరాలు. దాదాపు మూడోవంతు కాగితం కాలిపోయింది. మిగిలినదే ఇవాళ ఉదయం నువ్వు చదివినది. ఇప్పుడు మళ్ళీ చదువు ఆ కాగితాన్ని. పోయిన వాక్యభాగాల్ని నేను పూరించి, అర్థం చెప్తాను."


ఫెరయా పచ్చకాగితాన్ని డాంటీచేతి కిచ్చాడు. డాంటీ అత్యంత కుతూహలంతో ఇలా పైకి చదివాడు:

"ఇవాళ, అనగా 1498 ఏప్రిల్ 25వ తేదీని, పోప్ అలె....
క్జేండర్, కార్డినల్ బెంటివాగ్లియో విమ్ర......
నావద్ద తీసుకున్న ధనంతో తృప్తిచెందక, నా సంపద
నంతా......
భయంతో ఈకింది వివరాలను ఈ లేఖద్వారా నా సోద
రుని కుమారుడు గైడో......
బంగారు వెండి అచ్చుల్ని, ద్రవ్యాన్ని, నగల్ని,.........
మాంట్ క్రిస్టో ద్వీపంలోని కొండ గుహల్లో.........
ఇద్దరం కలిసేవెళ్లి అక్కడ దాచివచ్చి..........
విలువ ఇరవైలక్షల రోమన్ క్రౌన్లు.........
లోనికి చొచ్చుకుపోయినచోట చివర దిగి, తూర్పు.........
ఇరవయ్యో రాతినెత్తి...............
రెండోద్వారం దాటి వెళ్లిన తరవాత చివరిమూల.........
నిధినంతనీ సంక్రమింపచేస్తున్నాను.
"సీజ.........
"25 ఏప్రిల్ 14.........

డాంటీ చదవడం పూర్తిచేశాక ఫెరయా మరొక కాగితమిచ్చి చదవమన్నాడు. అందులో ఇలా ఉంది.

"......అలెగ్జాండర్ నన్ను విందుకి ఆహ్వానించాడు.
ఇదివరలో కార్డినల్
.........రోగంవల్ల చనిపోయిన సంగతి నాకు తెలు
సును. కార్డినల్ పదవి నిచ్చినందుకు
.... నీ కొల్లగొట్టే దురుద్దేశంతో, విందులో
నాకువిషం పెట్టగలరనే
.........స్పాడాకు తెలియపరుస్తున్నాను. నాకున్న
......విలువైన ఇతర సామగ్రిని
......దాచి ఉంచాను.
......అది ఎక్కడున్నదీ గైడోకి తెలుసును. మొత్తం
ఆ నిధి......ఉంటుంది. ఆ ద్వీపంతీరాన సముద్రజలం
......దిక్కుగా నడిచివెళ్లి

(42-వ పేజీ చూడండి)



★ వానవేళ ★

మోహన్

నింగిమీద వంగిందొక
రంగుల ఇంద్ర ధనుస్సు;
పట్టరాని హర్షంతో
పొంగింది నామనస్సు.

రివురివ్వున వీధుల్లో
సుడిగాలులు రేగినాయి;
గిరుగిర్రున ఎండాకులు
హల్లీసక మాడినాయి.

చిటపటమని మొదలుపెట్టి
జోరున కురిసింది వాన;
తడిసి తడిసి చూరుకింద
దాగిందొక కాకికూన.

జలజలమని వాననీరు
వాగై ప్రవహించింది;
రాలిపడిన ఆకొక్కటి
పడవై పయనించింది.

వానవెలిసి మబ్బులెగసి
కాంతులు చిమ్మాడు తరణి;
శుభ్రంగా కడిగినట్టు
కలకల లాడింది ధరణి.

(గతసంచిక తరువాయి)

తివాసీలో రహస్యం

రచన: సిద్ధాంతి మల్లికార్జునం

"ఎవరబ్బాయ్. ఎందుకో వెదుకుతున్నట్లున్నావే?" అన్నాడా బైరాగి.

వసంతుడు ఆ బైరాగిని అనుమానంగా చూశాడు. బహుశః తన భాష అతని కర్థం కాలేదేమోనని బైరాగివాడు వసంతుడికి తెలిసిన భాషలో మళ్ళీ అడిగాడు అదే ప్రశ్న.

"ఎవరికోరకూ నేను వెదకడం లేదు. ఈవూళ్లో వింత లన్నీ చూస్తున్నాను అంతే."



"అయితే మీది యీవూరు కాదన్నమాట."

"అవును. ఈ దేశం కూడా కాదు."

"మరి యీవూరి కెందు కొచ్చావబ్బాయ్. ఈ దేశాని కెప్పుడైనా వచ్చావా?"

"ఎప్పుడు రాలేదు. నా స్నేహితుడు తప్పిపోతే వెతికి తీసికెళ్లడానికి వచ్చాను."

"దారికాడా?"

"లేదు"

"ఎన్నాళ్లైంది అతడు తప్పిపోయి."

"అయి దారు నెలల క్రిందట."

"ఓహో" అంటూ తల వూపాడు బైరాగి. వసంతుడికి కొంచెం ఆశ పుట్టిం దిప్పుడు. ఈ బైరాగికి రకరకాల భాషలు తెలుసు కాబట్టి ఎన్నో దేశాలు తిరిగే వుంటాడు. ఎక్కడైనా సుధాకరుణ్ణి చూచివుంటాడేమోనని వసంతుడు సంతోషించాడు.

"నీ స్నేహితుడి పేరేమిటబ్బాయ్."

"సుధాకరుడు బాబూ, ఎక్కడైనా కనిపించాడా మీకు? తెలిస్తే చెప్పి పుణ్యం కట్టుకోండి స్వామీ." అని దీనంగా వసంతుడు బైరాగిని వేడుకున్నాడు.

"సుధాకరుడా!...ఈ పేరు ఎప్పుడో విన్నట్లే వుంది. జ్ఞాపకం రావటంలేదు...సరే రేపు పొద్దున విచారిస్తాంలే....ఈ రాత్రికి, నా గుడిసెలో పడుకో. తెల్లవారి మనిద్దరం కలిసి వెళ్దాం." అన్నాడు బైరాగి. వసంతుడు చాలా సంతోషపడి తక్షణం బయలుదేరి బైరాగితో అతని గుడిసెకు వెళ్లాడు.

మరునాడు పొద్దున వసంతుడు, బైరాగి కలిసి ఒక పెద్ద మందిరానికి వెళ్ళారు. ఆ మందిరం చాలా పెద్దది. అందమైనది కూడా. దాని చుట్టూ ఎత్తుగా గోడ కట్టివుంది. ఆ మందిరంలో చాలామంది బైరాగులు, సిల్కు బట్టలతో తిరుగుతున్నారు. లోపల సింహాసనాల్లాగ ఎన్నో కుర్చీలు, అద్దాలు, దీపాలు, తివాసీలు, చాలా వున్నాయి. అది ఎవరో గొప్ప ధనికులు నివసించే యిల్లని వసంతుడు మొదట అనుకున్నాడు.

వసంతుణ్ణి ఒక సింహాసనంమీద కూర్చోబెట్టి క్షణంలో తిరిగి వస్తానంటూ బైరాగి లోపలికి వెళ్లాడు. కొద్ది సేపట్లోనే ఎవరో ముసలి బైరాగి—పండు ముసలివాడు—వచ్చి వసంతుణ్ణి హెచ్చరించాడు.

"ఏం నాయనా స్నేహితుడి కొరకు చాలా తంటాలు పడుతున్నావే పాపం." అని ఎంతో దీనంగా అడిగాడు. "అవును బాబూ, నా ప్రాణాలన్ని అతని మీదే వున్నాయి. ఎన్నెన్ని దేశాలో తిరిగాను. కాని వాని జాడ తెక్కడా లేవు. నా స్నేహితుడెక్కడున్నాడో చెప్పినన్ను, వాణ్ణి కాపాడండి.....మీకు పుణ్యం వుంటుంది."

"పాపం... నీ స్నేహితుడు కొన్నాళ్ల క్రిందటే యిక్కడికి వచ్చాడు. కాని ఒకనాడు ఉన్నట్లుండి ఎక్కడికో లేచి వెళ్లాడు మాతో చెప్పకుండా. అతడికి మామీద ఎంతో భక్తి. తాను కూడా ఒక బైరాగి అవుతానన్నాడు."

"అయ్యో చేతికి చిక్కినట్లే చిక్కి పారిపొయ్యాడే!"

"నాయనా విచారించకు. అతణ్ణి వెదకడానికి మనుష్యులను పంపించాను. తప్పక అతణ్ణి పట్టుకొస్తారు. నీవిక్కడికి వచ్చావని తెలపటానికి యివాళే మరికొంతమందిని పంపిస్తాను. ...అతడు వచ్చేవరకు నీవిక్కడే హాయిగా వుండు...దా లోపలికి పోదాం"

ఇద్దరూ లోపలికి వెళ్లారు.

మరొక గదిలో వసంతుడికి మంచి భోజనంపెట్టి, కట్టుకోడానికి చక్కని బట్టలిచ్చారు. ఒకచోట మంచంపైన పడుకొని వసంతుడు నిద్రపొయ్యాడు.

వసంతుడు నిద్ర మేల్కొని చూస్తే అతడికేమీ కనబడలేదు. తానెక్కడున్నదీ అతడికి తెలియలేదు. అంతా చిమ్మచీకటి. నిశ్శబ్దంగా వుంది. ఇదంతా చూచి వసంతుడు ఏదో పెద్ద మోసం జరిగిందనుకున్నాడు. కాని ఏం చెయ్యగలడు? తానుండేది గుహలోనో, గదిలోనో, భూమిమీదనో, క్రిందనో అతడికేమీ తెలీలేదు. కాసేపు ఏం చెయ్యటానికీ అతడికి తోచ లేదు. ఆఖరుకు

"ఎవరక్కడ? తలుపు తీయండి" అని బిగ్గరగా అరిచాడు.

వెంటనే తలుపు తీసికొని యిద్దరు బైరాగులు లోపల ప్రవేశించారు.

"ఎందుకలా కేకలేస్తావ్." అని ఆయిద్దరు దబాయించి అడిగారు వసంతుణ్ణి.

"నేనిక్కడికెలా వచ్చాను?" అన్నాడు వసంతుడు.

"ఎలా వచ్చావో నీకే తెలుసు."

"నన్నెందుకు తీసికొచ్చారు యిక్కడికి?"

"త్వరలోనే చెప్తాం."

"నా స్నేహితుడి సంగతేమైనా తెలిసిందా?"

"ఆ రేపో, ఎల్లుండో పట్టుకొని తీసికొస్తారట."

"సరే. సరే...... మరి నేనీ గదిలో వుండలేను. వేరేగదివ్వండి"

"సరే వెళ్దాంపద" అంటూ వసంతుణ్ణి ఆ బైరాగులిద్దరు, ఒక సొరంగంలోకి తీసికొనివెళ్లారు ఒక చోట అతణ్ణి ఆపి. "ఏమోయ్ మీ స్నేహితుడు వచ్చేవరకు యిక్కడే ఏదో ఉపయోగపడే పని చేస్తూండాలి. సరేనా."

"అలాగే."

"మంచిది. అదిగో ఆ గదిలో నీలాంటివాళ్లే కొందరున్నారు. అక్కడికి వెళ్లు. తర్వాత మేమే వచ్చి మాట్లాడతాం" అంటూ వాళ్లు వెళ్లిపొయ్యారు.

వసంతుడు గదిలోకి వెళ్లేసరికి ఆ గదినిండా విచారంగా ఒకరినొకరు చూచుకుండేవాళ్లు కనుపించారు. వాళ్లు వసంతుడితో

కాసేపు మాట్లాడారు. ఆమాటల్లో బైరాగులందరు ఒట్టి మోసగాళ్లని తేలింది. వసంతుడు అంతమాత్రానికే బెదురుకోలేదు. ఈ బైరాగుల రహస్యం పూర్తిగా తెలిసికోవాలనే పట్టుదల వసంతుడికి కలిగింది.

తన తోటివాళ్ల నెంతమాత్రం భయపడవద్దని చెప్పి వాళ్లందర్నీ ఆ గదిలోనుంచి నడిపించాడు వసంతుడు. అలా వాళ్ళందరు వెళ్లుతూండగా దారిలో మరొక బైరాగి వాళ్లను ఆపి, కొత్తవాళ్లు మీరేనా అని అడిగాడు. అవునన్నారు వాళ్లు. ఒక్కొక్కరు ఏ ఏ పనులు చేయగలరో అడిగాడు. ఒకడు తనకు దర్జీ పని వచ్చునని, మరొకడు బట్టలు నేస్తానని, మరొకడు బంగారు నగలు చేస్తానని చెప్పారు. వసంతుణ్ణి అడిగేసరికి బంగారుకంటే విలువైన చక్కని తివాసీ నేస్తానని చెప్పాడు.

"అయితే నీమాటలు నిజమేనా?" అన్నాడు బైరాగి.

"అక్షరాలా. కావాలంటే చేసి చూపిస్తాను" అన్నాడు వసంతుడు.

"చెయ్యలేకపోతే?"

"మీయిష్టమొచ్చిన శిక్ష విధించండి"

"మేము విధించే శిక్ష అలాటిది యిలాటిది అనుకున్నావేమో, జాగ్రత"

ఏమీ భయంలేదు.

"నీ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా, కోస్తాము. ఒకసారి, కాలు, మరొకసారి చెయ్యి. ముందు గుడ్లు పీకేస్తాం"

"అన్నిటికీ సిద్ధమేనని చెప్పాతుగా."

"సరే నీకు కావలసిన పనిముట్లను కాసేపటిలో పంపిస్తాను. అదిగో, అటు వెళ్లు. అక్కడో గది వుంది. దాంట్లో కూర్చునుండు."

అంటూ మిగిలినవాళ్లందర్నీ ఆ బైరాగి మరొకచోటికి తీసికొని వెళ్లాడు.

బైరాగి చూపినదోవ ననుసరించి వసంతుడు వెళ్లాడు. దారిలో ఒక పెద్ద గుహ అతనికి కనుపించింది. ఆ గుహలోనుంచి పెద్దపెద్ద ఏడుపులు, మూలుగులు వినిపించాయి. లోపలికి రెండడుగులు వేసి, తొంగిచూచాడు వసంతుడు. ఏముంది! వందలకొద్ది మనుష్యులు చావుబతుకుల్లో తన్నుకలాడుతున్నారు. బాధతో ఒక్కొక్కరు వానపాముల్లాగా వంకరలు సాగుతూ ఏడుస్తున్నారు. అందులోనే కొన్ని బ్రహ్మాండమైన గంగాళాలలో ఏదో మరుగుతూంది. వసంతుడు దాంట్లో తొంగిచూచాడు. ఒక గంగాళంలో చనిపోయిన మనుష్యులు ఉడుకుతున్నారు కూరముక్కల్లాగా!! ఆ దృశ్యం చూసేసరికి వసంతుడి కళ్లు చెదిరిపోయాయి. వెంటనే అక్కడనుండి కదిలివెళ్ళాడు. దోవలో మరికొందరు మసకచీకటిలో పనులుచేస్తున్నారు. వాళ్ల మొహాలు నల్లగా ముడతలుపడివున్నాయి. ఒంట్లో వుండే నరాలు, ఎముకలు అన్నీ బైటికి బాగా కనుపిస్తూన్నాయి. వాళ్ళలో ఒకడు వసంతుణ్ణి చూచి "అబ్బాయ్, నీవు కూడా యీ పిశాచాల చేతిలో పడ్డావా! ఇక్కడంతా మోసమే నాయనా. యమలోకమంటే ఏమిటో అనుకున్నా! ఇదే. ఇదే నాయనా యమలోకం! మాకు యిక్కడ రాత్రికి పగటికి భేదంలేదు. పాపం నిన్ను చూస్తే నా కడుపు తరుక్కుపోతోంది నాయనా!....... నేను నీలాగే బైరాగులను చూచి మోసపొయ్యాను..." అంటూండగా ఎవరోవచ్చే సందడైంది. వసంతుడు తక్షణం తన గదికి వెళ్లాడు.

కాసేపటికల్లా తివాసీ నేతకు కావలసిన వస్తువులు, ఆహారము అన్నీ వచ్చాయి వసంతుడి గదికి. వారం రోజులకల్లా వసంతుడు చక్కటి తివాసీ నేశాడు. దానిమీద రంగురంగుల పూలు, లతలు బొమ్మలు ఎన్నెన్నో నేశాడు. దాన్ని చూస్తే నిజంగా కళ్లు చెదిరిపోతున్నాయి. దాన్ని చూచి ఆ బైరాగి చాలా సంతోషించాడు. వసంతుడికి ఆనాడు మంచి భోజనం పెట్టాడు. ఆ తివాసీని ఎక్కడైనా అమ్ముకొని డబ్బు సంపాదించాలనే ఆశపుట్టింది ఆ బైరాగికి.

"ఏమోయ్. దీని విలువ ఎంత వుంటుంది?"

"దీని విలువ!! అబ్బ! ఏమని చెప్పను బాబూ! బంగారానికి నాల్గింత లుంటుందంటే నమ్మండి"

అని, ఎవ్వరు వినకుండా ఏవో కొన్ని మాటలు బైరాగిచెవిలో చెప్పాడువసంతుడు. ఆమాటలు విని యింత మొహం అంత చేసుకుంటూ బైరాగి కదిలి పొయ్యాడు తివాసీ తీసికొని.

వసంతుడు వెళ్లి రెండు నెలల పైగా అయిపోయింది. భర్త చెప్పిన గడువు దాటిపోయింది. అతడు చెప్పిన ప్రకారం యీపాటికతడు ప్రాణాలతో వుండకపోవడమో ఏదో ప్రమాదంలో చిక్కుకొని పోవడమో జరిగివుంటుంది. అని తీర్మానించుకుంది అనూరాధ. పాపం, ఆమెకు ఒకవైపు దుఃఖం మరొకవైపు ఆశ. ఈ రెంటిమధ్య ఆమె చాలా బాధ పడుతూ జాగ్రతగా రాజ్యంచేస్తూంది. ఆమె తెలివితేటలవల్ల రాజు వూళ్లోలేడన్న సంగతి ఆమెకు మంత్రికి తప్ప రాజ్యంలోపల ఎవరికీ తెలీలేదు!

ఇలా వుండగా కాశ్మీర దేశంనుండి ఒక వర్తకుడు వచ్చాడని రాణీగారిని చూడవలెనంటున్నాడని ఒక వార్తను రాణి కందచేశారు భటులు. వెంటనే తనగదిలోకి అతణ్ణి ప్రవేశపెట్టమని అనూరాధ ఆజ్ఞాపించింది. అలాగే ఆ వర్తకుడు కాసేపటికల్లా అనూరాధ గదిలోకి వచ్చి తివాసీమీద కూర్చున్నాడు.

"మీది కాశ్మీర దేశమా?" అన్నది రాణి. అవునంటూ ఆ వర్తకుడు రాణికి నమస్కారంచేశాడు.

"ఏ పని మీద వచ్చావు?" అన్నది రాణి.

"ఏమీలేదమ్మా. నేను తివాసీల వ్యాపారం చేస్తాను. తమ కేమైన కావాలేమోనని వచ్చాను." అన్నాడు వ్యాపారి.

"ఓహో......మంచిది...... ఏవీ నీదగ్గరుండే తివాసీ లేవో చూపించు" అనేసరికి తన పెట్టె తీసి జాగ్రతగా మాసిపోకుండా మడతపెట్టిన తివాసీ రాణి చేతి కిచ్చాడు. దాని చక్కదనానికి అనూరాధ బలే ఆశ్చర్యపడ్డది. దాన్ని చేతికి తీసికొని చూచేసరికి అందులో ఆమెకు కొన్ని అక్షరాలు కనుపించాయి. నెమ్మదిగా ఒక్కొక్కటే చదువుకుంది యీవిధంగా:

"ప్రియమైన అనూరాధా, ఇప్పుడు నేనొకగొప్పప్రమాదంలో చిక్కుకున్నాను. కొందరు బైరాగుల చేత మోసగింపబడి ఒకపెద్ద బందిఖానాలో పడ్డాను. మనరాజ్యానికి పడమటగా వుండే రాజ్యానికి ముఖ్యపట్టణమైన శాంతిపురంలో, దక్షిణపు కొసలో ఒకచక్కని మందిరం కనుపిస్తుంది. దాని లోపలంతా నరకం. ఆనరకంలో వున్నానిప్పుడు.

నీదగ్గరికి యీ తివాసీ తీసికొని వచ్చినవాడు నన్ను మోసగించిన బైరాగులలో ఒకడు. నా చేత యీ తివాసీ నేయించుకున్నాడు. నీవైతే చాల డబ్బు యిచ్చి యీ తివాసీని కొంటావని వీడికిచెప్పి పంపాను.

కాబట్టి పెద్ద సేనతోవచ్చి నన్ను విడిపించాలినువ్వు. నాలాగా కొన్ని వందలమంది యీ నరకంలో యమబాధలు పడుతున్నారు. ఆలస్యం చెయ్యక, తప్పక బయలుదేరు.

నీ, వసంతుడు.

తివాసీమీద పూల బొమ్మలు అనూరాధకు పై విషయాలు చెప్పాయి.

ఆ తివాసీని జాగ్రత్తగా మడతపెట్టి కొందరు భటులను పిలిపించి అప్పటికప్పుడే కాశ్మీరువ్యాపారిని తీసికెళ్లి బందిఖానాలో పడవేయించింది అనూరాధ.

మరునాటికి పెద్ద సేన సిద్ధంచేసికొని శాంతిపురంమీదికి రాణి దండెత్తి వెళ్లింది. రాణి సేనలన్నీ శాంతిపురాన్ని ధ్వంసం చేశాయి. ఎక్కడ కనబడ్డ బైరాగిని అక్కడే చితకపొడిచారు శిపాయిలు. మందిరాన్ని కళ్లు మూసి తెరిచేలోగా నాశనంచేసి, బైరాగులందరిని నరికిపోగువేశారు ఆ శిపాయిలు. లోపలికి వెళ్లి ఒక్కొక్కగది వెదికి వసంతుణ్ణి విడిపించారు. వాళ్ళకు దారులన్నీ చెప్పి వసంతుడు నరకంలో బాధపడే వాళ్లందర్ని విడిపించాడు. పాపం, వాళ్లందరు ప్రాణాలతో బైటపడ్డారు. ఒక్కడికీ శక్తిలేదు. ముసలివాళ్లయినారు వయసువాళ్లు కూడా! అందరినీ వెదకి యిదివరకు తనతో మాట్లాడిన ముసలివాణ్ణి పట్టుకొచ్చాడు వసంతుడు. ముసలివాణ్ణి వసంతుడు గుర్తించాడు. కాని వసంతుణ్ణి ఆ ముసలివాడు గుర్తించలేదు.

ఆ ముసలివాడే సుధాకరుడు! ఆ స్నేహితులు ఎంత సంతోషించారో వర్ణించలేము!


"అమ్మా, అనూరాధా! మమ్మల్ని రక్షించావు. ఎంత పుణ్యమమ్మా నీకు!" అన్నాడు సుధాకరుడు.

"అలా కాదు సుధాకర్. నన్ను పెళ్లిచేసికోను అని చెప్పినప్పుడే రక్షించింది." అన్నాడు వసంతుడు.

అందరు నవ్వుకొంటూ స్వదేశానికి వచ్చేశారు.

(ఆంగ్లకథఆధారంతో) ★

అద్దం



ఆ రాజ్యంలో ఎక్కడా అద్దమనేమాట లేదు. రాణి గారి ఆజ్ఞానుసారం రాజ్యంలో ఒక్క అద్దం ముక్కకూడా లేకుండా అన్నీ ధ్వంసం చెయ్యబడినాయి. ఏ ఇంట్లోనైనాసరే, అద్దం ముక్క ఉన్నదని తెలిసిందా, ఆ ఇంట్లో వాళ్లందరినీ చిన్నా, పెద్దా భేదంలేకుండా రాణి చిత్రవధ చేయించేది.

రాణి ఈవిధంగా చెయ్యటానికి ఒక కారణంవున్నది. ఆమెకి అందం లేదు సరి గదా, పిశాచాలు, దెయ్యాలుకూడా అంత వికృతంగా భయంకరంగా ఉండవు. తాను ఇంత ఘోరంగా ఉంటానని రాణికి తెలుసు. అందుచేత ఎక్కడన్నా అద్దం అనే వస్తువుఉంటే పొరబాటుగానైనా తన ముఖం అందులో కనిపిస్తుందేమో అని ఆమె భయం. అంతేగాదు. ఇతర్లుకూడా తమ తమ ముఖాలు అద్దంలో చూసుకోగూడదు. అందగత్తెలెవరన్నా ఉంటే వాళ్లు అద్దంలో చూసుకుని, "ఓహో మా కింత అందం ఉంది గదా; మనని పరిపాలించే రాణికి మన అందంలో వెయ్యోవంతు కూడా అందంలేదు," అని గ్రహిస్తారు. అందుచేత వాళ్లు కూడా అద్దంలో చూసుకోరాదు.

ఆ రాజ్యంలో స్త్రీలకి ఎంత అందమైన కళ్లు ఉంటే మాత్రం లాభమేమిటి? అద్దంలేనిదే గులాబీ రేకుల్లాంటి పెదవులని, పూలచెండ్లు తురుముకున్న అందమైన కేశపాశాల్ని తమకు తాము చూసి ఆనందించుకోలేరు గదా! పోనీ స్వచ్ఛమైన సరస్సుల్లోను, కాలవల్లోనూ ప్రతిబింబం చూసుకుందామంటే, అన్నిటిమీద రాతిపలకలు కప్పించేసింది రాణి. బావులున్నాయిగదా అనుకుంటే, ఆ రాజ్యంలో బావులు ఫర్లాంగు లోతున వుంటాయి; అందులో ప్రతిబింబమెక్కడ కనిపిస్తుంది? అందుకనే ఆ రాజ్యంలో అందమైన స్త్రీలు ఎప్పుడూ దిగులుగా ఉండేవాళ్లు.

2

కాని పట్టణానికి చేరువగా ఉన్న ఒక పల్లెటూళ్ళో మల్లిక అనే అమ్మాయి మాత్రం విచారమనేది

మూలం:

కౌటూల్ మెండే

ఎరగదు. మల్లికని మాధవుడనే యువకుడు ప్రేమించాడు. అద్దంలేని కొరతను తీర్చటం కోసమే అన్నట్లు, మాధవుడు ఎప్పుడూ మల్లిక అందాన్ని వర్ణిస్తూ కూర్చునేవాడు. 'నిన్ను తప్ప ఇంకెవ్వరినీ పెళ్లాడ' ననేవాడు. ఈ మాట విని ఆమె అద్భుతంగా సిగ్గుపడితే, ఆ అందాన్ని ఆమెకి చూపటానికి తను అద్దంగా మారిపోతే ఎంత బావుండు ననుకునేవాడు మాధవుడు.

మల్లికా మాధవుల సంగతి రాణికి తెలిసింది. ఇతరుల ఆనందం పాడు చెయ్యకపోతే ఆమెకి నిద్ర పట్టదు; అన్నం సయించదు; మంటల్లో కాలుతున్నంత బాధగా ఉండేది. ముఖ్యంగా రాణికి మల్లిక అంటే మహాకోపం. ఎందుకంటే మల్లిక లాంటి అందగత్తె ఆ రాజ్యంలో ఇంకొకతె లేదు.

3

మల్లికా మాధవులకి ఇంకొక వారం రోజుల్లో వివాహం జరుగుతుందనగా, ఒక రోజున మల్లిక తోటలో మల్లెచెండు గుచ్చుతోంది. ఇంతలో నడుంవంగి వికృతంగా వున్న ముసలి బిచ్చగత్తె ఒకతె అక్కడకు వచ్చింది. మల్లికని చూసీచూడగానే బిచ్చకత్తె వెర్రి కేక వేసింది.

"ఓరి దేముడో! నువ్వు మనిషివా, పిశాచానివా?" అన్నది బిచ్చగత్తె.

"ఎవర్ని చూసి అంటున్నావు ఆ మాట" అన్నది మల్లిక.

"నిన్నే. అబ్బ! ఎంత ఘోరాకారం! నీకంటె అందవికారులు ప్రపంచంలో వుంటారా?"

"నిజమా? వేళాకోళమా? నేనా? అందవికారినా?" అని ఆశ్చర్యపోయింది మల్లిక.

"నీ వికృతాకారాన్ని వర్ణించటానికి మాటలు చాలవు," అంటూ ఆ బిచ్చగత్తె వెళ్ళిపోయింది.

ఆ బిచ్చగత్తెని రాణి పంపించింది, మల్లిక ఆనందాన్ని నాశనం చెయ్యాలనే ఉద్దేశంతో. పాపం మల్లిక బిగ్గరిగా రోదిస్తూ మల్లె పందిరికింద కూలబడి పోయింది.

4

మల్లిక నూరడించటానికి మాధవుడు వెయ్యివిధాల ప్రయత్నించాడు. కాని అరచేతుల్లో ముఖం దాసుకుని "నేను అందవికారిని, నేను అందవికారిని," అని మల్లిక ఏడుస్తోంది. మాధవుడు ఎన్నోరకాల ఒట్లు పెట్టుకున్నాడు, "నువ్వు నిజంగా అందగత్తె" వని. కాని ఆమె వినిపించుకుంటేగా? పెళ్ళి నిశ్చయింపబడినసంగతి జ్ఞాపకం చేశాడు.

"నేనా? నీకు భార్యనికావటమా? అసంభవం. నీలాంటి అపరూపసుందరుడికి నేను తగను, తగను." అని ఇంకా బిగ్గరిగా ఏడ్చింది మల్లిక.

ఎల్లా మల్లికని నమ్మించటం? ఆమె అందం ఆమెకి చూపాలంటే అద్దం కావాలి. ఆ రాజ్యంలో అద్దం ముక్కయినా లేదయ్యె. రాణిదండనకు వెరచి పనివాడొక్కడూ అద్దం తయారు చెయ్యటానికి సాహసించటం లేదు.

"ఏమైనా సరే రాణిదగ్గరకు వెడతాను. నా కన్నీళ్లు, మల్లిక అందం చూసి రాణి కనికరించకపోతుందా?" అనుకున్నాడు మాధవుడు.

5

"ఏమిటి? ఎవరు మీరు? ఏం కావాలి మీకు?" అని అడిగింది రాణి.

"మహారాణీ! దుఃఖసముద్రంలో మునిగిన నన్ను రక్షించండి," అన్నాడు మాధవుడు.

"నాకేం పట్టింది, నిన్ను రక్షించటానికి?"

"కనికరించండి మహారాణీ! ఒక్క అద్దం దయచేయించండి

సాకు. అంతకంటే వేరేమీ అడగను."

"ఎంత సాహసం! నాముందు అద్దం అనే మాట ఉచ్చరించగూడదని నీకు తెలియదా?" అని కోపంతో కంపించిపోయింది రాణి.

"క్షమించండి మహారాణీ! కోపగించక నామాట వినండి. మీ ఎదుట నిలబడివున్న ఈ యువతి ఒక గొప్ప భ్రమలో పడిపోయింది. తనుఅందవికారి నని ఆమె భ్రమించి బాధపడుతోంది. . . . ."

"అది భ్రమా? ఆమె అందవికారిగాక అందకత్తెయా? నీకు కళ్ళు లేవా? ఇంత అసహ్యమైన స్త్రీని నే నెప్పుడూ చూడలేదు" అని వికటాట్టహాసం చేసింది రాణి.

మల్లిక ఈ మాటలతో మరీ కుంగిపోయింది. ఆరోజున బిచ్చగత్తె, ఇప్పుడు మహారాణి కూడా తను అందవికారి నన్నారు. అది నిజమేనని ఇప్పుడు ధ్రువపరచుకుంది. సింహాసనం మెట్లమీద మారు మాట లేకుండా కూలబడింది.

రాణి మాటలకి మాధవుడికి పట్టరాని ఆగ్రహం కలిగింది. రాణికి పిచ్చెత్తన్నా వుండాలి, లేకపదో కారణంవల్ల అబద్ధమాడుతూఅన్నా ఉండాలి, అని బిగ్గరగా అనేశాడు.

అసి అనటంతోనే భటులు మాధవుణ్ణి పట్టుకుని, పెడరెక్కలు విరిచి కట్టేశారు. రాణి సైగచేసింది. సింహాసనం వెనక ఎప్పుడూ సిద్ధంగా ఉండే తలారివాడు వెడల్పాటి ఉక్కుకత్తిని ఝుళిపిస్తూ ముందుకు వచ్చాడు.

"సిపని నువ్వు చెయ్యి," అని ఆజ్ఞాపించింది రాణి.

తలారివాడు కత్తిపైకెత్తాడు. అక్షణంలోనే రెండురకాల కేకలు వినిపించాయి. . . . . . .

సింహాసనం మెట్లమీద కూలబడిన మల్లిక కళ్ళు విచ్చి చూసేసరికి ఎదురుగా తళతళలాడే ఉక్కుకత్తిలో తన ప్రతిబింబం కనిపించింది. తన అత్యద్భుత సౌందర్యం మొదటిసారిగా చూసుకునే సరికి ఆమె సంతోషంతో అరిచింది.

రెండో కేక రాణిది. కాని అది బాధతో కూడినది. తలారి కత్తి ఎత్తగానే ఆమెకు కూడా తన ప్రతిబింబం కత్తిలో కనబడింది. అకస్మాత్తుగా, అనుకోకుండా తన వికృతముఖం తనకే కనిపించే సరికి ఆమె అవమానంతోనూ, క్రోధంతోనూ వెర్రికేక వేసి, సింహాసనంమీద నుంచి దొర్లిపడి చనిపోయింది. ★

ఫ్రెంచి కథకు (అనువాదం: ఎస్నార్.)

"మీరు వారానికి రెండుసార్లు సినిమాలు చూస్తున్నారు; మీకు సినిమాలంటే చాల ఇష్టమనుకుంటాను."

"అదికాదు. ప్రతి సినిమాని విడవకుండా చూడకపోతే మాపిల్లలు మాట్లాడే భాష బొత్తిగా అర్థంకాదు."

* * * *

మాష్టారు: "రామం! ఏం చేస్తున్నావక్కడ? ఏమన్నా నేర్చుకొంటున్నావా?"

రామం: "లేదండి. మీరు చెప్పేది వింటున్నాను."

* * * *

మేజిస్ట్రేటు సాక్షితో: "పోట్లాట జరుగుతున్నప్పుడు నువ్వక్కడ ఉండికూడా ప్రతివాదికి ఎందుకు సహాయపడలేదు??

సాక్షి:—"ఆ ఇద్దరిలో ఎవరు ప్రతివాది కాబోతున్నాడో ముందే ఎలా తెలుస్తుందండి?"



అతిప్రియం

ఫ్రాన్సు యిటలీ దేశాల సరిహద్దులలో, మెడిటరేనియన్ సముద్రతీరాన్ని, మొనాకో అని బుల్లిరాజ్యం ఉండేది. చాలా చిన్న పట్టణాల్లో కన్న యీ రాజ్యంలో జనాభా చాలా తక్కువ. మొత్తం అంతా కలిపితే ఏడువేలు. అక్కడవున్న భూమినంతటినీ పంచితే, తలకి ఓ యకరం కూడారాదు. ఆ బుల్లిరాజ్యానికి ఒక బుల్లిరాజు. అతనికి ఓరాజభవనం, సామంతులు, మంత్రులు, మతాధికారి, సేనాపతులు, ఒకసేన - అన్నీ వుండేవి.

అయితే ఆసేన పెద్దదేమీకాదు. మొత్తం అరవయిమంది. అయితేనేం, అదిసేనే. ఈ రాజ్యంలో కూడా మిగత రాజ్యాల్లోలాగే, పన్నులు వుండేవి. పొగాకుమీద, సారాయి మీద, తలమీదాను. అయితే, ఆదేశంలో పొగత్రాగేవాళ్లు తక్కువ. అందువల్ల, ఆ రాజేగనుక వేరే ఉపాయం కనిపెట్టి వుండకపోయినట్లయితే ఆ రాజ్యాన్ని నడపడానికిగాని, సామంతుల్నీ, అధికారుల్నీ మేపడానికిగాని వీల్లేకపోయేది. అది వేరే ఏమీ కాదు. "రౌలట్" అని ఆట ఆడడానికి ప్రత్యేకంగా ఓ పెద్దభవనం కట్టించాడు. ఆట ఆడినవాళ్లు ఓడినా, నెగ్గినా, ఆ భవనం యజమానికి మాత్రం నికరంగా డబ్బు వస్తుంది. అందులో చాలాభాగం అతను రాజుకు చెల్లిస్తాడు. అందులోనూ, యూరపులో కల్లా ఆ ఆట ఆడటానికి వీలయిన స్థలం అది ఒకటే. మునుపు జర్మనీలో కొన్ని కొన్ని చోట్ల అటువంటి

మూలం:

టాల్‌స్టాయ్

స్థలాలు వుండేవిగాని, తరువాత తరువాత వాటిని మూసేశారు. మొదట్లో ఒకడు ఆట అసలు ఏమిటో చూద్దామని వస్తాడు. తరవాత, తనకి ఉన్నదంతా పెట్టిఓడిపోతాడు. ఆ తరువాత తనకి చెందని డబ్బుకూడా పెట్టి ఓడిపోతాడు. ఇంక చివరకి నిరాశతో, ఆత్మహత్య చేసుకుని మరణిస్తాడు. ఆ ఆట అందువల్ల చాలా హానికరం గాబట్టి జర్మనుల గోల పడలేక, వాటిని ఆ రాజులు మూసేశారు. కాని మొనాకోలో ఎవరూ అల్లాగ చెయ్యక పోవడంవల్ల, ఆ ఆటలో ఆరాజుదే నికరమయిన వ్యాపారంగా నిల్చిపోయింది.

ఇప్పుడు ఎవరికయినా ఆ ఆట ఆడాలని వుంటే మొనాకోకి పోతారు. వాళ్లు ఏమయినా, రాజుకిమాత్రం లాభమే. "నమ్మకంగా పనిచేస్తే, భవనాలు కట్టలేము" అని సామెతగదా! తను చేస్తున్న పని వెధవ వ్యాపారం అని మొనాకోరాజుకి తెలుసు. అయినా, అతను వేరే ఏం చెయ్యగలడు? అతను బతకాలి, రాజ్యం చెయ్యాలిగదా! పొగాకుమీద, త్రాగుడుమీద పన్నుకూడా అట్టే లాభంలేదు. అందువల్ల యీ లాగ వచ్చిన డబ్బుతో అతను రాజరీవి వెలిగిస్తున్నాడు.

పట్టాభిషేకం చేసుకున్నాడు. ఆ రాజు బహుమతులు పంచిపెడ్తాడు. ఎవరికైనా శిక్ష వేస్తాడు. మళ్ళీ అనుగ్రహిస్తాడు. అతనికి రాజసభలు, పరిషత్తులు, న్యాయం, న్యాయస్థానాలు - అన్నీ కూడా, అందరిలాగానే వున్నాయి. అయితే, యితని తాహతుకి తగ్గట్టు కొద్దిసైజులో.

ఇట్లా వుండగా, ఓసారి, ఏమయిందీ, ఆ బుల్లిరాజు రాజ్యంలో ఖూనీ జరిగింది. స్వతహాగా ఆ రాజ్యంలో వాళ్లు చాలా నెమ్మదస్తులు. ఇటువంటి ఘోరంయింతకు పూర్వం ఎన్నడూ జరిగి వుండలేదు. న్యాయాధిపతులు చాలా హడావిడిగా సమావేశమయ్యారు. ఈ సంగతిని చాలా జాగ్రత్తగా విచారించారు. విచారణలో, పోలీసులు, న్యాయాధిపతులు, పంచాయితీ దార్లు, ప్లీడర్లు అందరూ వున్నారు. చాలాసేపు వాదించి విచారించాక, చివరకి వాడికి ఉరిశిక్ష వేశారు. ఆ తీర్పును రాజు చూసి, నిర్ధారించాడు—

"వీణ్ణి ఉరితియ్యడం తప్పకపోతే, సరే" నన్నాడు. అంతవరకు బాగానే వున్నది.

అయితే, యిందులో ఒక చిక్కు వచ్చింది. వాళ్లకి మనుష్యుల తలలు కోసెయ్యడానికి "గిల్లొటిన్" అనే యంత్రంత

గాని, ఆపనిచేసే మనిషికాని దొరకలేదు. మంత్రులందరూ, యీ విషయమై ఆలోచించి, ఫ్రెంచి ప్రభుత్వానికి వ్రాసి, ఒక యంత్రాన్ని, దాన్ని పనిచేయించడానికి ఓ మనిషినీ, పంపడానికి వీలవుతుందేమో కనుక్కోడానికి నిశ్చయించారు. అల్లాగ అయితే, ఎంత అవుతుందో? సరే, ఓ ఉత్తరం పంపించారు. వారం రోజుల్లో సమాధానం వచ్చేసింది. యంత్రాన్ని, మనిషినీ, పంపుతారు. ఖరీదు 16,000 ఫ్రాంకులు. రాజుగార్కి ఆశ్చర్యం వేసింది. పదహారు వేల ఫ్రాంకులే!" ఆ దొంగవెధవ యింత విలువ చెయ్యడు. ఇంతకంటె చవకగాపని అవదూ? ఈలెక్కని మన రాజ్యంలో తలకి రెండు ఫ్రాంకులపైనే అవుతుంది. ఈసంగతి తెలిస్తే ప్రజలు తిరగబడవచ్చును కూడాను!" అన్నాడు రాజు.

సరే, మళ్ళీ ఏం చెయ్యడమో తేల్చడానికిగాను, ఒక పరిషత్తును పిలిచారు. ఇటలీ రాజుగార్కి వ్రాసి కనుక్కుంటే మంచిదన్నాడు. ఫ్రాన్సులో ప్రజాస్వామ్య ప్రభుత్వంగాబట్టి, వాళ్లకి రాజులంటే గౌరవం లేకపోవచ్చు. ఇటలీరాజు తన తోటి రాజుకి ఆ మాత్రం గౌరవం చూపక పోతాడా? పైగా చవకగాకూడా పని అవుతుందేమో! ఉత్తరం వ్రాసీ వ్రాయగానే జవాబు కొస్తా వచ్చేసింది.

ఒక యంత్రాన్ని మనిషితోబాటు సంతోషంగా పంపుతామనీ, అందుకు బత్తి ఖర్చుతోసహా 12,000 ఫ్రాంకు లవుతుందనీ, ఇటలీ ప్రభుత్వం వ్రాసింది. ఇది కొద్దిగా చవకయినా, యింకా ఎక్కువే గదా! నిజానికి ఆకుంక యింత డబ్బు ఖర్చు చెయ్యడానికి తగ్గవాడు కాదుగదా! ఇప్పటికే తలకి సుమారు రెండు ఫ్రాంకు లవుతూనేవుంది.

ఇరకా చవకగా పని అవడంకోసం వేరే పరిషత్తుని పిలిచారు. వాళ్ల సైన్యంలోనే ఎవడితోనో యీ పని కొస్తా అయిం దనిపించేస్తే!! వెంటనే సేనాపతిని పిలిపించి అడిగాడు: "ఒక మనిషిని తల నరకడానికి పంపండి. యుద్ధంలో చాలామందిని చంపుతారు. నిజానికి చంపడానికే వాళ్లు వున్నారాయెను!".

ఆయన వెళ్లి సేనని అడిగాడు.

"మాకు ఎవరికీ ఆ పని చేతకాదు. మాకు నేర్పింది అదికాదు" అని సైనికులు చెప్పేశారు.

ఇంకేమిటి చెయ్యడం? మళ్లీ మంత్రులు ఆలోచించారు. ఒక కమీషన్, ఒక సంఘము, తరువాత ఒక ఉపసంఘం. చివరికి మరణశిక్షని ఆజన్మాంత ఖైదుగా మారిస్తే చిక్కు తీరిపోతుం దన్నారు. పైగా వాడిమీద రాజుగార్కి దయ చూపెట్టటానికిగూడా వీలవుతుంది. చవకగూడాను.

రాజుకూడా దీనికి సరేనన్నారు. అయితే యీసారి మరో గొడవ వచ్చిపడింది. యావజ్జీవ ఖైదుకి తగిన ప్రదేశం ఆ రాజ్యంలోనే లేదు. అప్పుడప్పుడు ఎవరైనా, తత్కాలానికి పెట్టే కొట్టు ఒకటి మాత్రం వున్నది. శాశ్వతంగా అది ఖైదుకి పనికి రాదు. చివరికి ఎక్కడో ఓచోట కాస్త వీలుగా చూసి, అపుత్రవెధవని అందులో పెట్టారు. కావలివాడ్ని గూడా పెట్టారు, వాడు పారిపోకుండా చూస్తో వుండడానికి. వాడే, రాజభవనం లోంచి అన్నం పట్టుకువచ్చి పెడతాడు.

ఓ ఏడాదిపాటు, ఆ ఖైదీ అక్కడే వున్నాడు. ఓరోజు రాజుగారు జమా ఖర్చుల జాపితా చూస్తోండగా ఓ కొత్త ఖర్చు కనపడ్డది. అది ఖైదీకోసం అయిన ఖర్చు. పోతే, ఆ అయినఖర్చు, తేలికగా తీసెయ్యడానికి మరీ చిన్న ఖర్చా కాదు. ప్రత్యేకంగా కాపలావుండె. పైగా ఖైదీ తిండిఖర్చు వుండె. అంతా కలిసి 600 ఫ్రాంకుల పైమాట. పైగా యింకొక చిక్కు. ఆ ఖైదీ చూస్తే యింకా చిన్నవాడు. అధమం యింకా యాభయి ఏళ్లన్నా బతకవచ్చు. అంతా లెక్క వేసి చూడగా చాలా అయింది. ఉహుం! ఎంతమాత్రము వీల్లేదు. రాజు మంత్రులతోటి అన్నాడు—"యీ కుంక ఖర్చు తేలికలో అయ్యేట్లు చూడండి. లేకపోతే చాలా అయిపోతోంది!"

చివరకి వాళ్లలో ఒకడిలాగ అన్నాడు.

"ఆకాపలా వాడ్ని తీసేస్తే ఖర్చు తగ్గదూ?"

దానికి యింకొకడు వెంటనే అడ్డుపుల్ల వేశాడు. "ఖైదీ పారిపోతే?"

"పోతే శని విరగడయి పోతుంది" అన్నాడు మొదటివాడు. బాగుందని, యీ విషయం రాజుగారు కూడాఅంగీకరించారు. సరే కాపలావాడ్ని తీసేశారు. ఖైదీ మాత్రం సరిగ్గా తిండి వేళకి, స్వయంగా వెళ్లి పెట్టిందేదో తెచ్చుకుని, కొట్లోకి వెళ్లి, మళ్లీ తానే తలుపువేసేసుకున్నాడు. అంతే కాని, వాడు పారిపోదామని ప్రయత్నంకూడా చెయ్యలేదు. ఆ మర్నాడు కూడా యిల్లాగే జరిగింది. ఇది ఎట్లా తేలేది?

"పోనీ వాడితో పొమ్మని చెప్పేస్తే?"

ఈ ఆలోచన తట్టగానే, న్యాయమంత్రి వెంటనే ఖైదీని పిలిచి, అడిగాడు—'ఏమిరా, నీకు కాపలా ఎవరూ లేరుగదా - నువ్వెందుకు పారిపోవు? పారిపోతే రాజుకూడా ఏమనుకోరు!"

వాడు సమాధానం చెప్పాడు.

"రాజు ఏమనకపోయినా, నే నెక్కడికి పోతాను చెప్పండి? నాకీ శిక్ష వేసినన్నాడు చేశారు. ప్రజలా నన్ను దగ్గరకి చేరనీరు. పైగా నాకుపని చేసే అలవాటు తప్పిపోయింది. మీరు నన్ను చాలా అన్యాయంగా కూడా చూశారు. మొదట్లో నన్ను ఉరితీస్తామని చెప్పి ఊరుకున్నారు. తరువాత ఆజన్మాంత ఖైదన్నారు. ఓ కాపలావాడ్ని వేశారు. పోనీ వాడు అయినా అన్నం తెచ్చి పెట్టుతున్నాడనుకుంటే వాడినీ తీసేశారు. అయినా నేను మాట్లాడలేదు. ఇప్పుడు నన్ను పొమ్మనే అంటున్నారు. ఏమయినా సరే, నేను పోయేది లేదు."

వాడు పోడట! ఏం చెయ్యడం?

మళ్లీ సభ సమావేశమయ్యింది. చివరకు రాజు అనుమతిమీద 600 ఫ్రాంకులు భరణం యిచ్చేట్లు ఒప్పుకున్నారు.

"మీరు సరిగ్గా అన్నప్రకారం యిచ్చేట్లయితే సరే" నని ఒప్పుకున్నాడు ఖైదీ.

వ్యవహారం తేలిపోయింది. వాడికి ఏడాదిలో రావలసినదాంట్లో మూడోవంతు తీసుకుని, ఆ రాజ్యం వదలి వెళ్లిపోయాడు. సరిహద్దు దాటగానే ఓ చిన్న భూమిని కొనుక్కుని, పండ్లతోట వేసుకున్నాడు వాడు. అక్కడికి వెళ్లాలంటే పావుగంట రైలు ప్రయాణం. సరిగా వేళకి వస్తాడు. డబ్బు తెచ్చుకుంటాడు, సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు. డబ్బు తీసుకోగానే, ఒకటో రెండో ఫ్రాంకులు ఆటలో కొస్తాడు. వస్తే వస్తుంది. లేకపోతే పోతుంది. హాయిగా వుంటున్నాడు వాడు.

అయితే, ఒక్క సంగతిమాత్రం చాలా మంచి దయింది. - మనుష్యుల్ని తలలు తియ్యడానికీ ఆజన్మాంత ఖైదు వెయ్యడానికీ అయ్యే ఖర్చునిగురించి విచారించని దేశంలోమాత్రం అతను పుట్టలేదు! ★

(అనువాదం: వేమరాజు నరసింహారావు)

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(31-వ పేజీ తరువాయి)

......గుహలో ప్రవేశించాలి. ఈ గుహలో రెండు
చోట్లద్వారా లున్నాయి.
......ను నిధి దాచబడింది. నాకు ఏకైక వారసుడైన
గైడో స్పాడాకు ఈ
...ర్ స్పాడా"
.....98"

ఫెరయా యువకునివంక ఆత్రుతతో చూశాడు. "ఇప్పుడీ రెండు ముక్కల్నీ దగ్గర చేర్చి చదువు. అప్పుడు నీ ఇష్టం వచ్చిన అభిప్రాయానికి రావచ్చును" అన్నాడు.

డాంటే అలాగే రెండుముక్కల్నీ చేర్చి ఈమారు చదివాడు. అది ఇలా ఉంది:

"ఇవాళ, అనగా 1498 ఏప్రిల్ 25 వ తేదీని, పోప్ ఆరో అలెగ్జాండర్ నన్ను విందుకి ఆహ్వానించారు. ఇదివరలో కార్డినల్ కెప్రరా, కార్డినల్ బెంటి వాగ్లియో విషప్రయోగంవల్ల చనిపోయిన సంగతి నాకు తెలుసును. కార్డినల్ పదవినిచ్చినందుకు నావద్ద తీసుకున్న ధనంతో తృప్తిచెందక, నా సంపదనంతని కొల్లగొట్టే దురుద్దేశంతో, విందులో నాకు విషం పెట్టగలరనే భయంతో, ఈక్రింది వివరాలను ఈ లేఖద్వారా నాసోదరుని కుమారుడు గైడో స్పాడాకు తెలియపరుస్తున్నాను. నా కున్న బంగారు వెండి అచ్చుల్నీ, నగల్నీ, వజ్రాల్నీ, విలువైన ఇతరవస్తు సామగ్రిని మాంట్ క్రిస్టో ద్వీపంలోని కొండగుహల్లో దాచి ఉంచాను. ఇద్దరం కలిసే వెళ్లినందువల్ల అవెక్కడున్నదీ గైడోకి తెలుసును. మొత్తం ఆ నిధి విలువ ఇరవైలక్షల రోమన్ క్రౌన్లు ఉంటుంది. ఆ ద్వీపం తీరాన సముద్రజలం లోనికి చొచ్చుకువచ్చినచోట, చివర దిగి, తూర్పుదిక్కుగా నడిచి వెళ్ళి, ఇరవైయ్యోరాతినెత్తి గుహ ప్రవేశించాలి. ఈగుహలో రెండుచోట్ల ద్వారా లున్నాయి. రెండో. ద్వారం దాటి వెళ్ళినతరవాత చివరిమూలను నిధి దాచబడింది నాకు ఏకైక వారసుడైన గైడో స్పాడాకు ఈ నిధి నంతనీ సంక్రమింప చేస్తున్నాను."

"సీజర్ స్పాడా."

"25 ఏప్రిల్ 1498."

"ఇప్పుడేమంటావ్?" అన్నాడు ఫెరయా.

డాంటే అన్నాడు: "ఇదేనా కార్డినల్ స్పాడా మరణశాసనం? ఇంతకాలం వెతుకుతున్న కాగితం ఇదేనా?"

"అవును. అవును. వెయ్యిసార్లు అవునని చెప్తున్నాను" అన్నాడు ఫెరయా ఉద్రేకంతో.

"ఈ వాక్యాల నెవరు పూరించారు?"

"నేనే. నిప్పులో కాలిపోగా మిగిలిన కాగితంలో పంక్తుల్ని బట్టి, పూర్తి కాగితంలో పంక్తుల పొడవెంత ఉంటుందో లెక్కగట్టాను. భూగర్భాంతరమార్గంలో నడిచేవాడు చీకటిలోని కొద్ది వెల్లని ఛాయల్ని బట్టే మార్గం వెతికినట్లు, తెగిన వాక్యాలఅర్థాల్ని గురించి యోచించి ఊహించాను."

"కాగితంలోని విషయాన్ని పూర్తిగా గ్రహించిన తరవాత మీ రేం చేశారు?"

"వెంటనే బయలుదేరా లనుకున్నాను. నిజానికి అప్పుడే బయలుదేరానుకూడా. కాని చక్రవర్తి పోలీసులు నాపైన నిఘా పెట్టారు. అప్పటి కింకా నెపోలియన్‌కి కొడుకు పుట్టలేదు. అప్పుడింకా రాష్ట్రాలు విభజించాలనే ప్రయత్నంలో ఉన్నాడు నెపోలియన్. ఉన్నట్టుండి నేను బయలుదేరేసరికి, పోలీసులికి అనుమానం కలిగింది. నేను పియాంబినోలో ఓడెక్కబోతుండగా నన్ను అరెస్టుచేశారు. ఇంక ఆ తరవాత జరిగిందంతా నీకు తెలుసును." ఫెరయా పితృసహజమైన వాత్సల్యంతో డాంటేవంక చూసి, "మనం ఇద్దరం కలిసి ఎప్పటికైనా తప్పించుకుని పారిపోగలిగితే, ఆ ధనంలో సగం నీకు చెందుతుంది. నేనిక్కడే మరణించటం సంభవిస్తే, నువ్వొక్కడవే పారిపోవచ్చును. అప్పుడా ధనం యావత్తూ నీ పరమౌతుంది." అన్నాడు.

డాంటే ఆశంకతో అన్నాడు: "కాని ఈ భాగ్యానికి సక్రమమైన వారసు లెవరూ లేరా?"

"లేరు. నువ్వు ఆ విషయమై శంకించ నవసరం లేదు. ఆ వంశం అంతరించింది; వారిలో ఆఖరివాడైన కౌంట్ స్పాడా తన సర్వస్వానికే నన్ను వారసుని చేశాడు. ఆ మతగ్రంథాన్ని నాకిచ్చి, ఆ ధనమంతా నాకు సంక్రమింపచేశాడు. నువ్వా విషయమై చింతపడ నవసరం లేదు. ఈ భాగ్యం ఎప్పుడైనా మనవశమైనట్లయితే, నిశ్చింతగా, నిర్మలాంతఃకరణతో మనం దాని ననుభవించవచ్చును."

"ఈ భాగ్యం మొత్తం ఎంత ఉందన్నారు?"

"ఇరవైలక్షల రోమన్ క్రౌన్లు. అంటే ఇప్పటి మన ద్రవ్యంలో కోటి ముప్ఫైలక్షలు."

"అసంభవం" అన్నాడు డాంటే. బిగ్గరగా అంత మొత్తాన్ని గురించి తలుచుకునేసరికి అతనికి తల తిరిగినట్లయింది.

ఫెరయా మెల్లిగా చెప్పాడు: "ఇంత కాలమూ ఈ రహస్యాన్ని నీకు చెప్పకుండా ఎందుకు దాచానంటే, మొదట నీకు నిరూపించాలి. తరవాత నిన్ను ఒక్కసారిగా ఆశ్చర్యచకితుణ్ని చెయ్యా లనుకున్నాను. నాకీ మూర్ఛ రాకముందు మనం తప్పించుకుని ఉన్నట్లయితే, నిన్ను తిన్నగా మాంట్ క్రిస్టో ద్వీపానికి తీసుకువెళ్ళేవాడిని. కాని ఇప్పుడు నువ్వే నన్నక్కడికి తీసుకువెళ్లాలి. డాంటే. ఆగు. నువ్వు కృతజ్ఞతచూపవలసిన పని లేదు."

"కాదు" అన్నాడు డాంటే. "ఈభాగ్యమంతా మీకే చెందుతుంది. ఇంకెవ్వరికీ చెందదు. నాకెలాటి హక్కూ లేదు. నేను మీకు రక బంధువునైనా కాను."

"నువ్వు నాకు కుమారుడవైనావు డాంటే. నా నిర్బంధంలో నువ్వు వరప్రసాదివైనావు. నా వృత్తివల్ల నేను ఆజన్మ బ్రహ్మచారిగా ఉండవలసిన వాడినే. జన్మలో తండ్రికాలేని వానికి, ఎన్నడూ స్వేచ్ఛపొందలేని ఖైదీని ఊరడించడానికే భగవంతుడు నిన్ను పంపాడు." ఫెరయా స్వాధీనంలో ఉన్న చేతి నందించాడు. డాంటే చెయ్యి అందుకుని వృద్ధుని పరిష్వంగం చేసుకున్నాడు. ★

పాకిస్తానులో

(2-వ పేజీ తరువాయి)

లాహోరులోలాగే, కరాచీలో కూడా, మేధావులుమాత్రమే ఇంగ్లీషు మాట్లాడతారు. మిగిలిన తరగతులకు చెందిన కార్మికులూ, కర్షకులూ, తదితరులూ పాకిస్తాను రాజభాష అయిన ఉర్దూ మాట్లాడతారు. ఈ సంగతి మాకు తెలుసు. అందుచేత మా ప్రసంగాలను ముందుగా ఇంగ్లీషు, ఉర్దూ భాషలలోకి తర్జుమా చేయించి అచ్చు వేయించాము. ఈ పని చేయడానికి మరొక కారణ మేమంటే, పత్రికలు మా ప్రసంగాలను తారుమారుచేసే అవకాశం లేకపోలేదు.

ఆ సమావేశానికి మే మనుకున్నదాని కన్న చాలా ఎక్కువమంది వచ్చారు. అంతకుపూర్వం ఒక అమెరికన్ ఉపన్యాసకుడు అమెరికానుగురించి మాట్లాడుతూ రష్యాను చెండతిట్టాడు. ఆయన ప్రసంగం వినడానికి 50 మంది వచ్చినట్టు పత్రికలలో చిన్నవార్త చూశాము. అమెరికనులు పని పెట్టుకుని పాకిస్తాను ఆంతరంగిక వ్యవహారాలలో ఏవిధంగా జోక్యం కలిగించుకుంటున్నదీ మేము చాలా పర్యాయాలు చూశాము. లాహోరులో అభ్యుదయ రచయితల సమావేశంలో అల్లరి చేయించటానికి అమెరికన్ కౌన్సల్ ప్రయత్నించాడు. పాకిస్తాను సైనిక విద్యార్థుల పరీక్ష లప్పుడు అమెరికన్ అధికార్లు హాజరైనట్టు పత్రికలు ప్రకటించాయి. అమెరికన్ ఉక్కుగుత్త సంస్థవారు పాకిస్తానకు వచ్చారు. తుక్కు అమెరికన్ చిత్రాలూ, అమెరికన్ జీవితవిధానాన్ని ఆకాశాన్కెత్తే అమెరికన్ పత్రికలూ పాకిస్తాన్పై దాడిచేస్తున్నాయి. బ్రిటిషువారి వలసరాజ్యమైన పాకిస్తానుయొక్క ఆర్థిక, రాజకీయ జీవితంనుండి బ్రిటిషువారిని నెట్టివేయడానికి అమెరికనులు చేసే ఇట్టిప్రయత్నాలు చాలా ఉన్నాయి.

అయితే పాకిస్తానులోని అభ్యుదయ కాములూ, కార్మికులూ, కర్షకులూ, రచయితలూ, ఉద్యోగులూ అసంతృప్తి చెంది ఉండటంకూడా చూశాము. వారు శాంతికోసం పోరాడగోరుతున్నారు, జాతీయ విముక్తీ, దేశీయవిముక్తీ వాంఛిస్తున్నారు.

ఈ కారణంచేత మేము ఈ సమావేశానికి ఎంతో ఆసక్తితో బయలుదేరాము. ఇది కరాచీలోని కాలేజీలలో ఒకదానికి చెందిన పెద్దహాలులో ఏర్పాటు చేయబడింది. హాలులో 1500 మంది కూర్చోవడానికి వీలున్నది. కాని అక్కడ 3500 మంది చేరారు. హాలుకుగల పదివాకిళ్లూ తెరిచేశారు. వాటినిండా గుంపులు నిలబడ్డారు. వారంతా మాకోరకు చూస్తున్నారు. మేము కార్లు దిగి వేదికమీదికి రాగానే చాలాసేపు కరతాళధ్వనులు సాగాలు.

"సోవియట్ యూనియన్ వర్ధిల్లాలి", "పాకిస్తాన్ సోవియట్ ప్రజల స్నేహం వర్ధిల్లాలి," అన్న నినాదాలు వినబడ్డాయి. మాకు స్వాగతం ఇవ్వడానికి వేదికమీద పాకిస్తానీయులు కొందరు నిలబడ్డారు.

వేదికమీద గల బల్లపై కొడవలి, సుత్తి ఆకారంలో పూలు అమర్చారు. ప్రేక్షకులలోమంచి దుస్తులు వేసుకున్నవారితోబాటు కార్మికులుకూడా ఉన్నారు. కార్మికులు సోవియట్ప్రతినిధులకు మరింత ఉత్సాహంతో స్వాగతం తెలపడం గమనించాము. మాకు తామ్రవర్ణం గల పూల "బూకే"లు బహూకరించారు.

పాకిస్తాన్ సోవియట్ సంస్కృతీ మండలి, అభ్యుదయరచయితలూ, ప్రజానాట్యమండలి, యువకమండలివారు సోవియట్ ప్రతినిధి వర్గానికి సమర్పించిన పత్రం చదవబడింది:

"వియత్నాం స్వాతంత్ర్యాన్ని ఎవరు నేలరాస్తున్నది ప్రపంచప్రజ ఎరుగుదురు. వాషింగ్టన్ లోనూ, లేక్ సక్సెస్ లోనూ ఇండియా, పాకిస్తానుల ప్రజల స్వాతంత్ర్య వాంఛలు ఏవిధంగా నిర్మూలించబడుతున్నాయో... ప్రజానాయకులూ, రచయితలూ, విజ్ఞానికులూ ఎట్లా ఖైదులపాలవుతున్నారో తెలుసు.

"కాని నేడు అన్నిప్రదేశాల ప్రజలూ నిరంకుశత్వాన్నీ దోపిడినీ ప్రతిఘటించడానికి సంసిద్ధులవుతున్నారు. ఈ సమరంలో చైనా అఖండవిజయం ఒక ఘట్టం. ఇది ప్రజలకు నూతనోత్సాహశక్తుల నిస్తుంది.

"...నేడు ప్రపంచ ప్రజలు సన్నిహితులవుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించుకొనడానికి ఒకరినొకరు అర్థంచేసుకో గోరుతున్నారు. ఈ కోరికే నేడుమమ్మల్ని ఇక్కడికి తెచ్చింది. మీ విప్లవయుత సాహిత్యం మా సాహిత్యానికి నూతన శక్తినిచ్చి, దానిలో ఉండిన నైరాశ్యాన్ని పారదోలింది. అది శ్రామికులను ఏకంచేస్తున్నది. వారి ఐక్యతనూ, విజయాన్నీ ప్రతిధ్వనింపచేస్తున్నది...

"ఇది ప్రమాదకరమైన కాలం. మానవ రక్తం కారు చౌక. ఆదర్శాలు అవమానం పొందుతున్నాయి. కాని ఈ వర్గపోరాటం సమసినఅనంతరం మీరు వేసిన పునాదులపై గొప్ప మేడకడతాము.

"పెట్టుబడి దారీదేశాల ప్రభుత్వాలవారు ప్రపంచాన్ని యుద్ధజ్వాలల వేపు లాగుతున్నారు. వారు లాభాలకోరకు తమ వలసలనూ, తమప్రజలనూ త్యాగం చేస్తూ, ఒక్కక్షణంలో ప్రపంచాన్ని భస్మంచేసే మారణాస్త్రాలతో బెదరిస్తున్నారు. మీదేశం ఈ ప్రమాదంగురించి హెచ్చరిక చేస్తూ దీన్ని నివారించే మార్గం తొక్కుతున్నది. మీ పిలుపు విని శాంతికాముక ప్రపంచ ప్రజలు ఒకే శ్రేణిలో నిలబడుతున్నారు. వారు ప్రపంచశాంతిని రక్షించడానికిబద్ధకంకణులైఉన్నారు. మానవాభ్యుదయానికి మార్గమిదే.

"సోవియట్ యూనియన్ ప్రపంచశాంతిని రక్షించగలదని మాకు పూర్తి నమ్మకమున్నది ... ప్రపంచమంతటా సోవియట్ యూనియన్ నాయకత్వాన సాగే శాంతి ఉద్యమంలో మేము మీపక్షాన నిలబడి ఉన్నాము" ..

నికొలాయ్ తిఖొనోవ్ ప్రసంగిస్తూఇట్లా చెప్పాడు:

"పాకిస్తానుప్రజలు కష్టపడి పనిచేసేవారు, ప్రతిభావంతులు. పాకిస్తాను అభ్యుదయ రచయితలు ప్రజాసేవ చేస్తూ, తమకు మంచి పురోవృద్ధి ఉన్నదని నమ్ముతున్నారు. మీదేశంలో పక్షులు సుఖజీవనం గడుపుతున్నాయి. కాని సామాన్య స్త్రీపురుషులు అంతకంటె బాగా జీవించటం అవసరం. ఏమంటే ఎంత అందమైనపక్షికన్నా మానవుడు హెచ్చు."

ఈ మాటలకు ప్రేక్షకులు గొప్పగా హర్షించారు. "పాకిస్తాను సోవియట్ ప్రజల మైత్రి వర్ధిల్లాలి,"అని నినాదాలు చేశారు.

ఈ సమావేశంలో సోవియట్ ప్రతినిధులందరూ మాట్లాడారు. సోవియట్ రాజ్యం కార్మికులది. అక్కడ పెట్టుబడిదారులూ, భూస్వాములూ, ఇతర దోపిడీదార్లూ లేరు. ఈ రాజ్యాన్ని కార్మికులూ, కర్షకులూ, మేధావులూ పాలిస్తారు - ఈ మాటలు విని సభలోవారు చాలా హర్షించారు,

మేము పాకిస్తానులో ఉన్నన్ని రోజులూ అక్కడి అభ్యుదయ కాముకులు మా కిచ్చిన స్వాగతాన్ని మరువలేము. అంతకన్నకూడా వారు మా కిచ్చిన వీడ్కోలు మరపురానిది. సభ అయిపోగానే అనేకమంది మమ్మల్ని చుట్టుముట్టి తమ ఆదరం మరింతబాగా తెలుపయత్నించారు. వారు మమ్మల్ని బయటికి దాదాపు మోసుకుపోయినారు. అనేక వేల చేతులు మాకేసి చాచబడ్డాయి. కొందరు కరస్పర్శ చేశారు. మరికొందరు మాచేతిలోని పూలనుండి జ్ఞాపకార్థం రెక్కలు తుంచుకున్నారు.

మేముబయటికి వస్తుండగా ఈ నినాదాలు బిగ్గరగా, ఖంగుమని వినిపించాయి:

"రష్యాకు జై!"

"రష్యాకూ పాకిస్తానుకూ జై!"

"స్టాలిన్ కూ జై"!.

జనసమ్మర్దం మూలంగా బల్లు ఆగిపోయాయి కరాచీలోని మా ఆఖరుసభ ఈ విధంగా ముగిసింది. పాకిస్తాను ప్రజలకు సోవియట్ ప్రజలపట్ల ఎంత గాఢమైన మన్నదో ఈనాడు మేము మరింత బాగా తెలుసుకో గలిగాము. బ్రిటిషువారూ, అమెరికనులూ ఎంత దుష్ప్రచారం చేసినప్పటికీ, సోవియట్ యూనియన్ చిహ్నంగా గల మహత్తర సత్యాన్ని పాకిస్తాను ప్రజలు విశ్వసిస్తున్నారు.

మరునాడు పెందలాడే విమానంలో కరాచీనుంచి బయలుదేరాము. మేము విమానకేంద్రం చేరేసరికింకా చీకటి ఉన్నది. మా స్నేహితులు కలుస్తారేమో అనుకున్నాము, కాని ఆశాభంగమయింది. చారలశాలువ కప్పుకున్న పాకిస్తానీ ఒకడూ, చిన్న చేతిపెట్టెగల బ్రిటిషువాడొకడూ మాత్రమే కనిపించారు. మా స్నేహితులు సోవియట్ ప్రతినిధులను విమాన కేంద్రం నుంచి సాగనంపడానికి కూడా రాలేదని స్పష్టమయింది.

మా విమానం లాహోరుకేసి బయలుదేరింది. సూర్యోదయ మయింది. కాంతి అన్నివైపులా ప్రసరించింది. కిందుగా ఎడారి కనిపించింది. అది నిర్జీవంగా అనేక మైళ్లు పరుచుకుని ఉన్నది. కొంతసేపటికి సింధునది దాటాము. గ్రామాలూ, పొలాలూ ఆరంభమయినాయి.

త్వరలోనే లాహోరు మళ్లీ అనుపచ్చగా కళ్లబడింది. మేము లాహోరు మీదుగా ఎప్పుడు వెళ్ళేదీ తెలుపమని అభ్యుదయ రచయితలు మాకు ముందుగానే వ్రాశారు. మాకు వీడ్కోలు చెప్పడానికి విమాన కేంద్రానికి వస్తామన్నారు. ఫలాని రోజు ఇన్ని గంటలకు చేరుతామని కరాచీనుంచి తంతి ఇచ్చాము. కాని విమానకేంద్రంలో మా మిత్రుల జాడలేదు. కొద్దిమంది బ్రిటిషు వారూ, స్థానిక వర్తకులూ, నలుగురు ఇంగ్లీషు ఆయాలూ, అనేకమంది పోలీసులూ, విమానంలోనుంచి మావెంట దిగిన చారలశాలువమనిషీ తప్ప మరెవరి జాడా లేదు. మా తంతి వారికి చేరకపోయి ఉండాలి, లేదా కరాచీలోలాగే ఇక్కడ కూడా మా మిత్రులు మాకు వీడ్కోలు చెప్పడానికి వీలులేక పోయి ఉండాలి.

లాహోరులో అరగంటసేపు ఆగిమా విమానం తిరిగి సరిహద్దుకేసి, వచ్చిన దారినే, సాగింది. మాకు కుడిపక్కగా నాలుగు పర్వతశిఖరాలవెనకగా హిమాలయ హిమశృంగాలు గోచరించాయి. వాటి మీదుగా మబ్బు పింజెలు తేలుతున్నాయి.

రావల్పిండిలో కొద్దిసేపు ఆగి, సింధు నదిని మరొకసారి చూసి పెషావరు చేరాము. పాకిస్తాను స్వరూపంగురించి మాకు మొదటి అభిప్రాయాలుకలిగినది ఈ పెషావరులోనే. పెషావరునుండి కాబూలుకు మేము కార్లలో వెళ్లవలసిఉన్నది. అఫ్ఘనిస్తాను లోని సోవియట్ రాయబార కేంద్రం వారు మాకు కార్లు పంపుతారు.

మర్నాడు ఉదయం మేము పెషావరు నుంచి బయలుదేరబోతూఉండగా కొందరు స్థానిక అభ్యుదయరచయితలు మా హోటలుకు వచ్చి మాకొక తంతి అందజేశారు. దానిపై సంతకం లేదు. లాహోరు విమాన కేంద్రంలో మమ్మల్ని కలుసుకొనడం అసంభవ మయిందనిమాత్రం ఉన్నది.

కస్టమ్సు తణిఖీ చాలా త్వరలో ముగిసింది - మేము త్వరగా వెళ్లిపోతే మంచిదని పాకిస్తానుఅధికారులు భావించినట్టు కనబడ్డారు. మేము ఖైబరుకనుమ రోడ్డుపట్టాము. కనుమ పొడుగునా చలవరాతి పలకలు చాలా ఉన్నాయి. వాటిమీద అఫ్ఘనుయుద్ధంలో నాశనమైన బ్రిటిషుదళాల పేర్లున్నాయి.

రోడ్డు పక్కల ఉన్న కొండలమీద అనేకమంది స్త్రీలు నెత్తిన కంప మోస్తూ నడవటం కనిపించింది. మేము కిందటిసారి ఇటుగా వెళ్లినప్పటికన్న చలి ఇక్కడ జాస్తిఅయింది. కొండలకు బూడిద వర్ణం వచ్చింది. పండిరాలిన ఆకులు గాలిలో ఓలలాడుతున్నాయి.

సరిహద్దు దాటి అఫ్ఘనిస్తాను ప్రవేశించాము. ★

ప్రేమించాను

(7-వ పేజీ తరువాయి)

కనిపించినప్పుడు, సంధిలోని కుళ్లును చూపి కొంత ఆర్ద్రతచేయడంలో నష్ట మేమున్నదనిపించడం పరిపాటి. ఆ దృష్టితోనే వివిధ సమస్యలపై ఆధునికుల దృక్పథ మేమిటో చెబుతూ వచ్చాను. మన మనస్సు, మన దృష్టి, మన ప్రవర్తన ఎలా మన సంప్రదాయ సిద్ధనైతిక ధోరణులవల్ల ఏర్పడినవో ఎప్పటికప్పుడు వివరిస్తూ వచ్చాను.

నీతి, నియమం, మంచీ చెడ్డ వగైరా మాట లన్నిటిని, మన మేమాత్రం ఏ చికిత్స లేకుండా ఎలా చిలుకలలా వల్లెవేస్తామో - ఆ మాట లన్నీ కాలపరిస్థితుల ప్రాబల్యం వల్ల ఎలా మారుతాయో గ్రహించినవారు చాల తక్కువ.

ఒక సునిర్దిష్టమైన తాత్త్వికదృక్పథం లేకుండా, జీవితంలో ఒక నిశ్చిత ప్రయోజనం లేకుండా, చావలేక బతకడం, బతకలేక చావడం చాలమంది చేస్తున్న పని.

'మనదీ ఒక బతుకేనా
సందులలో పందులవలె'

అంటూ చెబుతున్నప్పుడామె ఏదో ఒక నూతన సత్యం కనబడుతున్నట్టు విప్పారిన కళ్లతో విస్తుపోయి చూచేది.

ఆమె పూర్తిగా ఇలాంటి నూతన దృక్పథానికి అపరిచితురాలు. కాని ఈ దురుసూ దూకుడూ గల భావాల నెంతో సౌమనస్యంతో వినగలుగుతున్నది. వాటిని అర్థం చేసుకు నేందుకై ప్రయత్నిస్తున్నది. 'సుఖ జీవనుల, పరాన్న భుక్కుల బ్రతుకుపై ఒక విధమైన అసహ్యం కొలుకున్నా - ఏదో అసంతృప్తి ఆమెలో బయలుదేరుతున్నట్టు గుర్తించాను.

ఆ అసంతృప్తి నిరాశకు దారితీయునది కాక, మరింత తీవ్రభావంగా మారి కార్యప్రేరక మయ్యేట్టు చేయాలని కలలుగన్నాను.

ఆమెతో ఈ చర్చలు జరుపుతున్నప్పుడు నాలో ఏ విధమైన హృదయ స్పందనం కొని కలుగలేదు. ఆమె నొక యువతినిగా కాక, మానవ మాత్రురాలినిగా మాత్రమే చూస్తూ వచ్చాను. చెబుతున్న మాటలలోని అంతరాంతరాలలోనికి చూస్తున్నట్టుగా ఆమె ఎంతో అత్యాసక్తితో చెవుల నప్పగించి వింటుండేది. నే నేదో ప్రవాహధోరణిలో, ఆవేశంతో చెప్పుకునిపోతూఉండేవాడిని. తుప్పుపట్టిన సంఘ వ్యవస్థ నా యెదుట నాట్యం చేస్తుండేదే కాని, ఆమె ముఖభంగిమ నా కళ్లకు కన్పించేదే కాదు.

ఇందులో ఏ విధమైన మమతకు కాని, చనువుకు గాని అవకాశమూ లేదు, ఆస్కారమూ లేదు.

ఏమైనా ఆమె నిల్చిన నీటిమడుగు జీవితంలో రాళ్లు వేసి కదిపాను. అందులో చిలువలు పలువలుగా రేగుతున్న అలలను చూచాను. ఆ నీ రేదో శుభ్రమైన గాలికోసం, సంచలనం కోసం, కొత్త వాతావరణం కోసం ఎక్కడికో పారిపోవా లన్నట్టు అత్యాశల సంభరితమైనది.

4

ఈ చర్చల సందర్భంలోనే నే నసేక ప్రపంచప్రముఖ రచయితల రచనలలో

నుంచి కొన్ని ఉదాహరణ లివ్వసాగాను. సామాన్యంగా ఏదో సిద్ధాంత ప్రవచనాల కన్న, జీవితంలోని లోతుల్లో ఈ సిద్ధాంతా లెలా పెనవేసుకొని విషంకక్కుతున్నవో చూపే సాహిత్యరచనలు కొత్తవారిలో ఆలోచనను రేపుతాయి.

ఆ సందర్భంలోనే ఆమె దాదాపు ఆంగ్ల సారస్వతంలోని ప్రముఖ రచనలను చాలావరకు చదివినదని తెలుసుకొన్నాను. కాని వానిని నవలలుగానో కథలుగానో తప్పితే, అవి జీవన ప్రతిబింబాలుగాగాని, జీవన మార్గదర్శనాలుగాగాని ఆమె యెన్నడూ చూడలేదు. అందులోనూ మానసిక పరిణామాదులను వివరించే రచనలు గాక, సంఘటన లెక్కువగా గల పుస్తకాలామె యెక్కుడుగా చదివినది.

ఆపుస్తకం బాగుంది — లేదా నచ్చింది. నచ్చలేదు - అనితప్ప ఆమె మరింకే విమర్శననూ ఇవ్వలేకపోయేది. కాని ఈమె చదువంతా వ్యర్థంకావీలు లేదుకదా. వివిధ మనస్తత్వాలను కాస్త ఔదార్యంతో గమనించగలశక్తి, లోకం ఇంటిలో నున్నంత హాయిగా లేదన్న పరిజ్ఞానం, సుఖమంటే ఏమిటో పేరుకూడవినని కోట్లకొలది ప్రజలు ప్రపంచంలో ఉన్నారన్నంతవరకు విజ్ఞానం ఆమె కున్నది.

వానితోబాటు, కొందరు ప్రముఖ రచయితల పుస్తకాల నీ చర్చల పునాదిపై చదివింపజేశాను. చదివినతర్వాత వానిపై ఆమెను క్రుచ్చిక్రుచ్చి ప్రశ్నలు వేసి చాల ఆయువుపట్టులపై ఆలోచించేటట్టుగాకూడ చేశాను.

తుర్గినేవ్ వ్రాసిన 'బీటభూమి' (వర్జిన్ సాయిల్) నొకసారి చదవమని ఇచ్చాను. జార్ రహస్యాలోని సంఘంలోని కళ్ళను తొలగిరేచేందుకై పూనుకున్న ఉన్నత వర్గానికి చెందిన ఒక యువకుని, యువతిని — వారిశౌర్య, కష్టపరంపరలను చదివింది.

ఆమె కళ్లలో ఏదో కొత్తవెలుగు కనిపించింది. ఇదెంతో జీవితానికి దగ్గరగా నున్నదని, ఇందులోని పాత్ర లెక్కడివారో కాక, అంచుపొంచులలో తిరుగుతున్నవారా అనిపిస్తుందని ఏదో లోకానికి చేయజాలని బతుకుబరువు దంకుగనీ లకుమాట అన్నది. ఎన్నడూ రెండుమాటలకెక్కువ ఏపుస్తకంమీదకూడ చెప్పని యీమెతో ఇలా అనిపించిన దానవల. కాని ఈ ఉత్సాహమామెలో ఎలా క్రియారూపం తాలుస్తుందా అని చాల ఆలోచించాను. కాని నాకేమీ అంతుపట్టలేదు.

- త్తైన మనస్సుకు చెందిన ఏ వోవికారాలైతే సమస్యను తెలుసుకుంటే చాలునంటారు. ఆ సమస్యాపరిజ్ఞానమే పరిష్కారక మవుతుందంటారు. కాని ప్రపంచ సమస్య లలాంటివి కావు. అవి తెలుసుకున్నంతమాత్రంతో విడిపోవు. వాటిని గురించి వ్రాసినా, చదివినా, ఉపన్యసించినా పరిష్కారం కావు. వాటిని విడదీసేందుకు పోరాడాలి. ఎంతో తెగించి ముందుకు నడవాలి. ఎంతో త్యాగంచెయ్యాలి. ఎన్ని సుఖాలో వదుల్చుకోవాలి.

ఇన్ని చర్చలలో కూడ మామధ్య, ఒక్క వ్యక్తిగత విషయానికి కూడ స్థానం చిక్కలేదు. ఆ సంగతుల సలు జ్ఞాపకానికి వచ్చేవే కావు. నిజానికి ఆమె సగంపేరూ, కుటుంబంపేరూ తప్పితే ఇంతొదాకా నాకింకే వివరమూ తెలియదంటే నవ్వకండి.

నాదో విచిత్ర ప్రకృతి. ఎక్కడికక్కడే నాజిజ్ఞాస- ఎక్కడికక్కడే నా సద్భావమూ, స్నేహమూ, ద్వేషమూ, అసహ్యమూ కూడ. ఒకమనిషి నెందుకుగా మనం తెలుసుకున్నామో అంతే. వారి పుట్టుపూర్వోత్తరాలు మనకెందుకనిపిస్తుంది. అలాగే ఒకమనిషి ఒకపని చేసినప్పుడు సద్భావమో, దుర్భావమో కలుగవచ్చు. అంతే-అంతమాత్రంతో ఆ ప్రాణినే పరమపాతకునిగా నేను పరిగణించను. అందుకు ఋజువులకోసం ప్రాకులాడను. స్నేహమున్నంతమాత్రంతో, వారు చేసేవన్నీ మంచిపనులనీ తలంపను.

నేటి విషమసమాజంలోని, అర్థంలేని పరిస్థితులలో ఏమనిషికూడ అచ్చుగుద్దినట్టు ఒకానొక రూపంతో మనకు కనిపించడు. మానవ ప్రకృతి అతి విచిత్రమైనది. లక్షరూపాలతో, లక్ష సంఘటనలలో, లక్షపరిస్థితులలో ద్యోతకమవుతూంటుంది. అనవసరంగా ప్రతి మనిషినీ సమగ్రంగా తెలుసుకొనేందుకై ప్రాకులాడి, ఏదో కొంత అర్థార్థ పరిచయంతో కొన్ని నిర్ణయాలకు రావడం, అవి ఆఖరున కేవలం కొన్ని ప్రెజుడిసెస్ గామాత్రమే మిగలడంవల్ల చాల బాధ లున్నవి. అవి ఇతరులకు కాక మనకే నష్టం కలిగిస్తాయి.

నే నొకరిని వెధవ అనుకున్నా, వంచకుడనుకున్నా అతని కందువల్ల వచ్చేనష్టం చాల తక్కువ. కాని నేనా వెధవతనం గట్టిగా తెలుసుకునేందుకు, అత నేదైనా మంచి పనిచేశాడంటే, అందులో ఏదో అంతర్యమున్నదని దాన్ని తెలుసుకునేందుకు తల పగులగొట్టుకోవడంలో నేను పడవలసిన బాధ నరకమంత భయంకరమైనది. కాబట్టే నే నెన్నడూ ఆ జోలికిపోను.

నా పరిచితులలో కేవలం రాజకీయ సేవకులుగా, సాహిత్యపిపాసువులుగా, రచయితలుగా, కళాకారులుగా మెత్తనివారుగా ఇలా ఏదో ఒక రూపంలో మాత్రమే తెలిసినవా రున్నారు. వారి నాయా రూపాలలో మాత్రమే చూస్తాను. అంతకులోతు కెన్నడూ పోను.

ఇక నైతికంగా ఏ స్నేహితునిగాని, పరిచితునిగాని నేను విలువగట్టి అధికప్రసంగానికి వెళ్లనే వెళ్లను. అందుకు నాకు హక్కుగాని, అధికారంగాని, సమర్థతగాని లేదని నేను బాగా యెఱుగుదును.

వీటన్నిటిమూలంగా ఆమె నొక జిజ్ఞాసగల మనిషిగా మాత్రమే నే నింతవరకూ చూస్తూవచ్చాను.

ఒక్కతూరి మట్టుకు ఇలాంటి చర్చల సందర్భంలోనే ఏదో వచ్చింది. మనదేశ స్వతంత్రసంగ్రామ చరిత్రలో జరిగిన సంఘటనను గూర్చి తనకు తెలియ దన్నది. ఏ స్వెట్జర్లాండులోనో, ఏసంవత్సరమో, ఏరాజకీయసంఘటనో జరిగిందని చెప్ప గలవుగాని, ఈమాత్రం చరిత్రనే తెలుసుకో లేక పోతే యెలా అని ఏదో చెప్పివాడిచాను. ఆ సంఘటన దేశమంతా కదిపిందిగదా-మా కాలేజిలోనిపిల్లలు కొందరైనా జండాలు పట్టుకొని బజార్లలో పడి ఉంటారుకదా - నీవామాత్రమైనా చేయలేదా అన్నాను.

అప్పుడే విచారంతో అన్నది. "నేను దేశానికిగాని, ప్రజలకుగాని, ఉద్యమాలకుగాని చేసిన దేమిటి? జనాభాసంఖ్యకు కొంత చేర్చడం తప్ప నేచేసిన పని మరొకటి లేదు." ఈమాటల వెనుక ఎంత పశ్చాత్తాపం రగులుకొంటున్నదో, ఆ మె శాంత సుఖ మయ జీవితంలో ఎలా ఒక నిప్పురవ్వ పడినదో స్పష్టంగా నేను చూడ గలిగాను.

నన్ను గురించి ఆమెకు తెలిసిన దంతకంటె చాల తక్కువనుకుంటాను. ఏదో కొంపలంటుకొని పోతున్నాయని గుండెలు కుళ్ళి పోయేట్టు బాధ పడుతున్న అమాయకుడనో, కావలిస్తే అందుకై ఏదో చేస్తున్న విచిత్రవ్యక్తిననో తప్ప ఆమె కొక్క అక్షరం నాచరిత్ర తెలియదు. అప్పటప్పటి చర్చలలో సంభాషణలలోని ప్రస్తావనల మూలంగా దేశస్వతంత్ర పోరాటంలో నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ధారవోశాను. అని తెలిసివుంటే వుండవచ్చును. అంతకంటె ఎక్కువగా తెలుసుకునేందుకు కూడ ఆమె ప్రయత్నించినట్టు కనిపించదు.

ఇలాంటి సాక్షిక పరిజ్ఞానంతో నేమాలో ఏదో ఒక సన్నిహితత్వం ఏర్పడింది. ఆమె మనం స్నేహితుల మనేదిగాని, నే ననుకోలేదు. ఇదొకసన్నిహిత పరిచయంగా మాత్రమే తలంచేవాడిని. మాటలాడిన వారల్లా స్నేహితులనుకోవడం అమాట విలువను పోగొట్టడమేనని నాదృష్టి. ★

బాల్కన్‌దేశాలలో అశాంతి

(4-వ పేజీ తరువాయి)

చూస్తే బాల్కన్ దేశాలలో అశాంతి రెచ్చగొట్టి, కొరియాలోవలె యుద్ధం ప్రారంభించడానికి అమెరికా యత్నిస్తున్నదనే అనుమానం కలుగుతుంది.

యుగోస్లావియా, గ్రీస్‌ల పొరుగునున్న ఆల్బేనియాలో రష్యన్ ప్రభుత్వానికి అనువైన, కమ్యూనిస్టుప్రభుత్వం ఉందికాని, మిగతా కమ్యూనిస్టుదేశాల మాదిరిగా కాకుండా, రష్యాతో రవాణాసంబంధం లేకుండా ఉంది. రష్యాకి అనువైన కమ్యూనిస్టు దేశాలలో మధ్యధరాసముద్రతీర సౌకర్యంకల దేశం ఆల్బేనియా ఒక్కటే. ఆల్బేనియాలోని ఒక రేవులో రష్యా స్నార్కెల్ సబ్‌మెరైన్‌లు నిర్మించి పెద్ద స్థావరం ఏర్పరుచుకుంది. రష్యాకున్న నౌకా విధ్వంసక బలంలో చాలవరకిక్కడే ఉందని అమెరికా అభిప్రాయం. అందువల్ల బాల్కన్ దేశాలలో యుద్ధం వచ్చిందంటే మొట్టమొదట దండయాత్రకి గురయ్యేది ఆల్బేనియా. ఇటువంటి అవకాశంకోసమే అమెరికా నిరీక్షిస్తోంది.

ఇదివరలో రష్యాపై దండెత్తిన యూరోపియన్ రాజులు బాల్కన్ దేశాలలోనూ, పోలండ్‌లోనూ స్థానబలం చిక్కించుకో లేనందువల్లనే పరాజయం పొందాయని ఒక వాదం ఉంది. హిట్లర్ కూడా పరాజయం పొందడానికి ఇదే హేతువని కొందరి వాదం. బ్రిటన్ అమెరికాలు కూడా ఈ వాదాన్ని విశ్వసిస్తున్నట్లు, యుద్ధానంతరం ఈ దేశాల రాజనీతిని చూస్తే తెలుస్తుంది. అందువల్లనే రష్యా ముందే జాగ్రత్తపడి తన కనువైన ప్రభుత్వాల్ని ఏర్పరుచుకుంది. ఇప్పుడా ప్రభుత్వాల్ని కూలదొయ్యడానికి అమెరికా యత్నిస్తోంది. ఇందుకు అమెరికాకు యుగోస్లావియా, గ్రీస్ తోడ్పడుతున్నాయి. జెకోస్లావాకియాలో కమ్యూనిస్టులకు వ్యతిరిక్తంగా స్లావ్ జాతీయవాదుల్ని ఆంగ్లో అమెరికన్ వర్గం ప్రోత్సహించినదానికి ఫలితమే ఇటీవల బయటపడిన కుట్రలు, అరెస్టులూ నని తెలుస్తోంది. అరెస్టయిన మూడువందలమందిలో అత్యధిక సంఖ్య స్లావ్ జాతికి చెందినవారు.

అయితే ఈ గొరిల్లాచర్యలవల్లగాని, క్రైస్తవ మతాధికారుల గూఢచర్యలవల్లగాని దేశాంతర్గతులైన రాజకీయ నాయకులవల్లగాని అమెరికా ఎంత అశాంతిని రెచ్చగొట్టినా అంతర్యుద్ధాలు సంభవించే లక్షణాలు కనిపించవు. ప్రచారంవల్ల, కుట్రలవల్ల అంతర్యుద్ధాలు సంభవించలేవు. కమ్యూనిస్టుదేశాలూ యుగోస్లావియాల మధ్య యుద్ధం పురికొల్పే యత్నాలు ఇంతవరకూ ఫలించలేదు. యుగోస్లావియాపై కమ్యూనిస్టుదేశాలింతవరకూ దాడిచెయ్యక పోవడం అమెరికన్లకి ఆశాభంగం కలిగించిందని వారిప్రకటనలే నిరూపిస్తున్నాయి. ఆశాభంగంవల్లనే కాబోలు రోజురోజుకీ "యుగోస్లావియాపైన దండయాత్ర చేస్తే జాగ్రత్త" అని రష్యాని హెచ్చరిస్తున్నారు. కమ్యూనిస్టు దేశాలు యుగోస్లావియాపైనగాని, యుగోస్లావియా ఆల్బేనియా లేక బల్గేరియావంటి దేశాలపైనగాని దాడిచెయ్యడం జరిగితే, అమెరికన్ ప్రచారంఫలితంగా దురాక్రమణపరు లెవరైనదీ కనిపెట్టడం కష్టం.

ఫ్రెంచి ప్రభుత్వం:

జర్మన్ ఆక్రమణనుంచి విముక్తి పొందిన తరవాత ఫ్రాన్సు దేశం ఇప్పటికి 13 మంత్రివర్గాలు చూసింది. రినీప్లెవన్ ప్రధానమంత్రిత్వంకింద మంత్రివర్గం (అంటే పదమూడో మంత్రివర్గం) ఫిబ్రవరి మాసాంతంలో రాజీనామా నిచ్చింది. పదిరోజులు ఇద్దరు ప్రయత్నించి విఫలులైన తరవాత మూడోవ్యక్తి హెన్రీ క్వీల్ మంత్రివర్గాన్ని నిర్మించగలిగాడు.

హెన్రీక్వీల్ రాడికల్ సోషలిస్టు పార్టీ నాయకుడు. నలభైయేళ్లనించి ఫ్రెంచి నేషనల్ ఎసెంబ్లీ (శాసనసభ) సభ్యుడుగా ఉన్నాడు. ఇప్పటికి రెండుసార్లు ప్రధాని అయినాడు. 26సార్లు మంత్రిగా నియమితుడైనాడు. ఇంతవరకూ పరిపాలించిన ఫ్రెంచి మంత్రివర్గాలలో ఏడాదిపైగా ఉన్నదితని మంత్రివర్గం ఒక్కటే. (అది జూలై 1950కి ముందు) మిగతా మంత్రివర్గా లేవీ తొమ్మిది మాసాలకు మించిలేవు. ఈ విధంగా ఫ్రాన్సులో మంత్రివర్గాలు ఎప్పటికప్పుడు రాజీనామా లివ్వడానికీ, ప్లెవన్ మంత్రివర్గం రాజీనామా ముఖ్యమైన కారణం ఏమిటంటే, ఫ్రెంచి నేషనల్ ఎసెంబ్లీలో ఏ ఒక్కపార్టీకీ తగినబలం లేకపోవడమే. ఫ్రెంచి నేషనల్ ఎసెంబ్లీలోకెల్ల ఎక్కువ బలంకల పార్టీ కమ్యూనిస్టుపార్టీ. ప్రభుత్వం కమ్యూనిస్టుల చేతుల్లో పడకుండా ఇంతవరకూ సోషలిస్టుపార్టీ, మధ్యరకంపార్టీలూ ఏకమై కాపాడుతూవచ్చాయి. ఇంక ఈ ఎసెంబ్లీకాలం దాదాపు ముగియవచ్చింది. ఎన్నికలు 1951 అక్టోబరు, నవంబరు ప్రాంతాల జరగనున్నాయి. ఈలోగా ఎన్నికలవిధానాన్ని మార్చలేక పోయినట్లయితే, వచ్చే ఎన్నికల్లో మధ్యరకంపార్టీల బలం సన్నగిలక మానదు. అందువల్ల ఈ మధ్యరకం పార్టీలన్నీ కలిసి ఎన్నికల విధానాన్ని సంస్కరించడానికి సమకట్టాయి. ఈ సంస్కరణ ప్రతిపాదనలపైన ప్రభుత్వంలోని పార్టీల మధ్య సమాధానం కుదరనందువల్ల ప్లెవన్ మంత్రివర్గం రాజీనామా నివ్వవలసివచ్చింది.

సంస్కరణల ఆవశ్యకతని గురించి ప్రభుత్వంలోని పార్టీలూ నాయకులూ చెప్పిన హేతువుల్ని చూస్తే ఈ ప్రజాస్వామిక యుగంలో ఎంతెటి వింత పరిణామాలు వచ్చాయో బోధపడుతుంది.

భారతదేశం బ్రిటిష్ పరిపాలనలో ఉన్నప్పుడు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారానూ, మతవిద్వేషాల్ని రెచ్చగొట్టడం వల్లనూ కాంగ్రెస్‌ని బలహీనపర్చడానికి ఆనాటి పాలకులు యత్నించినప్పుడు, అది అక్రమమనీ, నిరంకుశమనీ, కాంగ్రెస్ వారు ఆరోపించడం మన మెరుగుదుం. ఇటీవల ఫ్రెంచిపాలిత భారత ప్రాంతాలలో జనవాక్యనిర్ధారణకోసం ఫ్రెంచిపాలకులు ఎటువంటి దుస్తంత్రాలు పన్ని 'ఎన్నికల విధానాన్ని ఎంతిగా చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నదీ మనకి తెలుసును. ఇప్పుడు కేవలం కమ్యూనిస్టులికి ఎక్కువ ప్రాతినిధ్యం లభించకూడదనే ఒకే ఒక ఉద్దేశంతో ఫ్రాన్సులో మధ్యరకం పార్టీలు ఎటువంటి యత్నాలు చేస్తున్నాయో చూస్తే మనకి మన అనుభవం జ్ఞప్తికొస్తుంది. అయితే ఇది నరరూపరాక్షసులని నోరుకలవారందరూ తిడుతున్న కమ్యూనిస్టులికి అపకారం చెయ్యాలనే ఉద్దేశంతో తలపెట్టబడింది కాబట్టి, ఇటువంటి యత్నం ఎంత నీచమైనదో, ప్రజాస్వామిక సూత్రాల కెంత విరుద్ధమైనదో చాలమంది కానలేకపోవచ్చును.

కాని ఫ్రెంచి పార్టీల కిక్కడ పెద్ద చిక్కొచ్చి పడింది. ఇప్పుడున్న ఎన్నికల

పద్ధతినే అనుకరిస్తే, (నిష్పత్తినిబట్టి ప్రాతినిధ్యనిర్ణయం) కమ్యూనిస్టులూ, నియంతృత్వానికి మొగ్గే జనరల్ డీగాల్ పార్టీవారూ ఎక్కువగా ఎన్నికౌతారు. ఇప్పుడు ప్రభుత్వపక్షానికి చెందినపార్టీలలో ఒకటైన పాపులర్ రిపబ్లికన్ పార్టీకి నేషనల్ ఎసెంబ్లీలో ఈపాటి బలమైనా ఉన్నదంటే అది ఈ ఎన్నికలపద్ధతివల్లనే. దీన్నిమార్చినట్లయితే ఈపార్టీకి ఉన్న బలంకూడా పోవచ్చును. మామూలు మనిషి కో ఓటుచొప్పున అనుసరించే ఎన్నికలపద్ధతినైతే ఇప్పటిమధ్యరకం పార్టీలలో కొన్నిటికి బలం చేకూరవచ్చును. అయితే దీనివల్ల డీగాల్ పార్టీ బలపడే అవకాశం ఉంది. ఎటొచ్చినా వచ్చే ఎన్నికల్లో మధ్యరకంపార్టీలబలం నీరసించక తప్పని సూచనలు కనిపిస్తున్నాయి. కమ్యూనిస్టుపార్టీ బలపడకపోతే డీగాల్ పార్టీ బలపడి తీరవచ్చును. కాని ఏ ఒక్క పార్టీకీ మంత్రివర్గాన్ని నిర్మించే బలం చేకూరదు. (?)లే ఈమాటు ఎన్నికల తరవాత ఈమధ్యరకంపార్టీలు మంత్రివర్గాల్ని నిర్మించచ మంటూ వస్తే, డీగాల్ పార్టీనో, లేక కమ్యూనిస్టుపార్టీనో చేర్చుకోక తప్పనిసరి రావచ్చును. కమ్యూనిస్టుల్ని రానివ్వడం అసంభవం. డీగాల్ పార్టీ కలిసినట్లయితే క్రమంగా పరిపాలనంతా డీగాల్ నియంతృత్వంలో పడిపోయే ప్రమాదంమాత్రం ఉంది. జర్మనీలో 1932 లో నియంతృత్వం ఏర్పడ్డానికి ఎలాంటి అవకాశాలు కలిగాయో, ఇప్పుడు ఫ్రాన్స్‌లో అటువంటి అవకాశాలు ఏర్పడుతున్నాయి. ★

కాశ్మీర్: నెహ్రూహెచ్చరిక

(౽-వ పేజీ తరువాయి)

ఉద్యోగులికి తిండి ఎక్కువై బలిసి పని చెయ్యరని చెప్పారు. ఉద్యోగు లందరికంటె ఎక్కువ జీతాలూ, సంచార భత్యాలూ పుచ్చుకుంటున్న మంత్రులకి దెంతవరకూ వర్తిస్తుందో గోపాలరెడ్డిగారే చెప్పగలగాలి. బ్రిటిష్‌పాలకుల కాలంలో కొన్ని రకాల ఉద్యోగులికి బాగా తక్కువ జీతాలిచ్చేవారు. వారి ఆంతర్యం ఆ ఉద్యోగులు ప్రజలమీదపడి తినాలని. ఇప్పుడు గోపాలరెడ్డిగారు పోలీసుల్ని అర్ధాకలితోనే ఉంచినట్లయితేనే మంచిదనడంలో, వారి ఆంతర్యం, అలా ఉన్నప్పుడే పోలీసులూ ప్రజలూ ఎడముఖం పెడముఖంగా ఉండిపోతారనా?

ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుల్ని అణచడానికి ప్రభుత్వం పోలీసుబలాల్ని విచ్చలవిడిగా ప్రయోగించింది. ఫలితం ఏమిటంటే ప్రజలపాట్లు ఎక్కువైనాయి. మూలకారకులైనవారెవరైనా ఉంటె, వారు కాంగ్రెస్‌లో నికక్షుల ఆధారంతో తప్పించుకుంటున్నారు. మద్రాసు మంత్రివర్గం ప్రయోగించిన పోలీసు లాఠీ గురి తప్పి ప్రజలకి తగిలింది. దేశంలో వదంతుల నేకం ఉన్నాయి. కమ్యూనిస్టుల్ని పట్టుకోలేక, వారి ఉద్యమాన్ని అనచలేక, పోలీసులు చేతికి చిక్కినవారిని విచారణ లేకుండా హతమారుస్తున్నారని కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి కర్నూలు జిల్లాల్లో వదంతులున్నాయి. పోలీసుల కస్టడీలో ఉండగానే చాలమంది చనిపోతున్నారు. పోలీసు దళాలు దాడి చేసినప్పుడు దురాగతాలు జరుగుతున్నాయని అనేకమంది చెప్తున్నారు. అంతా నిజం కాకపోవచ్చును. కాని ప్రజల్ని సంరక్షించే బాధ్యతనిపైన వేసుకుని పోలీసుశాఖ ఖర్చు పెంచేసిన ప్రభుత్వం వీటివిషయమై ప్రజలకిసత్యాన్ని తెలపవలసిన అవసరం ఉంది. శాసనసభలో ఈప్రాంతాలప్రతినిధులు పోలీసు డిమాండ్‌పైన ప్రసంగించడానికి అట్టే అవకాశం లేకపోయింది. గుంటూరు ప్రతినిధి ఒకరు అసమ్మతి సూచకంగా శాసనసభనుంచి లేచిపోయారు. ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుల దురాగతాన్ని గురించి కరపత్రాలు అచ్చువేయించి పంచిపెడితే చాలదు. వాస్తవ పరిస్థితిని, ప్రజలు నమ్మడానికి వీలుగా తెలియపరచాలి. ★

గ్రంథ సమీక్ష

ఉదవి: ఖండకావ్యాల సంపుటి; కవి: కె. వి. రమణారెడ్డి; మూల్యం: 1-0-0; దొరకు చోటు: అరుణరేఖ ప్రచురణలు, నెల్లూరు.

ఇది అభ్యుదయ కవిత్వపుకోవకు చెందినది. నేటి సంఘవ్యవస్థలోని అన్యాయం పట్ల కవికి గల తీవ్ర అసహనం ప్రతి కావ్యఖండంలోను తొణుకుతోంది. కాని కవి ఉద్విగ్నమనస్కుడై, ఆవేశానికి పూర్తిగా లొంగిపోయి వ్రాసినందున రచనాసౌందర్యం చాలచోట్ల కుంటుపడినట్లు తోస్తుంది. భాషలో కుదింపు, జిగి తక్కువ. అయితే అక్కడక్కడ,

"స్వేచ్ఛలోనుంచి ఆత్మపరుడు
పూర్ణమానవుడు పుడతాడు.
మానవుడు ద్విజుడు,"

వంటి బిగువైన పాదాలుకూడా కనిపిస్తాయి.

ఛందస్సును ఎంత తృణీకరించినా, కావ్యం మనస్సుకు గట్టిగా హత్తుకోవాలంటె క్రమమైన నడక చాలా అవసరం. కేవలం భావాలబలంమీదనే మనస్సుని ఆకట్టుకలగటం కష్టసాధ్యం. ఈ సంపుటిలో అన్నీ కేవల వచనకావ్యాలే. అందుచేతే ఏదీ మనస్సులో గాఢముద్రవెయ్యజాలదు.

ఇది అభ్యుదయ పంథాకుచెందిన కవిత్వమైనా, ప్రజాబాహుళ్యానికి అర్థమయ్యే శైలిలో లేదు (అన్నీ సులభగ్రాహ్యమైన పదాలైనప్పటికీ). కనుక ప్రజాకవిత్వమనిపించుకోజాలదు. ప్రఖ్యాత రష్యన్ విప్లవకవి మయకోవ్‌స్కీ అత్యున్నతమైన భావాలతో కవిత్వం వ్రాశాడు. కాని అతని శైలి, భావప్రకటనరీతి ప్రతి కార్మికమాత్రుడికి సన్నిహితంగా చేరగలిగింది. ఒక కార్మికసభలో మయకోవ్‌స్కీ ఏదో కావ్యం చదువుతున్నాడు:

"With Marx in our heads
And with Lenin in our hands."

అని చదవగానే, సభలోనుంచి కార్మికుడొకడు లేచి,

"And you, Comrade
Maya kovsky in our hearts."

అని పూర్తిచేశాడు. ఈ విధంగా (అ)సంఖ్యాకులైన ప్రజలను చేరగలిగినదే ప్రజాకవిత్వ మనిపించుకుంటుంది. మిగతాది అయోమయకవిత్వమే. అయినప్పటికీ ఈ రోజుల్లో అభ్యుదయ కవిత్వం సాగిస్తున్న బహుకొద్ది మందిలో ఒకరైనందుకు ఈకవిని అభినందించవలసివుంది. —(ఎన్పార్)

★

దివాళా రాజ్యం:

"సబ్బులు, దువ్వెనలు, దారం, సూదులు, బొత్తాములు, రేజర్లు మొదలైన చిన్న చిన్న వస్తువులుకూడా యుగోస్లావ్ ప్రజలకు కరువుగా ఉన్నాయి. ఇందువల్ల ప్రజల్లో కలిగే అసంతృప్తి యుద్ధంవస్తే ఎదురొడ్డాలనే వాంఛమీద దెబ్బతీస్తోంది...నిరుద్యోగులసంఖ్య పెరిగిపోయింది. ముడిపదార్థాల కొరతకారణంగా ఫ్యాక్టరీలు మూసివేయబడుతున్నందున, నిరుద్యోగులింకా అధికం కాగల అవకాశం ఉంది. ఇళ్లకొరత తీవ్రంగా ఉంది. దీన్నిగూర్చి ఒక హాస్యోక్తి కూడా బయల్దేరింది:

"బెల్‌గ్రేడ్‌లో వ్యభిచారమనే మాట లేదు. వ్యభిచారిణుల కొరతవల్ల కాదు. తగినన్ని శయ్యాగారాలు లేక."

ఫిబ్రవరిఅంతంలో పరిస్థితినిబట్టి చూస్తే యుగోస్లావియాకు బయటివాళ్ల దురాక్రమణ భయంకన్నా, అంతరంగిక ఆర్థిక వినాశన భయమే ప్రబలంగా ఉన్నట్టు తేలుతున్నది. యుగోస్లావియాకు బయటినుంచి సహాయం రాకపోతే క్రమంగా ఆర్థిక వ్యవస్థయావత్తూ కూలిపోక తప్పదు.

—న్యూస్ వీక్.

క్షణ కణముల్....

"దురాక్రమణ చేసేవారి గతి ఇంతే" అని చూపించటమే ఇప్పుడు అమెరికా తన లక్ష్యంగా పెట్టుకుంది...కొరియాను విముక్తంచేసి ఏకం చెయ్యటం కాదు.

—న్యూస్‌వీక్

దేవుని సొంత రాజ్యమైన అమెరికాలో....

జార్జియా రాష్ట్రశాసనసభ గతవారం 20,75,05,708 డాలర్ల బడ్జెట్ ఖర్చులను ఆమోదించింది. కాని రాష్ట్ర గవర్నరు టాల్మడ్జిగారి ఆజ్ఞానుసారం శాసనసభ్యులు ఒక షరతు తగిలించారు:—

'నీగ్రోలనూ, శ్వేతజాతివారిని కలిపి చేర్చుకునే కాలేజీలకుగాని, స్కూళ్ళకిగాని ప్రభుత్వం ధనసహాయం చెయ్యరాదు—కోర్టులు ఆజ్ఞాపించినా సరే ఒక వేళ కోర్టులు ప్రభుత్వం సహాయంచేసితీరాలని పట్టుబడితే—బడ్జెట్‌లో విద్యకోసమని కేటాయించబడిన యావత్తు ధనాన్ని రద్దుచేసెయ్యాలి.

—న్యూస్‌వీక్ (ఫిబ్రవరి 26)

అమెరికా "ఔదార్యం"

చాల నెలలనుండీ అమెరికన్ పత్రికలలో నెహ్రూ ప్రభుత్వంమీద ద్వేషపూరిత ప్రచారం జరుగుతోంది. మార్చి 6వ తేదీ 'న్యూస్‌వీక్' పత్రికలో హెన్రీ హాజ్లిట్ అనే 'ఆర్థికవేత్త' ఒక వ్యాసం వ్రాశాడు, "ఏంచేస్తే కరువులు వస్తాయి" అనే శీర్షికతో. నెహ్రూ వ్యతిరేక ప్రచారానికి దీన్ని మచ్చుతునకగా తీసుకోవచ్చు. హాజ్లిట్ 'మహాశయుడు' ఇలా వ్రాశాడు.

నిజమైన కరువులు, అబద్ధపు కరువులు ప్రపంచంలో ఏమూల సంభవించినా, అమెరికన్ ప్రజల ముక్కులు పిండి వసూలుచేసి సహాయం చెయ్యాలని, ఇతరదేశాలవాళ్లు, అమెరికన్ ఫెయిర్ డీలర్లుకూడా భావిస్తున్నారు. సాధ్యమైనంతవరకూ కరువుల్ని తొలగించటానికి ప్రయత్నించవలసిందే. కాని ఆ కరువు ఎందుకు వచ్చింది, దాన్ని తొలగించటం ఎవరి బాధ్యత, ఆ కరువు మళ్ళీ రాకుండా చెయ్యటం ఎల్లా, అని ఆలోచించుకోవాలి."

ఇండియాలో కరువు వచ్చిందంటే అది నెహ్రూ ప్రభుత్వపు ఆర్థిక విధానాలవల్లనే నని ఆరోపిస్తూ ఆయన ఈ క్రింది కారణాలిచ్చాడు.

"1. నెహ్రూప్రభుత్వం ప్లానింగు చేసే ప్రభుత్వం; అది సోషలిస్టు ప్రభుత్వం. అన్ని సోషలిస్టు ప్రభుత్వాల్లాగానే నెహ్రూ ప్రభుత్వంకూడా ఇండియాని పారిశ్రామికం చేయ తలపెట్టింది. దీనివల్ల వ్యవసాయం దెబ్బతిని, ఆహారకొరత ఏర్పడింది.

2. పత్తి, జనుముల ఉత్పత్తిలో ఇండియాని స్వయంసమృద్ధం చెయ్యాలని, తద్వారా పాకిస్తాన్ మొదలైన దేశాలతో ప్రమేయం లేకుండా చేసుకోవాలని నెహ్రూ ఎత్తువేశాడు. పత్తి, జనుము ఉత్పత్తి ఎక్కువ చెయ్యటానికిగాను ఆహారం పండించే భూమిని తగ్గించాడు.

3. ధాన్యం ధరలపై కంట్రోలు పెట్టడంవల్ల ధాన్యోత్పత్తి, అమ్మకంతగ్గిపోయాయి. పైగా వ్యవసాయదారులనుండి బలాత్కారంగా ధాన్యసేకరణ చెయ్యటం జరిగింది.

4. ఇండియాప్రభుత్వందగ్గర డాలర్లు కొరవగా ఉన్నాయి కనుక ధాన్యం ఉచితంగా ఇచ్చివెయ్యాలని వాదించటం ఆర్థికశాస్త్రరీత్యా బూతు. డాలరుకొరతను నెహ్రూ ప్రభుత్వం చేజేతులా తెచ్చిపెట్టుకున్నదే. ద్రవ్యమారకంపై కంట్రోలు పెట్టడంవల్లనే డాలర్ కొరత ఏర్పడింది."

ఈవిధంగా నెహ్రూ ప్రభుత్వం కోరి కోరి కరువు తెచ్చుకుంటే ఆ కరువు తొలగించటానికి అమెరికన్ ప్రజలను బాధపెట్టవలసిన అవసరం ఏమిటి, అని హాజ్లిట్ 'మహాశయుడు' ట్రూమన్‌ను ప్రశ్నిస్తున్నాడు. (ఏటేటా అమెరికాలో లక్షల టన్నుల ఆహారపదార్థాలు ఎందుకు ధ్వంసం చెయ్యబడుతున్నాయో, అనిమాత్రం ప్రశ్నించలేదు.) నెహ్రూ ప్రభుత్వం దీర్ఘకాలబుణం పద్ధతిమీద ధాన్యం అడిగ్గా, ట్రూమన్ ఉచితంగా ఇవ్వాలని ఎందుకు కోరుతున్నాడు అని కూడా ప్రశ్న వేశాడు. (కాని ఈప్రశ్నకు అతడు సమాధానం వివరించలేదు.) ఒక వేళ అమెరికా ప్రజలు ఎలాగో కష్టపడి ఉచితసహాయం చేసినా, ఇండియాలో నూటికి 85 మంది విద్యాశూన్యులు కనుక వాళ్లకి 'అమెరికా మనకోసం ఇంత త్యాగం చేసింది' అనే మాట తెలియదని కూడా హాజ్లిట్ అన్నాడు. తన వ్యాసాన్ని ముగిస్తూ, అధికంగా ఉత్పత్తి చెయ్యనంతవరకూ, ఇండియానిగాని ప్రపంచాన్నిగాని దారిద్ర్యంనుంచి తప్పించటం సాధ్యంకాదనీ, ప్రభుత్వాల ప్లానింగు, ధరల కంట్రోలు, సోషలిజములవల్ల ఉత్పత్తి తగ్గిపోతుందనీ ఈ 'ఆర్థిక శాస్త్రవేత్త' వ్రాశాడు.

ఈజిప్టు - బ్రిటన్

ఈజిప్టులోని బ్రిటిష్ సేనలనుగూర్చి అరబ్బీ వారపత్రిక 'అఖ్బార్-ఎల్-యౌమ్' వ్యాఖ్యానిస్తూ, ఈజిప్టు, బ్రిటన్‌లకు రెండురకాల ఒడంబడికలు బహుశా జరగవచ్చునని సూచించింది. బ్రిటిష్‌సేనలను ఉపసంహరిస్తూ ఒక బహిరంగ ఒడంబడిక, అంతర్జాతీయ పరిస్థితి దృష్ట్యా ఈజిప్టులో బ్రిటన్ సేనల్ని ఉంచుతూ ఒక రహస్య ఒడంబడిక జరగవచ్చుననీ, 'బ్రిటన్ వాకిలిగుండా బయటికి వెళ్లి, కిటికీగుండా లోపలికి రావాలని చూస్తున్న'దనీ ఆ పత్రిక వ్రాసింది.

—కైరో వా[illegible]

* * *

ఆంధ్రపత్రిక

శ్రీ ఖరనామ సంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరంపంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం

రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

★ కొత్తపంచాంగాలు సిద్ధమైనవి ★

---

100 పుటలు	వెల	ప్రతి 1-కి	0-4-0
,,	,,	100 -కి	16-0-0
,,	,,	1000 -కి	150-0-0

రైలు ఖర్చులు ప్రత్యేకం.

1000 కాపీలు ఒకే దఫా కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు - ఆంధ్రపత్రిక, మద్రాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras.